# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 259 | హైదరాబాద్ | గురువారం 09-04-2026 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

ఇరాన్‌లో పాలన మారింది...
ఇక కలిసి పనిచేస్తాం: ట్రంప్

## నాదర్‌గూల్ భూములపై హరీశ్‌కు
# పొంగులేటి కౌంటర్

- బీఆర్ఎస్ హయాంలోనే రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ జరిగిందన్న మంత్రి
- హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022 లోనే నిర్మాణాలు ప్రారంభమైనట్లు వెల్లడి
- ఇది ప్రభుత్వ భూమి అని కేసీఆర్ ప్రభుత్వం పిటిషన్ దాఖలు చేయలేదన్న మంత్రి



11లో



## సీఎస్ఆర్: ఖర్చు కాదు..
# అభివృద్ధిలో భాగస్వామ్యం!

- ప్రాధాన్యత రంగాల ఎంపిక - ప్రభుత్వ సహకారం
- స్థానిక ప్రాంతాల అభివృద్ధికి పెద్దపీట
- విద్యపై పెట్టుబడి - భవిష్యత్ తరాల నిర్మాణం
- ప్రపంచస్థాయి నైపుణ్యం - కంపెనీల భాగస్వామ్యం

11లో

## హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం
# ముగ్గురు మృతి

- సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద రోడ్డు ప్రమాదం
- నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీద వెళుతున్న ఇద్దరిని ఈడ్చుకెళ్లిన కారు
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

11లో



## శాంతి ఒప్పందం వేళ..
# ఇరాన్ ఆయిల్ రిఫైనరీపై దాడి

- లావన్ ద్వీపంలోని చమురు శుద్ధి కేంద్రాన్ని శత్రువులు లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడి
- ఈ దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించిన ఎన్ఐఓఆర్డీసీ
- ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని స్పష్టీకరణ



11లో





11లో

## హైడ్రా పనితీరుకు జాతీయ ఖ్యాతి..
# చెన్నైలోనూ అమలుకు సీఎండీఏ ఆసక్తి!

- హైడ్రా పనితీరుపై చెన్నై మెట్రోపాలిటన్ అథారిటీ ప్రశంసలు
- చెన్నైలో వరదల నివారణకు హైడ్రా మోడల్‌పై అధికారుల ఆసక్తి
- అమీర్‌పేట, ప్యాట్నీ నాలాల విస్తరణ పనుల పురోగతిని చెన్నై అధికారులకు వివరించిన రంగనాథ్
- ఖానామెట్‌లో తాజాగా రూ.1200 కోట్ల విలువైన భూమిని కాపాడిన హైడ్రా

## రేపే ముక్కోణపు పోరు
# కేరళ, అసోం, పుదుచ్చేరిలో పోలింగ్

- అసోం, కేరళ, పుదుచ్చేరిలో గురువారం ఒకే విడత అసెంబ్లీ ఎన్నికల పోలింగ్
- మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగం
- అసోంలో వరుసగా మూడోసారి గెలుపుపై బీజేపీ ధీమా
- కేరళలో అధికారాన్ని నిలబెట్టుకోవాలని పినరయి విజయన్ సర్కార్ పోరాటం
- పుదుచ్చేరిలో ఐదోసారి సీఎం పీఠంపై ఎన్. రంగస్వామి కన్ను

11లో




## రెవెన్యూ శాఖపై బాబు సమీక్ష
# లక్షల కుటుంబాలకు లబ్ధి!



11లో

- అ రెవెన్యూ శాఖపై సీఎం చంద్రబాబు కీలక సమీక్ష
- లక్షల కుటుంబాలకు లబ్ధి చేకూర్చేలా కీలక నిర్ణయాలు
- 1.37 లక్షల ఎకరాల ఇనాం భూములకు 22ఏ నుంచి విముక్తి
- 2016 ముందునాటి ప్రభుత్వ గృహ పట్టాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం
- 2027 మార్చి నాటికి రీ-సర్వే 2.0 పూర్తి చేయాలని ఆదేశం

# విస్తరణ 'భారం'.. పాలన 'తీరం'!





- పెరిగిన నగరం.. తరిగిన సిబ్బంది
- 30 వేల మంది కొలువులు ఉంటేనే పౌర సేవలు సుగమం
- పని ఒత్తిడిలో మున్సిపల్ ఉద్యోగులు.. నియామకాలపై సర్కారు కన్ను పడేనా?





12లో

# హస్తినకు దీదీ...

ఈ దేశంలో మహిళా ప్రధానమంత్రిగా ఏకైక నాయకురాలు శ్ ఇందిరా గాంధీ ఉండేవారు. ఆమె ఐరన్ లేడీగా బలమైన ముద్ర వేసుకున్నారు. పశ్చిమబెంగాల్‌లో టీఎంసీ మరోసారి అధికారంలోకి తీసుకురావాలని మమతా బెనర్జీ కాళ్లకు చక్రాలు కట్టుకొని తిరుగుతున్నారు. ఆమెను ఎలాగైనా అధికారంలో నుంచి దించి కాషాయపు జెండా ఎగరేయాలని బీజేపీ ప్రతి వ్యూహాలతో ప్రయత్నాలు చేస్తోంది1966 నుంచి 1977 దాకా ఏకంగా 11 ఏళ్ళ పాటు కంటిన్యూస్ గా దేశాన్ని పాలించిన ఇందిర బలమైన నాయకురాలిగా జాతీయంగా అంతర్జాతీయంగా ఎదిగారు. ఇక 1980 నుంచి 1984లో మరణించేంతవరకు మరో అయిదేళ్ల పాటు ప్రధానిగా పాలించారు. మొత్తంగా 16 ఏళ్ల పాటు దేశాన్ని ఇందిరాగాంధీ ఏలారు. ఆమె తరువాత మరో మహిళ ఈ దేశంలో ప్రధాని పీఠం ఎక్కలేదు. అయితే ఇపుడు ఒక మహిళా నేత పేరు ఈ పదవి కోసం గట్టిగా వినిపిస్తోంది. ఆమె ఎవరో కాదు బెంగాల్ ప్రజల చేత దీదీ అని పిలిపించుకుని ముమ్మారు పశ్చిన బెంగాల్ కి ముఖ్యమంత్రిగా పనిచేసి వరుసగా నాలుగవ సారి గెలిచి రికార్డు బద్ధలు కొట్టాలని చూస్తున్న తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ. బెంగాల్ లో ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తృణమూల్ కాంగ్రెస్ కీలక నేత అభిషేక్ బెనర్జీ ఒక సభలో మాట్లాడుతూ పాకిస్తాన్ ని ఉద్దేశించి హెచ్చరికలు జారీ చేశారు. కోల్ కటా మీదకు వస్తామని ఇళ్లలో దాడి చేస్తామని పాక్ పాలకులు అంటున్నారని కానీ తామే పాకిస్తాన్ మీదకు వెళ్ళి వారి సంగతి తేలుస్తామని వార్నింగ్ ఇచ్చారు. మమతా బెనర్జీ ఇండియా కూటమి తరఫున కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తరువాత ఇది తప్పకుండా జరుగుతుందని ఆయన స్పష్టంగా చెప్పారు. దీనిని బట్టి చూసిన వారు మమత ఇండియా కూటమి తరఫున ప్రధాని అభ్యర్థిగా ముందుకు వస్తున్నారా అన్న చర్చిస్తున్నారు.మూడు సార్లు బెంగాల్ సీఎం గా ఉన్న మమత 2026 ఎన్నికల్లో కనుక గెలిస్తే 2029 నాటికి ఆమె జాతీయ రాజకీయాల్లోకి వస్తారు అన్న చర్చ సాగుతోంది. మమత చూపు అపుడు ఢిల్లీ మీదనే ఉంటుందని అంటున్నారు. ఆ మాటకు వస్తే చాలా కాలంగా మమత జాతీయ రాజకీయల మీద ఆసక్తిగా ఉన్నారని అంటున్నారు. ఇక ఇండియా కూటమిలో కాంగ్రెస్ పెద్ద పార్టీగా ఉంది. ఆ తరువాత తృణమూల్ కాంగ్రెస్ ఉంటుంది. అందులో మరో బలమైన పార్టీగా డీఎంకే ఉన్నా కూడా సీనియారిటీ అనుభవం అన్నీ కలసి మమత ఇండియా కూటమి నాయకత్వాన్ని కోరుకుంటారు అని అంటున్నారు. బెంగాల్ లో విజయం తరువాత ఆమె ఇండియా కూటమి బాధ్యతలు తీసుకుని మోడీ సర్కార్ మీద గట్టిగా పోరాడుతారు అని అంటున్న ఇక మహిళా రిజర్వేషన్ అన్నది 2029 ఎన్నికల్లో గెలిచేందుకు తమ పార్టీకి ట్రంప్ కార్డు అవుతుందని బీజేపీ భావిస్తోంది కానీ అదే సమయంలో దేశంలో లోక్ సభ సీట్లు 840 దాకా పెరిగితే మాత్రం అందులో మూడవ వంతు మహిళా ఎంపీలే ఉంటారు అన్నది మరచిపోరారు. అలా లెక్క తీస్తే 280 దాకా ఎంపీ సీట్లు మహిళలకు దఖలు పడతాయి. దాంతో మహిళలు కూడా ప్రధాని పీఠం మీద గురి పెట్టేందుకు అవకాశాలు అధికం అవుతాయని అంటున్నారు. ఇక ఇండియా కూటమిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నా కూడా లీడ్ తీసుకుని బీజేపీ మీద పోరాటానికి మమత సిద్ధం అవుతారు అని అంటున్నారు. ఇండియా కూటమి నుంచి రేసులో : ఆ విధంగా డైనమిక్ లీడర్ షిప్ ని ఆమె ఇస్తారని తృణమూల్ కాంగ్రెస్ వర్గాలు అంటున్నారు. 292 సీట్లు ఉన్న పశ్చిమబెంగాల్‌లో మాట్రిజ్ ఓ సర్వే నిర్వహించింది. ఇందులో ఆసక్తికరమైన విషయాలు వెలుగులోకి వచ్చాయి. ఇక్కడ పోటీ అంచనాలు అందనంతగా ఉంది. తాజా సర్వేలో పార్టీలే షేక్ అయ్యే అభిప్రాయాలు ప్రజలు చెప్పారు. ఈ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ 43 శాతం ఓట్లతో 140 నుంచి 160 సీట్లను గెలుచుకోగలదు. ప్రతిపక్ష భారతీయ జనతాపార్టీ 41 శాతం ఓట్లతో 130 నుంచి 150 సీట్లు గెలుచుకుంటుంది. రాష్ట్రంలోని ఇతర పార్టీలు 16 శాతం ఓట్లతో 8 నుంచి 16 సీట్లు గెలుచుకోగలవు. పశ్చిమ బెంగాల్‌లో 148 సీట్లు గెలుచుకున్న పార్టీ అధికారంలోకి వస్తుంది. ఈ అభిప్రాయ సేకరణలో టీఎంసీకి 2 శాతం స్వల్ప ఆధిక్యం ఉన్నప్పటికీ ఈ తేడా చాలా తక్కువగా ఉండటంతో ఎన్నికల చిత్రం ఏ క్షణంలోనైనా మారిపోవచ్చు. మమత తరువాత కీలక హోదాలో పార్టీలో ఉన్న అభిషేక్ బెనర్జీ ఈ వ్యాఖ్యలు చేశారు అంటే మమత కచ్చితంగా కాబోయే ప్రధానిగా ఇండియా కూటమి నుంచి రేసులో ఉంటారు అన్నది స్పష్టం అవుతోంది. ఇతర ప్రాంతీయ పార్టీల మద్దతు ఉంటే ఇండియా కూటమి సారధ్యం ఆమెకు దక్కడం కూడా కష్టమేమీ కాదు, మొత్తానికి ఇవన్నీ ఆలోచించే అభిషేక్ బెనర్జీ ఈ కామెంట్స్ చేసి ఉంటారని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# మళ్లీ తెరపైకి గ్రేటర్ రాయలసీమ

కర్నూలు, ఏప్రిల్ 8, (

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరోసారి ప్రాంతీయ వాదం తెరపైకి వచ్చింది. ఒకప్పుడు తెలంగాణ ఉద్యమం ఉధృతంగా సాగిన టైమ్‌లోనే రాయలసీమ అస్తిత్వం అంటూ చర్చలు జరిగాయి. ఇప్పుడు గ్రేటర్ రాయలసీమ అంటూ మాజీమంత్రి మైసూరారెడ్డి మరోసారి స్లోగన్ అందుకున్నారు. నవ్యాంధ్రలో ఇప్పుడిప్పుడే రాజధాని వ్యవహారం ఒక కొలిక్కి వచ్చిందని అంతా అనుకుంటున్నారు. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణా విడిపోయాక 2014 నుంచి 12 ఏళ్లుగా ఏపీ రాజధాని అంశం ప్రతి రోజు చర్చకు వస్తోంది.ఇప్పుడు అమరావతి రాజధానిగా పార్లమెంట్ ఉభయసభలు లైన్ క్లియర్ చేసినా..వైసీపీ మాత్రం మావిగన్ స్లోగన్ బలంగా వినిపిస్తోంది. ఏపీ రాజధానిగా అమరావతికి హోదా దక్కిందన్న సంతోషం దక్కిందో లేదో..వైసీపీ క్యాపిటల్ ఫైట్‌కు తెరలేపింది. సరే అది ఎప్పటికీ ఉండే ముచ్చటే అనుకుంటే..సీనియర్ రాజకీయ నేత మాజీమంత్రి మైసూరారెడ్డి ఒక బాంబు పేల్చారు. ఏపీలో రాజధాని పరిణామాలు, రాజకీయాలు చూస్తుంటే గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం తప్పదని అనిపిస్తోందని సంచలన వ్యాఖ్యలు చేశారు.ఏపీలో రాయలసీమకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. విభజన సమయంలో ఆనాటి కేంద్ర ప్రభుత్వం నియమించిన శివరామకృష్ణన్ కమిషన్ చేసిన సిఫార్సులను గుర్తు చేశారు. అమరావతి ప్రాంతాన్ని కానీ విజయవాడ గుంటూరును కానీ రాజధానిగా ఎంపిక చేయొద్దని శివరామకృష్ణన్ కమిషన్ కీలక సూచనలు చేసిందంటున్నారు. దొనకొండ దగ్గర ఏకంగా 70 వేల ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని కూడా కమిషన్ చెప్పిందన్నారు. అంతే కాదు రాజధాని నిర్మాణం కోసం వ్యవసాయ భూములను తీసుకోవద్దని ప్రైవేట్ భూములు అంతకంటే తీసుకోవద్దని కమిషన్ చెప్పిందంటున్నారు.కానీ 2014లో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు పట్టుబట్టి మరీ వ్యవసాయ భూములు, పైగా ముంపు ప్రాంతం అయిన అమరావతిని ఎంపిక చేశారని మైసూరారెడ్డి విమర్శించారు. మావిగన్ పేరుతో జగన్ కొత్త ప్రతిపాదనలు చేయడం మరింత బాధాకరం అన్నారు. నాడు అమరావతికి ఓకే చెప్పి..ఆ తర్వాత మూడు రాజధానుల నినాదాన్ని ముందుకు తెచ్చారన్నారు. ఇప్పుడు మావిగాన్ అంటూ అర్థం పర్దం లేని మాటలు ఎందుకు అంటూ మండిపడ్డారు. శివరామ కృష్ణన్ కమిషన్ వద్దు అన్నచోటే ఈ ఇద్దరు నాయకులు రాజధాని అంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ఈపాటికే గ్రేటర్ రాయలసీమ ఉద్యమాన్ని ప్రారంభించాల్సి ఉందని, వయసు కారణంగా ఆగిపోతున్నానని అంటున్నారు. కానీ రాయలసీమకు జరుగుతున్న అన్యాయంపై యువత స్పందించాలని వారు గ్రేటర్ రాయలసీమ నినాదంతో ఉద్యమించాలని మైసూరారెడ్డి పిలుపు ఇవ్వడం హాట్ టాపిక్‌గా మారింది.గ్రేటర్ రాయలసీమ డిమాండ్ కొత్తేమీ కాదు. ఏపీ, తెలంగాణ విభజన సమయంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ రాయల తెలంగాణ కావాలని సోనియా గాంధీకి విన్నవించారు. రాయలసీమలోని నాలుగు జిల్లాలను తెలంగాణతో కలిపితే అది ఒక బలమైన రాజకీయ శక్తిగా మారుతుందని ఆయన కోరారు. ఇక బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డి లాంటి వాళ్లు ప్రత్యేక రాయలసీమ అంటూ దీక్షలు కూడా చేశారు. రాయలసీమ హక్కులు, నీళ్ళు, నిధులు అంటూ కొన్నాళ్లు హడావుడి చేసి సైలెంట్ అయిపోయారు. గ్రేటర్ రాయలసీమ అంటూ మైసూరారెడ్డితో పాటు గంగుల ప్రతాప్‌రెడ్డి వంటి నేతలు గతంలోనే తెరమీదకు తెచ్చారు.ఆంధ్రప్రదేశ్ పర్యాటకంఒకప్పటి రాజధాని కర్నూలుతో పాటు మొత్తం రాయలసీమ ప్రాంతానికి ఇప్పటికీ అన్యాయం జరుగుతుందని చెబుతున్న నేతలు..కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాలకు దక్షిణ కోస్తా జిల్లాలైన నెల్లూరు, ఒంగోలు జిల్లాలను కలిపి గ్రేటర్ రాయలసీమ ప్రత్యేక రాష్ట్రం చేయాలన్నది వీరి ప్రధాన డిమాండ్. 2014లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు కూడా కొందరు సీమకు అన్యాయం జరుగుతోందని ఆందోళనలు చేపట్టారు. కానీ, 2019 నుంచి 2024 వరకు జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్ల కాలంలో ఈ గళం పూర్తిగా మూగబోయింది. ఆ సమయంలో రాయలసీమ గురించి ఏ ఒక్కరూ నోరు మెదపలేదు. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలో ఉండగా..ఓ వైపు అమరావతికి చట్టబద్ధత దక్కిన వేళ..గ్రేటర్ రాయలసీమ నినాదాన్ని పొలిటికల్ స్క్రీన్‌పైకి తేవడం ఆసక్తికరంగా మారింది.

# కూటమి ధీమా వెనుక కథేంటీ

ఒంగోలు, ఏప్రిల్ 8,

ఏపీలో ఎన్నికలకు ఇంకా మూడేళ్ల టైమ్ ఉంది. కానీ రాబోయే ఎన్నికలపై ఇప్పటి నుంచే చర్చ జరుగుతోంది. కూటమి లాంగ్ లీవ్ అంటున్న చంద్రబాబు, పవన్.. వైసీపీ మళ్లీ రాదు గాక రాదు అని తెగేసి చెప్తున్నారు. వచ్చే టర్మే కాదు..రాబోయే 30ఏళ్ల వరకు కూడా వైసీపీకి అవకాశమే ఇవ్వము అన్నట్లుగా చెప్పుకొస్తున్నారు. థర్టీ ఇయర్స్ స్థిరమైన నాయకత్వం ఉండేలా ప్లాన్ చేస్తున్నామని అంటున్నారు సీఎం చంద్రబాబు.ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత, అసహనం కలిసి వస్తాయని వైసీపీ దింపుడు కళ్లం ఆశ పెట్టుకుని కూర్చుందని..అది జరగదని క్లియర్ కట్‌గా చెప్పేస్తున్నారు టీడీపీ అధినేత. గత ఎన్నికల కంటే కూటమి..ఎస్పెషల్‌గా టీడీపీ మెరుగైన స్థానంలో ఉన్నట్లుగా చెప్పుకుంటున్నారు. తిరుపతి జిల్లా సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో చంద్రబాబు చేసిన ఈ ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చుట్టూ ఆసక్తికర చర్చ జరుగుతోందివైసీపీ మళ్లీ అధికారంలోకి రాదు. ఎలా పవర్‌లోకి వస్తారో చూస్తానంటూ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రిపీటెడ్‌గా కామెంట్స్ చేస్తున్నారు. ఓ రకంగా వైసీపీకి ఛాలెంజ్ కూడా చేస్తున్నారు. ఇప్పుడు సీఎం చంద్రబాబు కూడా సుత్తి లేకుండా సూటిగా చెప్పేస్తున్నారు. ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందన్న ఆశలు వద్దు. మీకు ఆ ఛాన్స్ ఇవ్వం. అంత సీన్ కూడా లేదంటున్నారు.రాబోయే 30 ఏళ్ల పాటు స్థిరమైన నాయకత్వం ఉండేలా మాస్టర్ స్కెచ్ వేస్తున్నామని..అలా అయితే ఏపీ డెవలప్‌మెంట్ అన్‌స్టాపబుల్ అన్నట్లుగా పరుగులు పెడుతుందని చెప్తున్నారు. వైసీపీ హయాంలో జరిగిన విధ్వంసం నుంచి కోలుకోవడానికే సమయం పడుతుందని..అలాంటిది ఏపీ మిగతా రాష్ట్రాలతో పోటీ పడేలా..దేశంలో అగ్రగామిగా నిలబడాలంటే..బలమైన, స్థిరమైన నాయకత్వం అవసరమని అంటున్నారుఅయితే ప్రభుత్వ వ్యతిరేకత మీదే వైసీపీ హోప్స్ పెట్టుకుందని ..కానీ అలా జరగనివ్వబోమని చెప్పడం ఇంట్రెస్టింగ్‌గా మారింది. బాబు ఇంత ఔట్ రైట్‌గా ఓ కామెంట్ చేయడం అంటే ఆశామాషీ కాదు. ఆయన థర్టీ ఇయర్స్ ఇండస్ట్రీగా పాలిటిక్స్‌లో ఎన్నో ఎత్తుపల్లాలు చూసిన నాయకుడు. అలాంటి చంద్రబాబు తమ ప్రభుత్వంపై ప్రజా వ్యతిరేకత రాదు..రానివ్వమంటూ ధీమా వ్యక్తం చేయడం..ఇండైరెక్ట్‌గా ఫ్యాన్ పార్టీని ఛాలెంజ్ చేయడం పొలిటికల్ హాట్ టాపిక్‌గా మారిందఇంతకు బాబు ధైర్యం వెనుకున్న రహస్యం ఏంటన్నదే డిబేట్ పాయింట్ అవుతుంది. అధికారంలో ఉండి..పైగా ఇంకో మూడేళ్ల పాలన మిగిలి ఉండగానే..వైసీపీ ఎత్తులను పసిగట్టడం ఒక ఎత్తు అయితే..వైసీపీ పెట్టుకున్న ఆశలు అడిఆశలు అవుతాయని చెప్పడం మరో ఎత్తు. అయితే బాబు ఇంత కాన్ఫిడెంట్‌గా ఉండటానికి రీజనేంటి అన్నదే చర్చకు దారితీస్తోంది.నిజానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి బాబు..చాలా జాగ్రత్త పడుతున్నారు. ఎక్కడా ప్రజా వ్యతిరేకత రాకుండా..ప్రతీ విషయంలో కేర్ తీసుకుంటున్నారు. ఎమ్మెల్యేల పనితీరు అయినా..అభివృద్ధి విషయంలో అయినా..సంక్షేమ పథకాలు అమలులో అయినా..రాజకీయ విమర్శల్లో కూడా ఎక్కడా చిన్న మిస్టేక్ జరగకుండా ఆచితూచి అడుగులు వేస్తున్నారు.ప్రజా వ్యతిరేకత రాకుండా ప్లాన్ చేసుకోవడం ఒక ఎత్తు అయితే..ఎప్పటికప్పుడు ప్రజలు కూటమి ప్రభుత్వం గురించి ఏమనుకుంటున్నారు? ఏ విషయంలో అసంతృప్తిగా ఉన్నారని పబ్లిక్ పల్స్ తెలుసుకుంటున్నారు. పైగా సంక్షేమ పథకాల విషయంలో ఇచ్చిన మాట ప్రకారం ఒకదాని తర్వాత మరో హామీని అమలు చేసుకుంటూ వస్తున్నారు.ఇప్పటికే కీలక పథకాలన్నింటిని గ్రౌండ్ చేశారు. మిగిలిన చిన్న చితక హామీలేమైనా ఉంటే ఎన్నికల నాటికి అవి కూడా ఇంప్లిమెంట్ చేసే ఆలోచనలో ఉన్నారట. ఈ అన్ని విషయాలపై బేరీజు వేసుకుని..క్షేత్రస్థాయిలో పరిస్థితులను తెలుసుకున్నాకే చంద్రబాబు భరోసా పెరిగిందన్న టాక్ వినిపిస్తోంది. ఏదైనా వైసీపీని టార్గెట్ చేస్తూ టీడీపీ అధినేత చేసిన వ్యాఖ్యలు అయితే ఏపీ పాలిటిక్స్‌లో ఇంట్రెస్టింగ్ డిస్కషన్‌కు దారితీశాయి.

# విజయవాడ స్టేడియానికి మహర్దశ

విజయవాడ, ఏప్రిల్ 8,

ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతం విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం అంతర్జాతీయ హంగులు అద్దుకోబోతోంది. రాష్ట్రంలో క్రీడారంగానికి పూర్వవైభవం తీసుకురావాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ఈ స్టేడియంను ప్రపంచ స్థాయి ప్రమాణాలతో పునరుద్ధరించాలని నిర్ణయించింది. విజయవాడ నగరాన్ని ఒక స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఇది మొదటి అడుగుగా ప్రభుత్వం భావిస్తోంది. ఈ ఆధునీకరణ పనులకు సంబంధించి ఈ నెల 8వ తేదీన అధికారికంగా శంకుస్థాపన జరగనుంది.రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఈ కార్యక్రమానికి హాజరై పనులను ప్రారంభించనున్నారు. క్రీడాకారుల కోసం అత్యాధునిక వసతులు మరియు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా ఈ భారీ ప్రాజెక్టును ప్రభుత్వం చేపట్టింది. పునరుద్ధరణలో భాగంగా స్టేడియంలో అత్యాధునిక రన్నింగ్ ట్రాక్స్, అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఇండోర్, అవుట్ డోర్ కోర్టులు నిర్మించనున్నారు. శిక్షణలో ఉండే క్రీడాకారుల కోసం అధునాతన హాస్టల్ సౌకర్యాలు, జిమ్ మరియు ఇతర సాంకేతిక పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు.భవిష్యత్తులో జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయి ఈవెంట్లకు ఈ స్టేడియం వేదికగా మారనుంది. ప్రపంచ స్థాయి పోటీలకు సరిపడేలా స్టేడియం సామర్థ్యాన్ని పెంచడంతో పాటు, ప్రతిభ ఉన్న క్రీడాకారులకు స్థానికంగానే అత్యుత్తమ శిక్షణ అందేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. కూటమి ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం పట్ల బెజవాడ క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ స్టేడియం అభివృద్ధి కోసం ప్రభుత్వం మొత్తం రూ. 53 కోట్లు వెచ్చించనుంది. ఇందులో మొదటి విడతగా రూ. 30 కోట్లతో పనులను ప్రారంభించనున్నారు.2027 నాటికి ఈ పనులన్నీ పూర్తి చేసి, 2029లో అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలను ఇక్కడ నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాన స్టేడియం మధ్యలో 400 మీటర్ల పొడవైన, 8-లేన్ల సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మించనున్నారు. ప్రస్తుతం ఉన్న శాప్ ప్రధాన కార్యాలయాన్ని తొలగించి, ఆ స్థానంలో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంను నిర్మించనున్నారు. టెన్నిస్, వాలీబాల్, బాస్కెట్‌బాల్ మరియు కబడ్డీ కోసం అదనంగా కొత్త ఔట్‌డోర్ కోర్టులను ఏర్పాటు చేయనున్నారు.

==============

# విశాఖ టూ మావిగన్

శ్రీకాకుళం, ఏప్రిల్ 8,

రాజధానుల విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి ఒక స్టాండ్ అంటూ లేకుండా పోతోంది. మొన్నటి వరకు మూడు రాజధానులు అన్న జగన్మోహన్ రెడ్డి మావిగన్ ప్రతిపాదన తీసుకొచ్చారు. మచిలీపట్నం- విజయవాడ- గుంటూరును కలుపుతూ మావిగన్ రాజధాని ఏర్పాటు చేయాలని ప్రత్యామ్నాయం సూచించారు. దాదాపు అమరావతి రాజధానికి దగ్గరగానే ఆయన సూచనలు ఉన్నాయి. కానీ ఇన్ని పరిణామాలు జరిగిన తర్వాత జగన్మోహన్ రెడ్డి ఈ మాట చెప్పడమే విమర్శలకు తావిస్తోంది. చంద్రబాబు అమరావతి ప్రతిపాదన చేసినప్పుడే ఈ మావిగన్ సూచించి ఉంటే బాగుండేది.

పోనీ అధికారంలోకి వచ్చిన తర్వాత మూడు రాజధానులు అనేకంటే.. ఈ మావిగన్ ప్రతిపాదన చేసి ఉంటే బాగుండేది. కానీ ఇప్పుడు ఆ ప్రతిపాదన చేస్తుండడం మాత్రం ఇబ్బందికరంగా మారింది. అనవసరంగా ఆయన టార్గెట్ అవుతూ వస్తున్నారు.ఒకవైపు మావిగన్ ప్రతిపాదన చేయగా.. ఇంకోవైపు ధర్మాన లాంటి సీనియర్ నేత వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ అన్యాయం గురించి ప్రశ్నిస్తున్నారు. నిన్నటి వరకు ఇదే ధర్మాన మేధావి ఉత్తరాంధ్రకు రాజధాని ప్రకటించడాన్ని హర్షించారు. విశాఖ పాలన రాజధానిని ఆహ్వానించారు. ముఖ్యంగా శ్రీకాకుళం జిల్లాలో ఊరువాడ ప్రచారం చేశారు. కానీ ఇప్పుడు ఆయన జగన్మోహన్ రెడ్డిని ఏం అనడం లేదు. ఆది నుంచి చంద్రబాబు స్టాండ్ అమరావతి. ఆయన మాట మార్చలేదు. కానీ మూడు రాజధానుల్లో భాగంగా విశాఖను పాలన రాజధాని చేస్తానన్నారు జగన్. దానిని విస్తృతంగా ప్రచారం చేశారు ధర్మాన. 2024 ఎన్నికలకు ముందు ఈ సీనియర్ నేత తన సొంత నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో దీనిపైనే డిబేట్ పెట్టారు. ప్రజలకు వివరించే ప్రయత్నం చేశారు. కానీ ఇప్పుడు జగన్ మూడు రాజధానుల నుంచి మావిగన్ వైపు వెళ్తే దాని గురించి పట్టించుకోవడం లేదు.ప్రస్తుతం ఉత్తరాంధ్రకు అన్యాయం జరిగింది అంటే అది జగన్మోహన్ రెడ్డి చేసినట్టే. జగన్మోహన్ రెడ్డి ఉత్తరాంధ్రలోని విశాఖను పాలనా రాజధానిగా ప్రకటించారు.

దానిని పెద్ద ఎత్తున ప్రచారం చేశారు ధర్మాన. ఇప్పుడు అదే జగన్ విశాఖ కాదు మావిగన్ అంటున్నాడు. కానీ ధర్మాన జగన్మోహన్ రెడ్డిని విడిచిపెట్టి చంద్రబాబును టార్గెట్ చేస్తున్నారు. ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమ వెనుకబడిన ప్రాంతమని.. విభజన చట్టమే చెప్పిందని.. 80 ఏళ్ల వయసులో కూడా ఉత్తరాంధ్ర ప్రజలు పొట్ట చేత పట్టుకుని వలస వెళ్తున్నారని.. రాయలసీమ బిడ్డగా ఉండి ఆ ప్రాంత అభివృద్ధికి చంద్రబాబు ఏం చేశారని నిలదీస్తున్నారు ధర్మాన. కానీ విశాఖ పాలన రాజధానిగా ప్రకటించి.. దాని నుంచి పక్కకు తప్పుకుంటున్న జగన్మోహన్ రెడ్డిని మాత్రం ఏమీ అనడం లేదు. అందుకే ధర్మాన అపరమేధావి అయ్యారు. శ్రీకాకుళం జిల్లా ప్రజలు నమ్మలేని స్థితికి చేరుకున్నారు.

# వృద్ధురాలి దారుణ హత్య

వికారాబాద్

వికారాబాద్ జిల్లా కుల్కచర్ల లో అదృశ్యమైన వృద్ధురాలు అస్తిపంజరమై దొరికింది. పోలీసుల వివ రాల ప్రకారం.. మండలం లోని బండవెల్కిచర్లకు చెందిన వెంకటమ్మ(63) శనివారం ఇంటి నుంచి బ్యాంకుకు వెళ్లింది. సాయం త్రమైనా తిరిగిరాకపోవడంతో ఆందోళనకు గురైన ఆమె కూతురు లక్ష్మి తెలిసిన వారి వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆది వారం కుల్కచర్ల పీఎస్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన పోలీసులు ఆమె కాల్ లిస్ట్ ఆధారంగా పక్కింటి మహిళ మంజులను విచా రించగా తన భర్త భీమయ్యతో పాటు బంధువు బీరయ్యతో కలిసి చంపినట్లు తేలింది. వృద్ధురాలి ఒంటిపై ఉన్న బంగారం కోసం ఆమెను ద్వీచక్ర వాహనం ఎక్కించుకుని తిర్మలాపూర్ గ్రామ సమీపంలోని పాండవుల బండపైకి తీసుకెళ్లి గొంతునులిమి చంపారు. అనంతరం పెట్రోల్ పోసి నిప్పంటించారని ఎస్ఐ రమేశ్ తెలిపారు.

==================================

# అంతర్జాతీయ హోటల్ గా రుషికొండ



విశాఖపట్టణం ఏప్రిల్ 8,

రుషికొండ భవనాల అదృష్టం త్వరలో మారబోతోంది. ఈ ప్యాలెస్‌ను ఏ విధంగా ఉపయోగించుకోవాలనే అంశంపై కేబినెట్ సబ్ కమిటీ కసరత్తును ముగించింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, ఈ భవనాలను ప్రజాధనానికి భారంగా కాకుండా, ప్రభుత్వానికి ఆదాయం తెచ్చే వనరుగా మార్చేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. ఈ నెల 10న జరగనున్న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకుని, అధికారిక ప్రకటన చేసే అవకాశం ఉంది.గతంలో రుషికొండపై ఉన్న హరిత రిసార్ట్స్ ద్వారా ప్రభుత్వానికి ఏడాదికి సుమారు 7 కోట్ల రూపాయల ఆదాయం వచ్చేది. కానీ ప్రస్తుతం నిర్మించిన ప్యాలెస్ నిర్వహణకే నెలకు 25 లక్షల రూపాయల వరకు ఖర్చవుతోంది. విద్యుత్ ఛార్జీలు, ఇతర నిర్వహణ ఖర్చులు కలిపి ఏడాదికి 3 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చవుతుండటంతో, ప్రభుత్వం దీనిని ప్రోపర్ యుటిలైజేషన్ చేయాలని నిర్ణయించింది. ప్రజల అభిప్రాయాలను గౌరవిస్తూ, సుమారు 1517 మంది నుంచి సేకరించిన సూచనల ఆధారంగా ప్రభుత్వం ఒక ప్రణాళికను రూపొందించింది. రుషికొండ ప్యాలెస్ నిర్వహణకు ప్రపంచస్థాయి గుర్తింపు ఉన్న ×తాజ్ గ్రూప్, ఎట్మాస్పియర్ కోర్, లీలా, ఫెమా వంటి నాలుగు ప్రముఖ సంస్థలు ఆసక్తి కనబరిచాయి. ఈ భవనాలను ఒక విలాసవంతమైన హోటల్ లేదా రిసార్ట్‌గా మార్చడం ద్వారా ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ఈ నాలుగు గ్రూపుల్లో ఒకదానికి నిర్వహణ బాధ్యతలు అప్పగించి, పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్యాలెస్‌ను కమర్షియల్ ప్రయోజనాల కోసం వినియోగించుకున్నప్పటికీ, సామాన్య ప్రజలు కూడా ఆ భవనాలను సందర్శించేలా నిబంధనలు రూపొందిస్తున్నారు. ఇది కేవలం ఒక రహస్య బంగ్లాగా మిగిలిపోకుండా, విశాఖ పర్యాటకంలో ఒక భాగంగా మార్చాలని కేబినెట్ సబ్ కమిటీ ప్రతిపాదించింది. ప్రభుత్వానికి ఆదాయం రావడంతో పాటు, ప్రజలకు కూడా దీని వల్ల ప్రయోజనం ఉండాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని కమిటీ సభ్యులు వెల్లడించారు. ఈనెల 10న కేబినెట్ ఆమోదం పొందిన వెంటనే ఈ విలాసవంతమైన భవనాల కొత్త రూపం ఖరారు కానుంది.

# టిప్పు సుల్తాన్ సర్కిల్ వివాదం,.. మళ్లీ మొదటికి

కడప, ఏప్రిల్ 8,

రాయలసీమ నడిబొడ్డున ఉన్న కడప నగరంలో టిప్పు సుల్తాన్ పేరుతో ఒక సర్కిల్‌ను ఏర్పాటు చేయాలని జరుగుతున్న ప్రయత్నాలు తీవ్ర ఉద్రిక్తతకు దారితీస్తున్నాయి. భారత చరిత్రలో అత్యంత వివాదాస్పద వ్యక్తిగా ముద్రపడిన టిప్పు సుల్తాన్ పేరును ప్రజా ప్రదేశాలకు పెట్టడం సరికాదని పలు హిందూ సంఘాలు , భారతీయ జనతా పార్టీ గట్టిగా వ్యతిరేకిస్తున్నాయి. అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న ఆంధ్రప్రదేశ్‌లో ఇటువంటి చర్యలు మతపరమైన విభేదాలను సృష్టించే కుట్రలో భాగమని బీజేపీ నేత విష్ణువర్ధన్ రెడ్డి ఆరోపించారు. టిప్పు సుల్తాన్ తన పాలనలో హిందూ సమాజంపై దాడులు చేశారని, దేవాలయాలను ధ్వంసం చేయడమే కాకుండా వేలాది మందిని బలవంతంగా మతమార్పిడి చేశారని బిజెపి నాయకులు గుర్తు చేస్తున్నారు. అటువంటి వ్యక్తిని గొప్పగా చిత్రీకరించడం భావ్యం కాదని, ఇది స్థానిక ప్రజల సెంటిమెంట్లను గాయపరచడమేనని వారు వాదిస్తున్నారు. గతంలో ఇదే జిల్లాలోని ప్రొద్దుటూరులో కూడా ఇటువంటి ప్రయత్నం జరిగినప్పుడు, హిందూ సమాజం తిరుగుబాటుతో అది ఆగిపోయిన విషయాన్ని ఈ సందర్భంగా వారు గుర్తు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఇటువంటి సున్నితమైన అంశాల్లో కఠినంగా వ్యవహరించాలని, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలను అడ్డుకోవాలని డిమాండ్లు వెల్లువెత్తుతున్నాయి. కావాలనే సమాజంలో చీలిక తెచ్చేందుకు కొందరు ఇటువంటి ప్రతిపాదనలను తెరపైకి తెస్తున్నారని, దీనిపై ప్రభుత్వం తక్షణమే స్పందించి శాంతిభద్రతలను కాపాడాలని బాధితులు , సామాజిక కార్యకర్తలు కోరుతున్నారు. ఈ వివాదంతో, కడప మున్సిపల్ కమిషనర్ , జిల్లా కలెక్టర్ ఈ ప్రతిపాదనకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి ఇవ్వకూడదని బిజెపి డిమాండ్ చేస్తోందది. స్థానిక ప్రజల మనోభావాలను గౌరవించాలని కోరుతోంది. టిప్పు సుల్తాన్ మద్దతుదారులు ఆయనను బ్రిటీష్ ఈస్ట్ ఇండియా కంపెనీకి వ్యతిరేకగా పోరాడిన మొట్టమొదటి పాలకుల్లో ఒకరిగా చూస్తారు. బ్రిటీష్ సామ్రాజ్యవాదాన్ని ఎదిరించిన మైసూరు పులి గా, దేశభక్తుడిగా ఆయనను గౌరవిస్తూ, ఆ జ్ఞాపకార్థం సర్కిల్‌కు ఆయన పేరు పెట్టాలని కోరుతుంటారు. కడప , ప్రొద్దుటూరు ప్రాంతాల్లో ముస్లిం జనాభా గణనీయంగా ఉంది. తమ సామాజిక వర్గానికి చెందిన ఒక చారిత్రక వీరుడి పేరును ఒక సర్కిల్‌కు పెట్టాలనేది ఆయా ప్రాంతాల్లోని ముస్లిం పెద్దలు మరియు నాయకుల దశాబ్దాల కాలం నాటి కోరిక. దీనిని మత సామరస్యానికి మరియు తమ గుర్తింపుకు చిహ్నంగా వారు భావిస్తారు. చారిత్రక ఆధారాల ప్రకారం టిప్పు సుల్తాన్ కుటుంబానికి కడపతో సంబంధం ఉంది. టిప్పు సుల్తాన్ తండ్రి హైదర్ అలీ తల్లి ఫాతిమా ఫక్రున్నీసా, అప్పటి కడప కోట గవర్నర్ అయిన మీర్ ముయినుద్దీన్ కుమార్తె. ఈ చారిత్రక అనుబంధాన్ని కూడా కొందరు కారణంగా చూపుతుంటారు

# బెదిరింపులతో సరేనా....

## చర్యలకు దిగుతారా

విజయవాడ ఏప్రిల్ 8,

ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో క్లీన్ పాలిటిక్స్ నినాదంతో వచ్చిన జనసేన పార్టీకి ఇప్పుడు తన సొంత ఎమ్మెల్యేల వ్యవహారశైలి పెద్ద సవాలుగా మారింది. 100 శాతం స్ట్రైక్ రేట్‌తో 21 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న పవన్ కళ్యాణ్, ఇప్పుడు వారిపై వస్తున్న వరుస ఆరోపణలతో డిఫెన్స్‌లో పడాల్సి వస్తోంది. కొత్తగా ఎన్నికైన కొందరు ఎమ్మెల్యేల అతి ఉత్సాహం, వ్యక్తిగత వివాదాలు, ఆర్థిక ఆరోపణలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వ్యక్తిగత వ్యవహారం ఇప్పుడు జనసేన పార్టీకి నైతిక సంక్షోభాన్ని తెచ్చిపెట్టింది. ఆయనపై వచ్చిన ఆరోపణలు, ఆపై బాధితురాలిపై జనసేన కార్యకర్తలు దాడికి పాల్పడ్డారన్న వార్తలు సోషల్ మీడియాలో దావానలంలా వ్యాపించాయి. హైకమాండ్ ఈ విషయంలో త్వరితగతిన స్పందించి కఠిన చర్యలు తీసుకోకపోవడం వల్ల, క్షేత్రస్థాయిలో పార్టీ కేడర్ అయోమయానికి గురవుతోంది. తప్పు చేస్తే సొంత వారినైనా వదలను అని చెప్పే పవన్ కళ్యాణ్, ఈ విషయంలో మౌనం వహించడం ప్రత్యర్థులకు ఆయుధంగా మారింది.విశాఖపట్నం శివారు నియోజకవర్గాల పరిధిలోని ఒక కీలక ఎమ్మెల్యేపై పారిశ్రామికవేత్తల నుండి, రియల్టర్ల నుండి భారీగా వసూళ్లు చేస్తున్నారనే ఫిర్యాదులు పవన్ కళ్యాణ్ దృష్టికి వెళ్లినట్లు సమాచారం. ముఖ్యంగా భూ వివాదాల్లో తలదూర్చడం, సెటిల్మెంట్లు చేయడం వంటి పాత రాజకీయ వాసనలు జనసేన ఎమ్మెల్యేల నుంచి రావడం పార్టీ సిద్ధాంతాలకు విరుద్ధం. అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ఇలాంటి ఆర్థిక ఆరోపణలు రావడం భవిష్యత్తులో పార్టీ ఉనికికే ప్రమాదకరంగా మారవచ్చు. నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి చుట్టూ ఇప్పుడు మనీలాండరింగ్ ఆరోపణలు తిరుగుతున్నాయి. విచారణ సంస్థల వద్ద ఉన్న సమాచారం అంటూ వస్తున్న వార్తలు జనసేనను ఇరకాటంలోకి నెట్టాయి. ఒకవైపు పవన్ కళ్యాణ్ అవినీతి రహిత పాలన గురించి మాట్లాడుతుంటే, మరోవైపు కీలక మహిళా ఎమ్మెల్యేపై ఇలాంటి తీవ్రమైన ఆరోపణలు రావడం పార్టీకి కొత్త సమస్యలను సృష్టిస్తోంది.జనసేన ఎమ్మెల్యేలలో అత్యధికులు రాజకీయాలకు కొత్త వారు కావడమే ఈ సమస్యలకు మూలమని భావిస్తున్నారు. తొలిసారి అధికారం దక్కడంతో, దానిని ఎలా నిర్వహించాలో తెలియక కొందరు అహంకారం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. అధికారులపై ఒత్తిడి తీసుకురావడం, నియోజకవర్గాల్లో ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం వల్ల కూటమిలో భాగస్వామిగా ఉన్న తెలుగుదేశం పార్టీ నేతలతో కూడా ఘర్షణలు తలెత్తుతున్నాయి. ఈ అపరిపక్వత పవన్ కళ్యాణ్ కష్టపడి సంపాదించిన విశ్వసనీయత ను దెబ్బతీస్తోంది.ఇటీవల పవన్ కళ్యాణ్ ఎమ్మెల్యేలతో ప్రత్యేకంగా సమావేశమై, ప్రజల్లో వ్యతిరేకత వస్తే ఉపేక్షించేది లేదు అని ఘాటుగా హెచ్చరించినట్లు ప్రచారం జరిగింది. ప్రతి ఎమ్మెల్యే పనితీరుపై రహస్యంగా సర్వేలు చేయిస్తున్నానని, అవినీతికి పాల్పడితే టికెట్లు ఉండవని కూడా స్పష్టం చేశారు. జనసేన పార్టీ భవిష్యత్తు ఇప్పుడు పవన్ కళ్యాణ్ తీసుకునే కఠిన నిర్ణయాలపైనే ఆధారపడి ఉంది. కేవలం సలహాలు, సూచనలతో సరిపెట్టకుండా, వివాదాస్పద ఎమ్మెల్యేలను పక్కన పెట్టడం లేదా బాధ్యతల నుండి తప్పించడం వంటి చర్యలు తీసుకుంటేనే పార్టీ పట్ల ప్రజల్లో ఉన్న నమ్మకం నిలుస్తుందని భావిస్తున్నారు.

=================

# ఎందుకు జూన్ 2024 తీసుకున్నారు...

విజయవాడ ఏప్రిల్ 8,

ఏపీప్రజల ఆకాంక్ష నెరవేరింది. రాష్ట్ర రాజధానిగా అమరావతికి చట్టబద్ధత లభించింది. ఏపీ ఏకైక రాజధానిగా అమరావతిని గుర్తిస్తూ.. ఏపీ పునర్విభజన చట్టం 2014 సవరిస్తూ తీసుకొచ్చిన బిల్లుపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సంతకం చేయగా.. న్యాయశాఖ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. 2024 జూన్ రెండు నుంచి ఏపీ రాజధానిగా అమరావతిని పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది. అమరావతి గెజిట్ నోటిఫికేషన్ లో 2024 జూన్ రెండు నుంచి రాజధానిగా గుర్తించినట్టు పేర్కొనడంపై పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. అదే తేదీ నుంచి ఎందుకు అని సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.2014లో రాష్ట్ర విభజన జరిగింది. ఉమ్మడి ఏపీకి హైదరాబాద్ రాజధానిగా ఉండేది. అయితే విభజన తర్వాత కూడా అంటే 2014 నుంచి 2024 వరకు పదేళ్లపాటు రెండు రాష్ట్రాలకు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ను ఉంచారు. అయితే ఆ గడువు 2024 జూన్ 2 తో ముగిసింది. ఈ క్రమంలోనే 2024 జూన్ రెండు నుంచి అమరావతి ఏకైక రాజధానిగా పేర్కొంటూ కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసింది.అయితే ఈ నిర్ణయం వెనుక రెండు కారణాలు ఉన్నాయి. ఉమ్మడి రాజధానిగా హైదరాబాదుకు ఇచ్చిన గడువు ముగియడం ఒకటి అయితే.. మూడు రాజధానుల ఎపిసోడ్ కు చెక్ పెడుతూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు అయింది. రాబోయే రోజుల్లో ఎలాంటి వివాదాలు లేకుండా చట్ట సవరణపై స్పష్టత ఇచ్చారు. ఒకవేళ భవిష్యత్తులో రాజధాని అమరావతి ఏవైనా మార్పులు, చేర్పులు చేయాలంటే పార్లమెంటుకు మాత్రమే అధికారం కట్టబెట్టారు. శాసనసభలో సవరణ చేసి మార్పు చేస్తామంటే కుదిరే పని కాదు.అయితే అంతా మూడు రాజధానులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే అమరావతికి చట్టబద్ధత కల్పించారని భావించారు. కానీ ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్ కు ఉన్న గడువు ముగిడంతోనే ఈ కీలక నిర్ణయం తీసుకున్నారన్న విషయం చాలామందికి తెలియదు. ఎంతవరకు మూడు రాజధానులకు చెక్ పెట్టాలన్న ఉద్దేశంతోనే.. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అనుకున్నారు. కానీ 2024 జూన్ 2 తో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగిసిందని కేవలం కొద్ది మందికి మాత్రమే తెలుసు

# శ్రీశైలం హైవే పై ఘోర రోడ్డు ప్రమాదం

రంగారెడ్డి

కందుకూరు ఎక్స్ రోడ్ లో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం లో ఒకరు మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయివ. మయూరి చికెన్ వాహనం డిసియం టైర్ పగిలి అదుపుతప్పి ఎదురుగా హైదరాబాద్ నుంచి కందుకూరు వస్తున్న కారును కందుకూరు లీ రోడ్ నవారు బాల్ రెడ్డి ఫంక్షన్ హాల్ వద్ద ఢీ కొట్టింది. కారులో ఒకే కుటుంబానికి చెందిన వారు వున్నారు. కారు నడుపుతున్న సురసాని భారత్ సింహ రెడ్డి అక్కడికి అక్కడే మృతి చెందారు. నలుగురికి తీవ్రగాయాలు అయ్యాయి.

# పెద్దూరులో పోలీసులు మీ కోసం కార్యక్రమం

సిరిసిల్ల ఏప్రిల్ 8,

సిరిసిల్ల పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని పెద్దురులో పోలీసులు మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు గంజాయి ,రోడ్డు ప్రమాదాలు, ట్రాఫిక్ నియమాలు, గల్ఫ్ ఏజెంట్ ల మోసాలు, సైబర్ మోసాలు, బెట్టింగ్ యాప్స్ ,మహిళా చట్టాలు, షీ టీమ్, నూతన చట్టాలపై అవగాహన, సీసీ కెమెరాల యొక్క ఆవశ్యకత గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ మధ్యకాలం లో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, సైబర్ నేరగాళ్ల మాయ మాటలు నమ్మి మోసపోవద్దని అన్నారు. ఎవరైనా మోసపోయినట్లైతే 1930 నంబర్ కి పిర్యాదు చేయాలని సూచించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరుగుతుంది. సీసీ కెమెరాల వలన ఏ సంఘటన జరిగిన వెంటనే తెలుస్తోంది అని తెలిపారు.

సిసి కెమెరాలు ఏర్పాటు సహకరించాలని కోరారు. వాహన దారులు తాగి డ్రైవింగ్ చేయవద్దని, లైసెన్స్ లేకుండ వాహనాలు నడపవద్దని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ఆవశ్యకత గురించి వివరించారు. అనుమానస్పదంగా వ్యక్తులు కనపడితే తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించారు. ఎలాంటి సమస్యలు వున్నా పోలీస్ స్టేషన్ కు తెలియపరచాలని తెలిపారు. ఏ సమ్యస వున్నా వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ లో తెలపాలన్నారు, లేదా 100 నెంబర్ కు ఫోన్ చేస్తే నిమిషాల్లో పోలీసులు అక్కడికి చేరుకుంటారని అన్నారు.

==========================

# 28న గూగుల్ డేటా సెంటర్‌కు శంకుస్థాపన

విశాఖపట్టణం, ఏప్రిల్ 8,



రాష్ట్రంలో ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ నిర్మాణానికి ముహూర్తం ఖరారైంది. విశాఖపట్నం జిల్లాలో ఈ నెల 28వ తేదీన శంకుస్థాపన చేయనున్నారు. ఈ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేశ్ తో పాటు గూగుల్ సంస్థకు చెందిన ప్రముఖులు హాజరుకానున్నారు. అంతర్జాతీయ దిగ్గజ సంస్థ గూగుల్ అమెరికావెలుపల అత్యధిక పెట్టుబడి 15 బిలియన్ డాలర్ల (రూ. 1.35 లక్షల కోట్లకు పైగా) వ్యయంతో చేపడుతున్న మొదటి ప్రాజెక్టు ఇదే కావడం విశేషం. వెయ్యి మెగావాట్ల సామర్థ్యంతో ఆసియాలోనే అతిపెద్ద డేటా సెంటర్ను నిర్మించనున్నారు. 2028 చివరికి డేటా సెంటర్ పనులు పూర్తి చేసి, ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెబుతున్నారు. గూగుల్ డేటా సెంటర్కు మూడు చోట్ల మొత్తం 601.4 ఎకరాలు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుంది. విశాఖ జిల్లా ఆనందపురం తర్లువాడలో 266.6 ఎకరాలు, విశాఖ గ్రామీణ మండలం అడవివరంలో సింహాచలం దేవస్థానానికి చెందిన 160 ఎకరాలు, అనకాపల్లి జిల్లా రాంబిల్లిలో ఏపీఐఐసీకి చెందిన 174.8 ఎకరాలు కేటాయించారు.గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్, అదానీగ్రూపు భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారుగూగుల్ సంస్థ ఏర్పాటు చేయబోయే డేటా సెంటర్ల కు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ సంస్థ గత ఏడాది అక్టోబర్ 14న ఎంవోయూపై సంతకాలు చేశాయి. అవసరమైన భూమిని ప్రభుత్వం గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫోటెక్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కు అప్పగించింది. మూడు డేటా సెంటర్ల ఏర్పాటుతో విశాఖపట్నం ఆసియాలోనే అతి పెద్ద డేటా సెంటర్ క్లస్టర్‌గా గుర్తింపు పొందే అవకాశం ఉంది. దీనికోసం 601.40 ఎకరాలను ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది.విశాఖపట్టణం తీర ప్రాంతం కావడంతో ఇక్కడి నుండి సింగపూర్, మలేషియా, ఆస్ట్రేలియా వంటి దేశాలకు సముద్రగర్భ కేబుల్ వ్యవస్థల ద్వారా నేరుగా అనుసంధానం ఏర్పడుతుంది. దీనివల్ల విశాఖ నగరం అంతర్జాతీయ డేటా కనెక్టివిటీ ప్రధాన కేంద్రంగా మారనుంది.

# అతివిశ్వాసమా? వ్యూహాలోపమా?

చెన్నై, ఏప్రిల్ 8,

తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం పార్టీతో ఒక సంచలనంలా మెరిసినప్పటికీ, ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ క్షేత్రస్థాయిలో ఆయన ఎదుర్కొంటున్న సవాళ్లు ఆయన్ని వెనుకబడిపోయేలా చేస్తున్నాయి. ఏప్రిల్ 23, 2026న జరగనున్న పోలింగ్‌కు ముందు తమిళనాడు రాజకీయ చిత్రం ప్రధానంగా డీఎంకే-నేతృత్వంలోని కూటమి , అన్నాడీఎంకే, బీజేపీ కూటమి మధ్యే కేంద్రీకృతమైంది. విజయ్ తన పార్టీని స్థాపించినప్పటి నుండి ఎటువంటి కూటముల్లో చేరకుండా 234 నియోజకవర్గాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని ప్రకటించారు. తమిళనాడు రాజకీయాల్లో గత 50 ఏళ్లుగా ఏదో ఒక ప్రధాన ద్రావిడ పార్టీతో కూటమి లేకుండా గెలవడం అసాధ్యమనేది చరిత్ర చెబుతున్న సత్యం. విజయ్ ఈ విషయాన్ని విస్మరించి, కేవలం తనకున్న స్టార్ ఇమేజ్ తోనే గట్టెక్కవచ్చని భావించడం ఆయనకు పెద్ద మైనస్ అయింది. క్షేత్రస్థాయిలో బూత్ కమిటీలు లేకపోవడం, జిల్లాల్లో బలమైన రెండో శ్రేణి నాయకత్వం కరువవ్వడం విజయ్ పార్టీని బలహీనపరుస్తోంది. విజయ్ ప్రధానంగా డీఎంకేని తన బద్ధశత్రువుగా ప్రకటించుకున్నారు. అయితే, విశ్లేషకుల ప్రకారం విజయ్ చీల్చే ఓట్లు ప్రతిపక్షమైన ంఎంఆఓఐ లేదా తటస్థ ఓటర్లవే అయ్యే అవకాశం ఉంది. దీనివల్ల ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలిపోయి, అంతిమంగా ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్‌కే మేలు జరుగుతుందనే ప్రచారం జరుగుతోంది. విజయ్‌ను బి-టీమ్ గా చిత్రీకరించే ప్రయత్నం కూడా జరుగుతోంది, ఇది తటస్థ ఓటర్లలో సందిగ్ధతను పెంచుతోంది. కూటమిలో కాంగ్రెస్, కమ్యూనిస్టులు వంటి బలమైన భాగస్వామ్య పక్షాలు ఉన్నాయి. అటు అన్నాడీఎంకే కూడా బీజేపీ, పీఎంకే , వంటి పార్టీలతో పటిష్టమైన పొత్తు కుదుర్చుకుంది. ఈ రెండు పెద్ద కూటముల మధ్య విజయ్ ఒక ఎక్స్ ఫ్యాక్టర్ గా మిగిలిపోయే ప్రమాదం కనిపిస్తోంది. విజయ్ కనీసం 15-20% ఓట్లు సాధించినా, అవి సీట్లుగా మారే అవకాశం తక్కువని, కేవలం కింగ్ మేకర్ కావాలని ఆయన ఆశించినా అది కూడా కష్టమేనని సర్వేలు చెబుతున్నాయి.రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత కూడా విజయ్ కీలక రాష్ట్ర సమస్యలపై స్పష్టమైన వైఖరి తీసుకోలేదనే విమర్శలు ఉన్నాయి. కేవలం అవినీతి నిర్మూలన అనే సాధారణ నినాదంతో ఓట్లు పడవని, ప్రజలకు ఒక విజన్ చూపించడంలో ఆయన విఫలమయ్యారని తమిళ విశ్లేషకులు భావిస్తున్నారు. సెప్టెంబర్ 2025లో జరిగిన ఒక తొక్కిసలాట ఘటనపై సీబీఐ విచారణ వంటి చట్టపరమైన చిక్కులు కూడా ఆయన ప్రచార సమయాన్ని వృధా చేశాయి. విజయ్ సభలకు జనం విపరీతంగా వస్తున్నా, ఆ జనం ఓట్లుగా మారుతారా అనేది పెద్ద ప్రశ్న. ఎంజీఆర్, జయలలిత కాలం నాటి సినిమా గ్లామర్ పాలిటిక్స్ ఇప్పుడు పని చేయడం లేదు. విజయ్ తన రాజకీయ ప్రయాణాన్ని ఒక లాంగ్ టర్మ్ ' ప్రాజెక్టుగా భావిస్తే ఈ ఎన్నికలు ఆయనకు ఒక పాఠంలా మిగులుతాయి.

# జాతీయ మెగా లోక్ అదాలత్ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులకు ప్రశంసా పత్రాలు

జగిత్యాల ఏప్రిల్ 8,




జిల్లాలో నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడంలో కీలక పాత్ర పోషించిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులను జిల్లా జడ్జి రత్న పద్మావతి అభినందిస్తూ ప్రశంసా పత్రాలు అందజేశారు.

శనివారం నాడు నిర్వహించిన జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లా పరిధిలో మొత్తం 3034 కేసులు పరిష్కారం కావడం జరిగింది. ఈ విజయానికి కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది, బార్ అసోసియేషన్ ప్రతినిధులను ఈ రోజు జిల్లా కోర్టు ప్రాంగణంలో సత్కరించారు.

ఈ సందర్భంగా జిల్లా జడ్జి రత్న పద్మావతి మాట్లాడుతూ, పోలీస్ అధికారులు, బార్ అసోసియేషన్, కోర్టు సిబ్బంది సమిష్టిగా కృషి చేసి కేసుల్లో ఉన్న కక్షిదారులను స్వయంగా కలిసి ''రాజీ మార్గమే రాజమార్గం'' అని అవగాహన కల్పించినందువల్లే ఈ స్థాయిలో కేసులు పరిష్కారం కావడం సాధ్యమైందన్నారు. లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం జరుగుతుందని, ఇరు వర్గాలకు న్యాయం చేకూరుతుందని తెలిపారు.గతంలో ఎప్పుడూ లేని విధంగా భారీ స్థాయిలో కేసులు పరిష్కరించడంలో సమన్వయంతో పనిచేసిన పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు బార్ అసోసియేషన్ సభ్యులను అభినందిస్తూ, రానున్న రోజుల్లోనూ ఇదే స్ఫూర్తితో పనిచేయాలని కోరారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ , అదనపు జిల్లా జడ్జి నారాయణ, లీగల్ సెల్ సెక్రటరీ వెంకట మల్లిక్ సుబ్రమణ్య శర్మ, మేజిస్ట్రేట్ లు లావణ్య,నికిషా, డిఎస్పి రఘు చందర్, బార్ కౌన్సిల్ జగిత్యాల అధ్యక్షులు, అలాగే జిల్లా పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంట్లో కుస్తీ - బయట దోస్తీ -

తిరువనంతపురం ఏప్రిల్ 8

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారం పతాక స్థాయికి చేరింది. బీజేపీ అగ్రనేతలు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. తాజాగా ఎర్నాకుళంలో జరిగిన భారీ బహిరంగ సభలో అమిత్ షా పాల్గొన్నారు. కేరళలో దశాబ్దాలుగా మారుతూ వస్తున్న ఎల్‌డీఎఫ్ యూడీఎఫ్ పాలనలకు చరమగీతం పాడే సమయం ఆసన్నమైందని అమిత్ షా పిలుపునిచ్చారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ పార్టీలు కేరళ వెలుపల దోస్తీ చేస్తూ, రాష్ట్రంలో మాత్రం ప్రజలను మభ్యపెట్టడానికి కుస్తీ పడుతున్నాయని ఆయన విమర్శించారు. ఈ రెండు కూటములు క్రమంగా క్షీణిస్తున్నాయని, కేరళ అభివృద్ధి కేవలం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలోని ఎన్డీయేతోనే సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. కేరళలోని సున్నితమైన అంశాలను ప్రస్తావిస్తూ, శబరిమల అయ్యప్ప దేవాలయం విషయంలో కమ్యూనిస్టు ప్రభుత్వం అనుసరించిన తీరును అమిత్ షా తీవ్రంగా తప్పుబట్టారు. దేవాలయంలో జరిగిన బంగారు ఆభరణాల చోరీ వ్యవహారంలో నిందితులను కాపాడే ప్రయత్నం జరుగుతోందని, భక్తుల మనోభావాలను ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆయన ఆరోపించారు. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం భక్తుల పక్షాన ఉంటుందని, దోషులను విడిచిపెట్టే ప్రసక్తే లేదని హామీ ఇచ్చారు. అలాగే కేంద్ర పథకాలకు పేర్లు మార్చి తమవిగా ప్రచారం చేసుకుంటున్న ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీరును ఆయన ఎండగట్టారు.ఈ సభలో అమిత్ షాతో పాటు కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఆంధ్రప్రదేశ్ బీజేపీ సీనియర్ నేత , జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్ రెడ్డి పాల్గొన్నారు. అమిత్ షాకు ఘనస్వాగతం పలికిన విష్ణువర్ధన్ రెడ్డి, హోంమంత్రితో వేదిక పంచుకోవడంపై హర్షం వ్యక్తం చేశారు. కేరళలోని స్థానిక రాజకీయ పరిస్థితులు, ఎన్నికల ప్రచార సరళిపై అమిత్ షా ఆయనతో ప్రత్యేకంగా చర్చించారు. రాబోయే నాలుగు రోజులు ప్రచారాన్ని మరింత ఉధృతం చేయాలని, ఇంటింటికీ వెళ్లి మోదీ ప్రభుత్వ విజయాలను వివరించాలని అమిత్ షా దిశానిర్దేశం చేసినట్లు విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ బహిరంగ సభ ఎర్నాకుళం , పరిసర నియోజకవర్గాల్లో బీజేపీ కేడర్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ముఖ్యంగా క్రైస్తవ, హిందూ ఓటర్లను ఆకట్టుకునేలా అమిత్ షా చేసిన ప్రసంగం వ్యూహాత్మకంగా ఉందని భావిస్తున్నారు. ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ పాలనల వల్ల కేరళ అప్పుల ఊబిలో కూరుకుపోయిందని, యువత ఉపాధి కోసం ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సి వస్తోందని అమిత్ షా చేసిన వ్యాఖ్యానాలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. ఈ ఎన్నికల్లో బీజేపీ కింగ్ మేకర్ గా అవతరిస్తుందని ఆ పార్టీ శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నాయి.

# ప్రేమ, పెళ్లిళ్లకు పేరెంట్స్ అనుమతులు...

గాంధీనగర్ ఏప్రిల్ 8,


గుజరాత్‌లో ఇకపై ప్రేమ వివాహం చేసుకోవడం అంత సులువు కాదు. ఇంట్లో తెలియకుండా పెళ్లి చేసుకుని, ఆ తర్వాత రిజిస్ట్రేషన్ చేయించుకుందామనుకునే ప్రేమికులకు గుజరాత్ ప్రభుత్వం షాక్ ఇచ్చింది. వివాహ రిజిస్ట్రేషన్ చట్టానికి చేసిన తాజా సవరణల ప్రకారం, పెళ్లి చేసుకోబోయే జంట తాము ఈ విషయాన్ని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామో లేదో అధికారికంగా ప్రకటించాల్సి ఉంటుంది. అంతేకాదు, వారి ఆధార్ కార్డులు, ఫోన్ నంబర్లు , అడ్రస్ వివరాలను రిజిస్ట్రార్ కార్యాలయంలో సమర్పించడం తప్పనిసరి చేశారు.ఈ కొత్త నిబంధనల్లో అత్యంత కీలకమైన అంశం తల్లిదండ్రులకు నోటీసు . జంట దరఖాస్తు చేసుకున్న 10 వర్కింగ్ డేస్‌ల్లో, రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి వారి తల్లిదండ్రులకు వాట్సాప్, ఎస్సెమ్మెస్ లేదా రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా సమాచారం వెళ్తుంది. అంటే, ఇంట్లో చెప్పకుండా పెళ్లి చేసుకోవాలనుకునే వారి గుట్టును ప్రభుత్వమే నేరుగా తల్లిదండ్రులకు విప్పుతుందన్నమాట. సనాతన సంప్రదాయాలను రక్షించేందుకు , మోసపూరిత వివాహాలు అంటే లవ్ జిహాద్ వంటివి అరికట్టేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు గుజరాత్ హోం మంత్రి హర్ష్ సంఘ్వి చెబుతున్నారు. మరో ముఖ్యమైన మార్పు 30 రోజుల వెయిటింగ్ పీరియడ్ . దరఖాస్తు చేసుకున్న వెంటనే పెళ్లి సర్టిఫికేట్ రాదు. కనీసం 30 రోజుల పాటు వేచి ఉండాలి. ఈ గడువులోగా పెళ్లికి సంబంధించి ఎవరైనా అభ్యంతరాలు వ్యక్తం చేస్తే, వాటిని అధికారులు పరిశీలిస్తారు. అలాగే, పెళ్లి ఫోటోలు, వివాహ ఆహ్వాన పత్రిక , సాక్షుల వివరాలను కూడా ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీనివల్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో పారదర్శకత పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, ఈ నిర్ణయంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతు న్నాయి. మైనార్టీ దాటినా తమకు నచ్చిన వారిని పెళ్లి చేసుకునే స్వేచ్ఛను ఈ చట్టం హరిస్తోందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని హక్కుల కార్యకర్తలు విమర్శిస్తున్నారు. తల్లిదండ్రుల ప్రమేయం పెంచడం వల్ల ప్రేమ జంటలపై దాడులు , వేధింపులు పెరిగే అవకాశం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఈ ముసాయిదాపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్న ప్రభుత్వం, త్వరలోనే దీనిని పూర్తిస్థాయి చట్టంగా అమలు చేయనుంది.

## అతివేగంతో అదుపు తప్పి పల్టీలు కొట్టిన కారు.. ఇద్దరు స్పాట్‌డెడ్

హైదరాబాద్ వనస్థలిపురంలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. మద్యం మత్తులో ర్యాష్ డ్రైవింగ్ చేయడంతో కారు అదుపు తప్పి పల్టీలు కొట్టింది. నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి, బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరు విద్యార్థులు, మరో వ్యక్తి చనిపోయారు. మృతి చెందిన ఇద్దరు విద్యార్థులు ఇంజినీరింగ్ ఇఅఇ సెకండ్ ఇయర్ చదువుతున్న శివ, సందీప్ జోహెల్‌గా గుర్తించారు. కారు డ్రైవర్?ను తమకు అప్పగించాలని కళాశాల విద్యార్థులు రోడ్డుపై ఆందోళనకు దిగారు.

# రేవంత్ హిందూత్వ అస్త్రం

హైదరాబాద్, ఏప్రిల్ 8,



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలి కాలంలో బాసర, భద్రాద్రి, వేములవాడ వంటి ప్రముఖ పుణ్యక్షేత్రాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడం రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త చర్చకు దారి తీస్తోంది. కేవలం పరిపాలనకే పరిమితం కాకుండా, ఆధ్యాత్మిక కేంద్రాల పునరుద్ధరణకు వందల కోట్ల రూపాయల నిధులు కేటాయిస్తూ ఆయన చేస్తున్న పర్యటనలు కేవలం భక్తి కోణంలోనే కాకుండా, ఒక పక్కా రాజకీయ వ్యూహంతో కూడినవిగా భావిస్తున్నారు. తెలంగాణలో బీజేపీ తన హిందూత్వ నినాదంతో బలపడుతున్న తరుణంలో, ఆ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి రేవంత్ రెడ్డి సాఫ్ట్ హిందూత్వ మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. గతంలో కాంగ్రెస్ పార్టీపై ఉన్న మైనారిటీ అనుకూల పార్టీ అనే ముద్రను చెరిపివేయకుండా మెజారిటీ హిందూ ఓటర్లకు చేరువయ్యేందుకు ఆయన ఈ ఆలయాల అభివృద్ధిని ఒక వేదికగా చేసుకుంటున్నారు. బీజేపీ చేసే మతపరమైన విమర్శలకు అవకాశం ఇవ్వకుండా, తాము కూడా హిందూ ధర్మాన్ని, సంస్కృతిని గౌరవిస్తామని చేతల్లో చూపిస్తున్నారు.తెలంగాణలో హిందూ ఓట్లే లక్ష్యంగా ముందుకు సాగుతున్న బీజేపీకి రేవంత్ రెడ్డి తనదైన శైలిలో అడ్డుకట్ట వేస్తున్నారు. రేవంత్ రెడ్డి తెలంగాణలోని స్థానిక సెంటిమెంట్లతో ముడిపడి ఉన్న బాసర , భద్రాద్రి , వేములవాడ వంటి క్షేత్రాలకు పెద్దపీట వేస్తున్నారు. బాసర ఆలయ అభివృద్ధికి రూ. ?225 కోట్లు కేటాయించడం, తిరుమల తరహాలో అక్కడ రాజకీయ కార్యకలాపాలను నిషేధించాలని ఆదేశించడం ద్వారా ఆయన ఆధ్యాత్మికతకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారనే సంకేతాలను ప్రజల్లోకి పంపారు. కేవలం ఆలయాల అభివృద్ధి మాత్రమే కాకుండా, గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురైన ఆలయాలను బాగు చేయడం ద్వారా ప్రజల మనసు గెలుచుకోవాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. యాదగిరిగుట్టను బీఆర్ఎస్ ప్రభుత్వం అభివృద్ధి చేసినప్పటికీ, భద్రాద్రి వంటి ఇతర కీలక ఆలయాలను వదిలేశారనే విమర్శలు ఉన్నాయి. ఆ లోటును భర్తీ చేస్తూ, భద్రాద్రి మాస్టర్ ప్లాన్‌ను స్వయంగా సమీక్షించడం ద్వారా రేవంత్ రెడ్డి తనను తాను ఒక ప్రజా పక్షపాత ఆధ్యాత్మిక వాది గా ప్రొజెక్ట్ చేసుకుంటున్నారు.రేవంత్ రెడ్డి వ్యూహం కేవలం హిందూత్వకే పరిమితం కాలేదు. ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే, మరోవైపు ఆలయాల అభివృద్ధిపై దృష్టి పెట్టడం ద్వారా అన్ని వర్గాల ఓటర్లను ఆకట్టుకోవాలని చూస్తున్నారు. బీజేపీ నాయకులు చేసే యాంటీ-హిందూ విమర్శలకు బాసర, వేములవాడ అభివృద్ధి పనులే సమాధానంగా ఆయన భావిస్తున్నారు. ఇది కాంగ్రెస్ పార్టీకి తెలంగాణలో ఉన్న సంప్రదాయ ఓటు బ్యాంకుతో పాటు, మధ్యతరగతి హిందూ ఓటర్లను కూడా దగ్గర చేసే అవకాశం ఉంది.రేవంత్ రెడ్డి ఆలయాల చుట్టూ తిరుగుతున్న రాజకీయాలు తెలంగాణలో త్రిముఖ పోటీని ఆసక్తికరంగా మార్చాయి. బీజేపీ హిందూత్వ నినాదానికి, కాంగ్రెస్ సాఫ్ట్ హిందూత్వ, అభివృద్ధి నినాదానికి మధ్య ఈ పోటీ సాగుతోంది. ఈ వ్యూహం గనుక ఫలిస్తే, భవిష్యత్తులో తెలంగాణలో బీజేపీ పెరగకుండా అడ్డుకోవడంలో రేవంత్ రెడ్డి విజయవంతమైనట్లే. అయితే, ఈ ఆధ్యాత్మిక పనులు కేవలం శంకుస్థాపనలకే పరిమితం కాకుండా, గడువులోగా పూర్తయితేనే ప్రజల్లో ఆయనపై ఉన్న నమ్మకం మరింత బలపడుతుంది.

# పీఓకే విలీనం అడుగులు...

శ్రీనగర్, ఏప్రిల్ 8, (

'పాక్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే) మళ్లీ భారత్‌లో అంతర్భాగం కాబోతోందా అంటే అవుననే అంటున్నారు విశ్లేషకులు. మౌద్యుల సంఘం అధ్యక్షుడు చేసిన ఈ వ్యాఖ్య కేవలం ఒక అభిప్రాయం కాదు.. భౌగోళిక, రాజకీయ మార్పులకు అద్దం పడుతోంది. పీవోకేలోని ముస్లింల మనస్తత్వంలో వస్తున్న మార్పు, పాకిస్తాన్‌పై వారిలో పెరుగుతున్న వ్యతిరేకత కారణమంటున్నారు.పీవోకేలోని ముస్లింలలో గతంలో ఉన్న భారత వ్యతిరేక ధోరణి ఇప్పుడు గణనీయంగా మారింది. 2019లో ఆర్టికల్ 370 రద్దు తర్వాత జమ్మూ కశ్మీర్‌లో జరిగిన అభివృద్ధి, పర్యాటకం పెరుగుదల, ఉద్యోగావకాశాల పెరుగుదల వంటివి పీవోకే ప్రజల వైఖరిలో మార్పు తెస్తున్నాయి. తాము పాకిస్తాన్‌లో ఉండి అభివృద్ధికి దూరమయ్యామని వారు గుర్తిస్తున్నారు. పాకిస్తాన్, బంగ్లాదేశ్‌లపై పీవోకే ముస్లింలలో ఉన్న అనుకూలత క్షీణించింది. పాకిస్తాన్ తమను కేవలం భారత్‌పై కుట్రలకు ఉపయోగించుకుంటోందని, తమ అభివృద్ధిని పట్టించుకోవడం లేదని వారు గుర్తిస్తున్నారు. పాక్, బంగ్లాదేశ్ అనుకూలులలో కూడా భారత్ పట్ల అభిమానం పెరుగుతోంది.పాకిస్తాన్ ప్రభుత్వం పీవోకే ప్రజలపై చూపిస్తున్న నిర్లక్ష్యం, అణచివేత ప్రజలలో తిరుగుబాటుకు కారణమవుతోంది. పీవోకేలోని వనరులను పాకిస్తాన్ దోచుకుంటోంది. గోధుమ పిండిపై సబ్సిడీ లేదు, విద్యుత్ కోతలు, నిరుద్యోగం తాండవిస్తున్నాయి. పీవోకే అసెంబ్లీలో పాకిస్తాన్‌లో నివసిస్తున్న కాశ్మీరీ శరణార్థుల కోసం కేటాయించిన 12 సీట్లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ 2025 సెప్టెంబర్‌లో చరిత్రలోనే అతిపెద్ద నిరసన జరిగింది. పాక్ సైన్యం కాల్పుల్లో ఇద్దరు చనిపోయారు, 22 మంది గాయపడ్డారు. ఇంటర్నెట్ నిలిపివేత, పోలీసుల మోహరింపు జరిగాయి. పాకిస్తాన్ పీవోకేను ఉగ్రవాద స్థావరంగా మార్చి, యువకులను ఉగ్రవాదులుగా మార్చి భారత్‌పై పంపుతోంది. ఇది స్థానికులకు ప్రమాదకరంగా మారింది.ఈ పరిణామాల నేపథ్యంలో పీవోకే ప్రజలు తమ స్వరం వినిపిస్తున్నారు. పీవోకేలోని రాజకీయ కార్యకర్త అమ్జద్ అయూబ్ మిర్జా వీడియో ద్వారా, 'పాకిస్తాన్ తీరుతో విసిగిపోయాం, భారత్‌లో విలీనం కావాలి' అని డిమాండ్ చేశారు. కేంద్ర రక్షణ మంత్రి రాజ్నాథ్ సింగ్, 'పీవోకేలోని ప్రజలే భారత్‌లో విలీనం కావాలని డిమాండ్ చేస్తున్నారు. అది త్వరలోనే జరుగుతుంది' అని ప్రకటించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కూడా, 'పీవోకే భారత్‌లో భాగమే, ఎప్పటికైనా స్వాధీనం చేసుకుంటాం' అని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు ప్రధాని మోదీ పది రోజుల్లో మూడు సార్లు పీవోకే గురించి ప్రస్తావించారు.పీవోకే భారత్‌లో విలీనం అనేది ఇక ఊహాగానం కాదు. అది సాధ్యమయ్యే లక్ష్యంగా మారింది.

# గ్రామ భద్రతకు సీసీ కెమెరాలే కవచం

మహబూబ్ నగర్ ఏప్రిల్ 8, (

గూడూరు పోలీస్ స్టేషన్ లో ఆకస్మిక తనిఖీ, పోనుగోడు గ్రామ సందర్శన గూడూరు పోలీస్ స్టేషన్ను ఆకస్మికంగా ఎస్పీ సుధీర్ రావ్ నాథ్ కేకన్ సందర్శించి సమగ్ర తనిఖీలు నిర్వహించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, గదులు, రికార్డుల నిర్వహణ, పని విధానాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు.

స్టేషన్ సిబ్బంది సంఖ్య, విధుల నిర్వహణ, కేసుల దర్యాప్తు పురోగతిపై ఎస్సై గిరిధర్ నుండి వివరాలు తెలుసుకున్నారు. అలాగే స్టేషన్ పరిధిలోని గ్రామాలు, గ్రామపంచాయతీలలో అమలు చేస్తున్న భద్రతా చర్యలపై సమగ్రంగా సమీక్షించారు.

తరువాత ఎంపిక చేసిన గ్రామపంచాయతీ అయిన పోనుగోడు గ్రామాన్ని సందర్శించి, హెల్మెట్ వినియోగం అమలు, సీసీ కెమెరాల ఏర్పాటు మరియు పర్యవేక్షణ విధానాన్ని పరిశీలించారు. గ్రామస్థుల చొరవతో హెల్మెట్ వినియోగం కచ్చితంగా అమలవడం, గ్రామమంతా సీసీ కెమెరాల కవరేజీలో ఉంటున్నారు. గ్రామ భద్రతలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయి. ప్రతి గ్రామం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉండేలా చర్యలు తీసుకోవాలి.

# వయసు కేవలం అంకె మాత్రమే

భోపాల్, ఏప్రిల్ 8,

ప్రేమకు వయసుతో సంబంధం లేదని, మనసులు కలిస్తే చాలని మధ్యప్రదేశ్ హైకోర్టు మరోసారి స్పష్టం చేసింది. తనకంటే రెట్టింపు వయసున్న 40 ఏళ్ల వ్యక్తితో జీవించాలనుకున్న 19 ఏళ్ల యువతికి న్యాయస్థానం అండగా నిలిచింది. రాజ్యాంగం కల్పించిన వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవిస్తూ, సదరు యువతి తన ఇష్టానుసారం తనకు నచ్చిన భాగస్వామితో కలిసి ఉండే పూర్తి హక్కు కలిగి ఉందని కోర్టు కీలక తీర్పునిచ్చింది.మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్ ప్రాంతానికి చెందిన 19 ఏళ్ల యువతి, అదే ప్రాంతానికి చెందిన 40 ఏళ్ల వ్యక్తితో ప్రేమలో పడింది. వీరిద్దరి మధ్య వయసు వ్యత్యాసం చాలా ఎక్కువగా ఉండటంతో యువతి కుటుంబ సభ్యులు ఈ బంధాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. తన కుమార్తెను ఆ వ్యక్తి అపహరించి, మాయమాటలతో లొంగదీసుకున్నాడని ఆరోపిస్తూ యువతి తండ్రి కోర్టును ఆశ్రయించారు. తన కుమార్తెకు రక్షణ కల్పించి, ఆమెను తన వద్దకు చేర్చాలని కోరుతూ హేబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన హైకోర్టు, యువతిని ధర్మాసనం ముందు హాజరుపరచాలని ఆదేశించింది. కోర్టులో హాజరైన యువతి తన అభిప్రాయాన్ని ఎంతో స్పష్టంగా వెల్లడించింది. నేను మేజర్ ని, నా నిర్ణయాలు నేను తీసుకోగలను. 40 ఏళ్ల ఆ వ్యక్తితో నేను స్వచ్ఛందంగానే సహజీవనం చేస్తున్నాను. నన్ను ఎవరూ బలవంతం చేయలేదు, నేను నా ఇష్ట ప్రకారమే అతనితో వెళ్లాను అని ఆమె ధీమాగా చెప్పడంతో కేసు మలుపు తిరిగింది. యువతి వాంగ్మూలాన్ని విన్న జస్టిస్ సునాయన దత్ ధర్మాసనం కీలక వ్యాఖ్యలు చేసింది. భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి వ్యక్తికి తమ జీవిత భాగస్వామిని ఎంచుకునే హక్కు ఉంది. భాగస్వామి వయసు ఎంత అనేది ఇక్కడ ప్రధానం కాదు. ఒక వ్యక్తి మేజర్ అయినప్పుడు, ఆమె ఎవరితో జీవించాలో నిర్ణయించే అధికారం తల్లిదండ్రులకు కానీ, సమాజానికి కానీ ఉండదు అని పేర్కొంటూ తండ్రి దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేసింది. ఈ తీర్పు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సామాజిక కట్టుబాట్లు, వయసు వ్యత్యాసాల కంటే వ్యక్తిగత స్వేచ్ఛ మరియు ప్రాథమిక హక్కులే అత్యున్నతమైనవని ఈ కేసు మరోసారి నిరూపించింది. ప్రస్తుతం ఆ యువతి తన భాగస్వామితో కలిసి సురక్షితంగా జీవించేందుకు హైకోర్టు పూర్తి అనుమతిని ఇచ్చింది.

# ఉక్కపోతలో ఈటెల

హైదరాబాద్, ఏప్రిల్ 8,



భారతీయ జనతా పార్టీలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ ఉక్కపోతకు గురవుతున్నారా? పార్టీ మారుతానని సోషల్ మీడియాలో సొంత పార్టీ నేతలే దుష్ప్రచారం చేస్తున్నారని, వివిధ రకాలుగా ఇబ్బందులు సృష్టిస్తున్నారని ఆయన భావిస్తున్నారా? అంటే తాజాగా చేసిన వ్యాఖ్యలు అవుననే అంటున్నాయి. దుష్ప్రచారంపై సొంత పార్టీ నాయకులపై పరోక్షంగా అప్పుడప్పుడు ఆక్రోషం సైతం వెళ్లగకుతున్నారు. ఈటెల రాజేందర్ మళ్లీ బి ఆర్ ఎస్ లో చేరుతున్నారని ఇటీవల సోషల్ మీడియాలో బాగా ప్రచారం జరుగుతోంది. ఇలా ప్రచారం జరగడం కొత్త కాదు. గతంలోనూ ఇలాంటి ప్రచారం జరగగా రాజేందర్ ఖండించారు. తాజాగా మళ్లీ ఆదివారం పూడూరు శివారులో ని నివాసంలో దుష్ప్రచారాన్ని ఖండించారు. కెసిఆర్ తనను భర్తరఫ్ చేశారని, ఆర్థికంగా అనేక ఇబ్బందులు పెట్టారని, అప్పటి ఇబ్బందులు తలుచుకుంటేనే బాధ అనిపిస్తుందని, ఎన్నో సమస్యలు ఎదుర్కొని మళ్లీ బి ఆర్ ఎస్ లో ఎలా చేరుతానని ఈటల రాజేందర్ ప్రశ్నించారు. ఈ ప్రచారం వెనుక సొంత పార్టీ నాయకుల హస్తముందని ఆయన భావిస్తున్నారు. గతంలో ప్రచారం జరిగినప్పుడు కూడా సొంత పార్టీ నాయకులపై నిప్పులు చెరిగారు. జూలై 19న హుజురాబాద్ నుంచి పార్టీ కార్యకర్తలు పూడూరులోని ఆయన ఇంటికి వచ్చిన సమయంలో ఘాటు వ్యాఖ్యలు చేశారు.' ఒక సైకో, శాడిస్టు, వాడు మనిషా, ఏ పార్టీలో ఉన్నాడు, కొడుకా బి కేర్ఫుల్'అని మండిపడ్డారు. ఎవరు సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్నారు అధిష్టానానికి ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఈటెల రాజేందర్ సొంత నియోజకవర్గంలో హుజురాబాద్ వెళ్ళవద్దని బిజెపి నాయకులు ఆంక్షలు విధించారు. 20 ఏళ్ల ఆ నియోజకవర్గంలో ప్రాతినిధ్యం వహించారు. ఆయనకు పెద్ద సంఖ్యలో అనుచర గణం ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఈటెల రాజేందర్ అక్కడే పోటీ చేశారు. ఆ నియోజకవర్గంలో ప్రభావితం చేయగల నాయకుడు. అయినప్పటికీ హుజురాబాద్ వెళ్ళవద్దని పార్టీ పెద్దలు సూచించడం విస్మయానికి గురిచేస్తుంది. ఎన్నికల సమయంలో నాయకులందరినీ ప్రచారానికి పిలిచి పార్టీ అభ్యర్థుల విజయానికి చర్యలు తీసుకుంటారు. ఏ ఒక్క అవకాశాన్ని వదులుకోరు. కానీ ఈటెల రాజేందర్ ను హుజురాబాద్ రావద్దు అని చెప్పడం అంతర్గత పోరుకు అద్దం పడుతోంది. అంతర్గత వర్గ పోరులో బీజేపీ అభ్యర్థులు బలయ్యారు. ఈటల రాజేందర్ కు ఢిల్లీ పెద్దలతో సత్సంబంధాలు ఉన్నాయి. వివిధ సందర్భాలలో కేంద్ర మంత్రులను, అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోడీ లను కలుస్తుంటారు. కానీ రాష్ట్ర నాయకులతో విభేదాలు ఉన్నాయి. పదవులు రాకుండా రాష్ట్ర నాయకులు అడ్డుకుంటున్నారని రాజేందర్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. సొంత పార్లమెంటు నియోజకవర్గం మల్కాజిగిరి లోను తన ప్రభావాన్ని తగ్గించడానికి ప్రయత్నిస్తున్నట్లు ఈటెల రాజేందర్ అనుమానిస్తున్నారు. మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలో ఇతర నాయకులు వేలు పెట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని భావించి గెలిచేవారికి టికెట్లు అని ప్రకటించారు. అంతేగాక ఈ నియోజకవర్గంలో తనకున్నంత అవగాహన ఇంకొకరికి ఉండదని స్పష్టం చేశారు.

# తారామతి పార్టీలో ఎందరెందరో....



హైదరాబాద్, ఏప్రిల్ 8

తారామతి బారాదరి రిసార్ట్ లో ఏర్పాటు చేసిన పార్టీలో డ్రగ్స వినియోగం జరగటం.. శనివారం అర్ధరాత్రి ఈగిల్ పోలీసులు తనిఖీలు నిర్వహించటం ఆరుగురు డ్రగ్స్ వినియోగం జరిపినట్లుగా గుర్తించి.. వారిని డీ అడిక్షన్ సెంటర్ కు తరలించటం తెలిసిందే. చారిత్రక కట్టడంగా గుర్తింపు పొందిన ఇందులో నిర్వహించిన మత్తుపార్టీలో పెద్ద ఎత్తున లిక్కర్ సర్వ్ చేయటం షాకింగ్ గా మారింది. కారణం.. ఈ పార్టీకి సంబంధించి ఎక్సైజ్ శాఖ నుంచటి అనుమతులు తీసుకోకుండానే పెద్ద ఎత్తున మద్యాన్ని వచ్చిన అతిధులకు అందించటం చూస్తే.. నిబంధనల్ని ఏ మాత్రం పట్టించుకోలేదన్న విషయం అర్థమవుతుంది. ఈ పార్టీకి దాదాపు 400 మంది వరకు వచ్చినట్లుగా తెలుస్తోంది. వీరిలో 35 మందిని పరీక్షించినట్లుగా చెప్పినా.. దాదాపు అరవై మంది వరకు పరీక్షలు జరిపారని తెలుస్తోంది. వీరిలో ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లుగా గుర్తించారు. వీరిలో బాలీవుడ్ నటుడు కం మోడల్ అబ్దుల్ సర్వర్.. యోగేశ్వర్.. అభినాశ్ ఫణి.. బ్రెట్ జాసన్.. నిహార్, ఆషి (వీరిద్దరూ భార్యభర్తలు) కొకైన్ తీసుకున్నట్లుగా తెలుస్తోంది. మోరే దేన్ ఫ్రెండ్స్ పేరుతో నిర్వహించిన ఈ మత్తు పార్టీ కపుల్ ఫ్రెండ్లీగా పెద్ద ఎత్తున ప్రచారం చేయటం గమనార్హం. ఈ కారణంతో వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున జంటలు రావటం విశేషం. ఈ ఈవెంట్ గురించి హైదరాబాద్ కంటే ఎక్కువగా ఢిల్లీ.. ముంబయి.. బెంగళూరు నుంచి విద్యార్థులు.. యూత్ హాజరైనట్లుగా గుర్తించారు. ఈ పార్టీని నిర్వహించిన వ్యక్తిని చంద్రగా భావిస్తున్నారు. తెర వెనుక వేరే వారు ఉంటారని తెలుస్తోంది. వీరికిడ్రగ్స్ ఎలా వచ్చాయన్న దానిపై ఇప్పుడు ఫోకస్ చేస్తున్నారు. ఎక్సైజ్ శాఖ నుంచి ఎలాంటి ముందస్తు అనుమతులు తీసుకోకుండా ఈ పార్టీని నిర్వహించటం చూస్తే.. అంత పబ్లిక్ గా పార్టీ నిర్వహస్తూ కనీస అనుమతులు తీసుకొని బరితెగింపు ఏమిటి? అన్నది ప్రశ్న. తారామతి బారాదరిలో నిర్వహించిన ఈవెంట్ ను మ్యూజిక్ జోనర్ ఇష్టపడే వారి కోసమన్నట్లుగా ప్రచారం జరిగింది. 400 ఏళ్ల నాటి గోల్కొండ కోట పరిసరాల్లో.. ఆధునిక లైటింగ్ మధ్య భిన్నమైన సౌండ్ సిస్టమ్ తో విభిన్నమైన వాతావరణాన్ని క్రియేట్ చేస్తున్నట్లుగా భారీ ప్రచారం చేయటంతో ఆ పార్టీకి వేర్వేరు నగరాల నుంచి పెద్ద ఎత్తున హాజరైనట్లుగా చెబుతున్నారు. పోలీసుల దాడుల్లో నాలుగు గ్రాముల కొకైన్.. నాలుగు గ్రాముల ఎండీఎంఏ పిల్స్ తో పాటు ఇతర మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. తనిఖీలు నిర్వహించిన తర్వాత డ్రగ్స్ వినియోగంతో సంబంధం లేని వారి వివరాల్ని సైతం పోలీసులు సేకరించి పంపినట్లుగా తెలుస్తోంది.

# మైలేజ్ కన్నా... డ్యామేజ్ ఎక్కువ..!

హైదరాబాద్, ఏప్రిల్ 8, (

తెలంగాణ రాజకీయాల్లో హుజురాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి తీరు తీవ్ర దుమారం రేపుతోంది. తాజాగా అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి సైతం కౌశిక్ రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వాడిన పదజాలం విన్నవారికి ఇప్పటికే ఓ క్లారిటీ వచ్చేసింది. త్వరలో కౌశిక్ రెడ్డి శాసనసభ సభ్యత్వంపై వేటు లేదా కఠిన చర్యలు తప్పవనే సంకేతాలు చెప్పకనే చెప్పేశారు సీఎం. అధికార కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు కౌశిక్ రెడ్డిపై అసెంబ్లీలో నిప్పులు చెరిగిన విధానం, ఏకంగా ఓ ఎమ్మెల్యే అసెంబ్లీ నక్సలైట్‌గా కౌశిక్ రెడ్డిని పోల్చిన తీరు పెను సంచలనంగా మారింది. ఓ ఎమ్మెల్యేపై అసెంబ్లీలో ఇంత రచ్చ అవసరమా అని కొందరు అనుకోవచ్చు, కానీ కౌశిక్ రెడ్డి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా 2021లో హుజూరాబాద్ ఉపఎన్నికల్లో గెలిచిన నాటి నుంచి ఆయన దూకుడు మాములుగా లేదంటున్నారు రాజకీయ విమర్శకులు. తాజాగా సీనియర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లడుతుండగా తుపాకీతో కాల్చిపడేస్తానంటూ అసెంబ్లీలో సైగలు చేసి, అవమానించారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఎథిక్స్ కమిటీని సైతం ఏర్పాటు చేసి వేటుకు రంగం సిద్ధం చేశారు. కౌశిక్ రెడ్డిని వివాదాలు వెంటాడతాయో లేక తానే వివాదాలను ముద్దాడుతాడో తెలియదు కానీ, ఎక్కడుంటే అక్కడ పొలిటిక్ రచ్చ సర్వసాధారణంగా మారింది. 2024లో హైదరాబాద్‌లో విధినిర్వహణలో ఉన్న ఓ ఎస్ఐపై అనుచితంగా ప్రవర్తించాడని, విధులకు ఆటంకం కలిగించాడని కౌశిక్ రెడ్డిపై అప్పట్లో కేసు నమోదైంది. హైదరాబాద్ కౌశిక్ నివాసం చుట్టూ భారీగా పోలీసులు మోహరించడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈ వివాదానికి ముందు తన భార్య శాలినీ పుట్టినరోజు సందర్భంగా యాదాద్రి గుడిలో ఫొటో షూట్ నిర్వహించి, సోషల్ మీడియాలో వీడియోలో పోస్ట్ చేయడంపై కౌశిక్ రెడ్డిపై తీవ్ర విమర్శలు చెలరేగాయి. 2025లో కరీంనగర్ కలక్టరేట్‌లో జరిగిన జిల్లా స్థాయి సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ మాట్లడుతుండగా, నువ్వు ఏ పార్టీ ఎమ్మెల్యేవి చెప్పంటూ కౌశిక్ రెడ్డి మధ్యలో జోక్యం చేసుకోవడం, సంజయ్‌తో బాహాబాహీకి దిగడం వివాదంగా మారింది. తనపైన కౌశిక్ రెడ్డి దాడి చేశాడంటూ ఎమ్మెల్యే సంజయ్ ఇచ్చిన ఫిర్యాదుతో సెక్షన్ 126,115, 352, 292ల కింద కేసు నమోదు చేసిన కరీంనగర్ పోలీసులు, హైదరాబాద్ వచ్చి కౌశిక్ రెడ్డిని బలవంతంగా అరెస్ట్ చేసి కరీంనగర్ స్టేషన్ కు తరలించారు. ఓ గ్రానైట్ సంస్థ యజమానిని బెదిరించి 50లక్షలు డబ్బు డిమాండ్ చేశారనే ఆరోపణలపై జూన్ 1, 2025లో శంషాబాద్ ఎయిర్ పోర్టు నుంచి విదేశాలకు వెళ్లే ప్రయత్నం చేస్తుండగా కౌశిక్ రెడ్డిని అరెస్ట్ చేసి, ఎక్స్ టార్షన్ కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు. అంతకు ముందు కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు చీరా, గాజులు చూపిస్తూ కౌశిక్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదాస్పదంగా మారాయి. ఇటీవల సమక్క సారక్క జాతర జరుగుతున్న సమయంలో వీణవంక మండలంలోని సమ్మక్క జాతరకు కుటుంబ సమేతంగా వెళ్లిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి చేసిన హంగామా అంతా ఇంతా కాదు, విధి నిర్వహణలో ఉన్న పోలీసు అధికారిని మతం పేరుతో దూషించాడంటూ పెను దుమారం రేగింది. అదే రోజు బలవంతంగా కౌశిక్ రెడ్డిని అదుపులోకి తీసుకోవడం, రోజంతా హైడ్రామా కొనసాగింది. ఆవేశంలో మాట్లడాను , కావాలని మతం పేరుతో పోలీసు అధికారిని దూషించలేదంటూ క్షమాపణలు కోరుతూ మరుసటి రోజు వీడియో విడుదల చేయడంతో వివాదం కాస్తా తాత్కాలికంగా సర్దుమణిగింది. ఇలా ఒకటేమిటి హుజూరాబాద్ గడచిన ఎన్నికల సమయంలో కౌశిక్ రెడ్డి ఓట్లు అభ్యర్థించిన తీరు, కుటుంబ సమేతంగా విడుదల చేసిన వీడియోలు రాజకీయంగా వివాదాలను తెచ్చిపెట్టాయి. బీఆర్ ఎస్ నుంచి కాంగ్రెస్‌కు పార్టీ మారిన ఎమ్మెల్యేలు అరెకెపూడి గాంధీ, దానం నాగేందర్‌పై కౌశిక్ చేసిన వ్యాఖ్యలపై అంతే స్థాయిలో వాళ్లు స్పందించిన విధానం తిరిగి కౌశిక్ మెడకు చుట్టుకున్నాయి. కండలు తిరిగిన శరీరాకృతితో కనిపించే కౌశిక్ రెడ్డి, హావభావాలు, మాట్లాడే విధానం, ఎదుటి వ్యక్తులతో దురుసుగా ప్రవర్తించిన తీరుతో అధికార కాంగ్రెస్ పార్టీ విసిగిపోయింది. అదును చూసి దెబ్బకొట్టింది. అసెంబ్లీ నుంచి సాగనంపేందుకు సిద్ధమైంది. అయితే బీఆర్ఎస్ మాత్రం తమ పార్టీ ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి దూకుడుతో పార్టీకి డ్యామేజ్ జరుగుతుందో, మైలేజ్ వస్తుందో, అర్థం కాని అయోమయంలో కనిపిస్తోంది. సమర్థిస్తే పరువు పోతుంది. వెనుకేసుకొస్తే జనం నవ్వుతారేమో అనే దీర్ఘాలోచనలో ఉన్నట్లు కనిపిస్తోంది. కౌశిక్ రెడ్డి కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరి, ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత జరిగిన వరుస ఘటనల వల్ల పార్టీకి లాభం కంటే, నష్టమే ఎక్కువ. దూకుడు తప్పుకాదు, ఆవేశం తప్పుకాదు, కానీ ఎక్కడ వాడాలో తెలియకపోవడం అతిపెద్ద ముప్పు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి విషయంలో అదే జరుగుతోందంటున్నారు రాజకీయ విశ్లేకులు. విమర్శించడం, దాడి చేయడం, అరెస్ట్ అవ్వడం, నోరు జారడం, క్షమాపణలు చెప్పడం.. ఇలా కౌశిక్ రెడ్డికి గత కొంతకాలంగా అలవాటైపోయింది. ఈసారి అసెంబ్లీలో కడియంపై సైగలు చేసి అడ్డంగా దొరికేశాడంటున్న అధికార పార్టీ, భవిష్యత్‌లో మరెవరూ ఇలా మాట్లాడకుండా చేస్తామంటూ చెప్పిమరీ వేటు వేసేందుకు సిద్ధమైంది.

# ధాన్యంతో అన్నదాల నిరీక్షణ

నిజామాబాద్, ఏప్రిల్ 8,

మార్చి మూడో వారం నుంచే వరి కోతలు ప్రారంభమై ప్రస్తుతం వేగంగా సాగుతున్నాయి. రైతులు పెద్ద ఎత్తున ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల వద్దకు తరలిస్తున్నప్పటికీ కొనుగోళ్లు జరగకపోవడంతో నిల్వ సమస్యలు తీవ్రంగా మారాయి. పదిహేను రోజులుగా రైతులు ధాన్యాన్ని కుప్పలుగా వేసి కొనుగోళ్ల కోసం ఎదురు చూస్తున్నా, ఇప్పటివరకు ఒక్క క్వింటాల్ కూడా అధికారికంగా కొనుగోలు కాలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఏర్పాటు చేయాల్సిన 22 ఐకేపీ, 5 పిఎసిఎస్, 3 మెప్మా కొనుగోలు కేంద్రాలు ఇంకా ప్రారంభం కాలేదు. గతంలో కేంద్రాలు ఏర్పాటు చేసిన ప్రదేశాల్లోనే రైతులు ధాన్యం రాశులు పోసి వేచి చూస్తున్నారు. ధాన్యం పండించి కోత కోసిన అన్నదాతలకు నిరీక్షణ తప్పడం లేదు. మండలంలోని పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు మొదలయ్యాయి. వరి కోతలు మొదలై చేతికొచ్చిన పంటను కొనుగోలు కేంద్రాల వద్దకు తరలించి ఆరబోసుకున్నారు. ఇంకా కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం అన్నదాతలను ఒకింత ఆందోళనకు గురి చేస్తుంది. మండలంలో దాదాపు 25 శాతం వరి పొలాలు కోతలు పూర్తయ్యాయి. అయినా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో కొంతమంది రైతులు ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయించి నష్టపోవాల్సిన పరిస్థితి వస్తోంది. ఇప్పటి వరకు మంగపేట మండలంలో ఎక్కడా కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఊసే లేదు. దీనికి తోడు గత నాలుగు రోజులుగా వాతావరణంలో వచ్చిన మార్పులకు అన్నదాతలు మరింత ఆందోళనకు గురవుతున్నారు. కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడం, వర్షాలు పడే అవకాశాలు కనబడుతుండడంతో కొనుగోలు కేంద్రాల వద్దకు ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రైతాంగం కోరుతుంది పలు గ్రామాలలో గత పది, పదిహేను రోజుల నుండి వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగు రోజుల నుండి ఆకాశం మబ్బుగా ఉంది. ఎప్పుడు వర్షం పడుతుందో తెలియని పరిస్థితి. వర్షం వస్తే కొనుగోలు కేంద్రాల వద్ద ఉన్న ధాన్యం తడిచిపోయే అవకాశం ఉంది. దీంతో రైతులకు నష్టం వాటిల్లుతుంది. మండలంలో ఒకటి, రెండు చోట్ల లాంఛనంగా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి పత్రికలకు ప్రకటనలు ఇవ్వడమే తప్ప మండలంలో ఇప్పటి వరకు ఎక్కడా ఒక్క బస్తా వడ్లను కూడా కొనలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

కలవరపడుతున్న రైతులు..

ఎండల కారణంగా తేమ శాతం అనుకూలంగా ఉన్నప్పటికీ, అకాల వర్షాల భయం రైతులను కలవరపెడుతోంది. ఇతర ప్రాంతాల్లో వారం రోజుల క్రితమే ధాన్యం కేంద్రాలకు రాక ప్రారంభమైనప్పటికీ, కొనుగోళ్లు ఎక్కడా ప్రారంభం కాలేదని రైతులు చెబుతున్నారు. ధాన్యం కుప్పలుగా పేరుకుపోవడంతో వాటి రక్షణ కూడా సమస్యగా మారింది. ప్రస్తుత పరిస్థితుల ప్రకారం పూర్తిస్థాయిలో కొనుగోళ్లు ప్రారంభం కావడానికి ఇంకా సమయం పట్టే అవకాశముందని తెలుస్తోంది. ఇదే సమయంలో అకాల వర్షాలు, వడగండ్ల వానల ముప్పు ఉండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి తమను మండల రైతులు కోరుతున్నారు. వడ్లను గతంలో ధాన్యం కొనుగోలు చేసిన చోటుకు తీసుకువచ్చి 10 రోజులు అవుతోంది. కొనుగోలు కేంద్రం ఎప్పుడు ప్రారంభిస్తారో తెలియట్లేదు. ఇప్పటి వరకు ఇక్కడ ఈ విధమైన ఏర్పాట్లు చేయలేదు ఈడ పరిస్థితి చూస్తుంటే ఇంకా సమయం పట్టేటట్టు ఉంది.

# సర్కారీ కొలువుల్లేకపోయినా...భారీగా ఉద్యోగాలు

హైదరాబాద్, ఏప్రిల్ 8,

ఆసక్తికర లెక్కలు వెలుగు చూశాయి. తెలంగాణ రాష్ట్రం కొలువులకు కేరాఫ్ అడ్రస్ గా మారుతోంది. దేశ వ్యాప్తంగా ఉన్న ఐటీ కొలువులు మాత్రమే కాదు.. పారిశ్రామిక రంగాల విస్తరణతో పాటు.. కొత్త సంస్థలు కొలువు తీరటంతో పాటు.. సేవా రంగం భారీ ఎత్తున విస్తరిస్తున్న వేళ.. ఉపాధి కల్పనలో తెలంగాణ రాష్ట్రం దూసుకెళుతోంది. కాకి లెక్కలు కాకుండా.. ఉద్యోగులు ఎవరైనా సరే.. ఈపీఎఫ్ వో వద్ద నమోదయ్యే గణాంకాల ప్రకారం చూస్తే.. ఆశ్చర్యానికి గురి చేసే గణంకాలు తెర మీదకు వచ్చాయి. గడిచిన ఎనిమిది నెలల విషయాన్నే తీసుకుంటే.. దాదాపు 3.12 లక్షల మంది తొలిసారి ఉద్యోగాల్లో చేరినట్లుగా వెల్లడైంది. ఈ కొలువుల్లో అధిక నైపుణ్యం ఉన్న ఉద్యోగాలు మాత్రమే కాదు.. మధ్యస్థాయి కొలువులు సైతం గణనీయంగా పెరిగిన విషయం వెల్లడైంది. ఈ పెరిగిన కొలువుల్లో కీలకభూమిక పోషించింది మాత్రం హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాలే అని చెప్పాలి. ఈపీఎఫ్ వో గణాంకాల్ని పరిశీలిస్తే రాష్ట్రవ్యాప్తంగా 55.42 లక్షల మంది పని చేస్తున్నట్లు తేలింది. ఇందులో ఒక్క హైదరాబాద్.. రంగారెడ్డి జిల్లాల్లోనే 42.8 లక్షల మంది ఉండటం గమనార్హం. ఒక్క హైదరాబాద్ జిల్లాలోనే 31.39 లక్షల మంది ఉద్యోగులు ఉన్నట్లుగా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్ మహానగరంలోని అత్యధిక ప్రాంతం ఈ రెండు జిల్లాల్లోనే ఉందన్న సంగతి తెలిసిందే. గడిచిన ఐదేళ్లలో దాదాపు 7.23 లక్షల మంది కొత్తగా ఉద్యోగాల్లోకి వచ్చారు. రంగారెడ్డి జిల్లాలో 4 లక్షల ఉద్యోగాలు వచ్చాయి. అదే సమయంలో నిజామాబాద్.. ఆదిలాబాద్ జిల్లాల్లో మాత్రం ఉద్యోగుల సంఖ్య కాస్త తగ్గింది. గడిచిన ఆర్థిక సంవత్సరంలో (2025 ఏప్రిల్ 1 నుంచి 2026 మార్చి 31 వరకు మధ్యకాలం) కొత్తగా వచ్చిన ఉద్యోగాలు భారీగా వచ్చాయి. గడిచిన ఐదేళ్లలో వచ్చిన ఉద్యోగాల్లో దాదాపు 30 శాతానికి పైనే ఉండటం ఆసక్తికరంగా మారింది. ఇ

# కాలుష్యం,రోగాలు మాకు.. అభివృద్ధి మీకా..

**- సిఎస్ఆర్ నిధుల తరలింపు పైన పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆగ్రహం**

**- స్థానిక పరిశ్రమల సిఎస్ఆర్ నిధులు స్థానిక అభివృద్ధి పనులకు కేటాయించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు వినతి**

**- నిధులు కేటాయించని పక్షంలో ప్రజా ఉద్యమం**



సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 8:

ఆసియాలోని అతిపెద్ద పారిశ్రామిక వాడగా పేరుందిన పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని పరిశ్రమల సిఎస్ఆర్ నిధులను స్థానిక అభివృద్ధి పనుల కోసం కేటాయించాలని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం జిల్లా కలెక్టర్ ప్రావిణ్యకు వినతి పత్రం అందించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ పచ్చటి పొలాలు మూడు పంటలు, పండే భూములు, స్వచ్ఛమైన గాలి,అందమైన తమ పల్లెల పరిధిలో అభివృద్ధి కోసం నూతన పరిశ్రమలు ఏర్పాటు అయితే తమ గ్రామాలు అభివృద్ధి చెందడంతో పాటు స్థానికంగా ఉపాధి లభిస్తుందన్న కొంగత్త ఆశలతో పటాన్చెరు నియోజకవర్గ ప్రజలు 70వ దశకంలో పరిశ్రమల ఏర్పాటునకు స్వాగతం పలికారని అన్నారు.పటాన్చెరు నియోజకవర్గపరిధిలోని ఇస్నాపూర్, పాశమైలారం, పటాన్చెరు, జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం, కాజీపల్లి, కిష్టాయపల్లి, బొల్లారం, గుమ్మడిదల మండల పరిధిలోని బొంతపల్లి, గుమ్మడిదల,అమీన్పూర్ మండల పరిధిలోని సుల్తాన్పూర్, గండి గూడెం, దయరా గ్రామాల పరిధిలో వివిధ రంగాలకు చెందిన పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ప్రధానంగా బల్క్ డ్రగ్స్ పరిశ్రమలతో పాటు కెమికల్స్, మెడిసిన్స్, పెస్టిసైడ్స్ కంపెనీలు ఏర్పాటయ్యాయని తెలిపారు.పటాన్చెరు నియోజకవర్గ కాలుష్య పరిస్థితులపై సుప్రీంకోర్టు సైతం జస్టిస్ మిగతా కమిషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక నివేదిక తప్పించుకుంది. అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ రంగరాజన్ సైతం స్వయంగా నియోజకవర్గంలో పర్యటించి కాలుష్య పరిస్థితులను తెలుసుకున్నారనిపేర్కొన్నారు.సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు 2016లో చెన్నైలోని జాతీయ హరిత ట్రిబ్యునల్ కాలుష్య నివారణ అంశంపై కీలక ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. కాలుష్యం మూలంగా వ్యాధులకు గురవుతున్న ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి తో పాటు ఇస్నాపూర్ పెద్ద చెరువు, గండిగూడెం, ఆసాని కుంట, కిష్టారెడ్డిపేట చెరువుల పరిధిలో సీవరేజ్ ట్రీట్మెంట్ సైతం ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.నియోజకవర్గ పరిధిలోని బల్క్ డ్రగ్స్ పరిశ్రమలు ప్రతి సంవత్సరం తమ లాభాల్లో 0.5 శాతం డబ్బులు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలోని ప్రత్యేక అకౌంట్లో జమ చేసిసూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్వహణకు ఆదేశాలు సైతం జారీ చేసిందన్నారు. 2023 లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పటాన్చెరు నియోజకవర్గ పరిధిలోని వివిధ పరిశ్రమలు అందిస్తున్న సిఎస్ఆర్ నిధులను స్థానికంగా ఖర్చు చేయకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారని వివరించారు. నీళ్లు నిధులు నియామకాలు అన్న అంశంతో ఏర్పాటైన ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో స్థానిక నిధులు స్థానికంగా ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.

ప్రతి రోజు కాలుష్య జలాలు విష వాయువులతో జీవనం కొనసాగిస్తున్న పటాన్చెరు నియోజకవర్గ ప్రజలకు పరిశ్రమలు అందిస్తున్న సిఎస్ఆర్ నిధుల ద్వారా వివిధ అభివృద్ధి పనులు నిర్వహిస్తున్నాము. గత రెండున్నర సంవత్సరాలుగా సిఎస్ఆర్ నిధులు లేకపోవడం మూలంగా అభివృద్ధి కుంటూ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ అంశంపై ప్రభుత్వం వెంటనే స్పందించి పటాన్చెరు నియోజకవర్గం నుండి చెల్లిస్తున్న సి ఎస్ఆర్ నిధులను స్థానికంగా ఖర్చు పెట్టాలని లేని పక్షంలో ప్రజల నిరసనను ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్, జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్, దశరథ్ రెడ్డి, వెంకటేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలనలో భాగంగా గర్భిణీ స్త్రీలకు వైద్య సూచనలు

జగిత్యాల, ఏప్రిల్ 8 ( భారత శక్తి ప్రతినిధి ):

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో గర్భిణీ



మహిళలకు అనుసరించాల్సిన ఆరోగ్య జాగ్రత్తలు, పోషకాహారం, నియమిత పరీక్షలు మరియు ప్రసవానికి ముందస్తు ఏర్పాట్లపై వైద్యులు సలహాలు సూచనలు చేశారు.

గర్భధారణ సమయంలో తల్లి మరియు శిశువు ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న సేవలను వినియోగించుకోవాలని సూచించారు. సాధ్యమైనంతవరకు సాధారణ ప్రసవానికి (నార్మల్ డెలివరీ) ప్రాధాన్యత ఇవ్వాలని, వైద్యుల సూచనలు పాటించాలని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ గర్భిణీ మహిళలు సమయానికి వైద్య పరీక్షలు చేయించుకోవడం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రలు తీసుకోవడం, పోషకాహారం తీసుకోవడం వంటి అంశాలను పాటించాలని తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న వైద్య సేవలను పూర్తిగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. అలాగే సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా తల్లి మరియు శిశువు ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి (డి ఎం ఎచ్ ఓ ) సుజాత, డిప్యూటీ డి ఎం ఎచ్ ఓ జైపాల్ రెడ్డి, సూపరిండెంట్ కృష్ణమూర్తి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఈవీఎం గోదాము తనిఖీ

## భద్రత ఏర్పాట్లు, సిసి కెమెరాల పనితీరులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

జగిత్యాల, ఏప్రిల్ 8( భారత శక్తి ప్రతినిధి ):

రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు బుధవారం రోజున జిల్లా ఎన్నికల అధికారి మరియు జిల్లా కలెక్టర్ బి. సత్య ప్రసాద్ దరూర్ క్యాంప్ లో గల ఈవీఎం లను భద్రపరిచిన గోదామును తనిఖీ చేశారు.




ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెల ఈవీఎం లను తనిఖీ చేయడం జరుగుతుందని గోడౌన్ లోని యంత్రాల భద్రత, సిసి కెమెరాల పనితీరు, సాంకేతికపరమైన అంశాలను సమగ్రంగా పరిశీలించడం జరిగిందని తెలిపారు.

గోదాము వద్ద ఎలాంటి లోపాలు లేకుండా పటిష్టమైన భద్రత ఉండాలని, నిత్యం అప్రమత్తతతో పర్యవేక్షించాలని సిబ్బందికి సూచించారు.

ఈ పర్యవేక్షణలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బి.ఎస్ లత, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు మరియు కలెక్టరేట్ ఏవో హకీమ్, జగిత్యాల అర్బన్ ఎమ్మార్వో రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యవసర వైద్య సేవల విభాగం వైద్యులకు త్వరితగతిన అందుబాటులోకి తేవాలి:

## జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్.

నిర్మల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 08(భారత శక్తి): జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలోని అత్యవసర వైద్య సేవల విభాగాన్ని త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.

బుధవారం జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, పట్టణంలోని జిల్లా ప్రభుత్వ సాధారణ ఆసుపత్రి ప్రాంగణంలో



నిర్మాణం చివరిదశలో ఉన్న అత్యవసర వైద్య సేవల విభాగాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ తనిఖీ చేశారు. ఆసుపత్రి భవంతి నిర్మాణానికి సంబంధించి మ్యాపులను సంబంధిత అధికారులు కలెక్టర్ కు వివరించారు. ఆసుపత్రి నిర్మాణం పూర్తయిన వివరాలు, ఇంకా చేపట్టవలసిన పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఆ తర్వాత వివిధ విభాగాలను పరిశీలించారు. శస్త్ర చికిత్సల గదులు, డయాలసిస్ కేంద్రం, ఐ.సి.యు, గైనిక్ విభాగం, ఎలక్ట్రికల్ యూనిట్, ఫైర్ సేఫ్టీ విభాగాలు పరిశీలించారు. మిగిలి ఉన్న పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు వైద్య సేవల నిమిత్తం అందుబాటులోకి తేవాలన్నారు.

అనంతరం సమీపంలోని యుడిఐడి (సదరం) కేంద్రం, డ్రగ్స్ డి అడిక్షన్ సెంటర్ లు పరిశీలించారు.

ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర వైద్య సేవల విభాగం, రక్త పరీక్షల గది, తదితర విభాగాలు పరిశీలించారు. అన్ని రకాల రిజిస్టర్లను చూశారు. బ్లడ్ బ్యాంక్ ను తనిఖీ చేసి, రికార్డు పరిశీలించారు. రికార్డుల్లో ఇంతకుముందు బ్లడ్ బ్యాంక్ ద్వారా రక్తం పొందిన వారికి ఫోన్ చేసి, వివరాలు సరిపోల్చారు. రికార్డులు, రసీదులు పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు.

ఈ తనిఖీలలో ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, తహసీల్దార్ రాజు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అంతకుముందు పట్టణంలోని గుల్జార్ మార్కెట్ ప్రాంతంలో గల బస్తీ దవాఖానను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అన్ని రకాల రిజిస్టర్లను పరిశీలించారు. ఆస్పత్రిలో చికిత్స కొరకు రోగులకు సేవా దృక్పథంతో వైద్యం అందించాలన్నారు. ఆసుపత్రి ప్రాంగణాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవల గురించి వివరాలు వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజేందర్, అధికారులు సౌమ్య, స్థానిక కౌన్సిలర్ తౌహిదుద్దిన్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ లో బీఆర్ఎస్ ప్లీనరి

కరీంనగర్, ఏప్రిల్ 8,

కేసీఆర్ మాటలనే అస్త్రాలుగా వాడతారు. పదునైన తన డైలాగులతో ప్రత్యర్థులకు చుక్కలు చూపిస్తారు. తీరా చూస్తే ఆచరణలో అవి పెద్దగా ముందుకు సాగవని విమర్శలు ఉన్నాయి. దానికి ఉదాహరణలు కూడా ఉన్నాయి. కేసీఆర్ గత ఏడాది పార్టీ ప్లీనరీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన ప్రసంగం కనుక చూస్తే తాను ఇక నుంచి జనంలో ఉంటాను అన్ బిగ్ స్టేట్మెంట్ ఇచ్చేశారు. ఈ రోజు నుంచి మీటింగుల మీద మీటింగులే, జనంలో ఉంటూ కాంగ్రెస్ సర్కార్ ని నిలదీస్తామని అన్నారు. కానీ ఆ తరువాత కేరాఫ్ ఫాం హౌస్ గానే కథ సాగింది. మళ్ళీ గత ఏడాది డిసెంబర్ నెలలో కేసీఆర్ మీడియా ముందుకు వచ్చరు. ఆయన మాట్లాడుతూ ఇక మీదట జనంలో ఉంటాం, కొత్త ఏడాది అంటీఅ 2026లో వరసగా అనేక జిల్లాలలో మీటింగ్స్ పెడతాం, ఇక సమరమే అని గర్జించారు. కానీ అది కూడా జరగలేదు. చూస్తూండగానే ఏడాది గడచిపోయింది. ఇక ఈసారి ప్లీనరీ ఎక్కడ అన్న చర్చ బీఆర్ఎస్ పార్టీలో సాగుతోంది. అయితే ఉమ్మడి కరీం నగర్ జిల్లాలో నిర్వహిస్తారు అని అంటున్నారు. దానికి కారణం ఉత్తర తెలంగాణాలో బీఆర్ఎస్ కారు జోరు తగ్గిది అన్న భావన ఉండడమే. 2023 ఎన్నికల్లో కూడా బలమైన ఈ ప్రాంతంలో సరిగా వర్క్ చేసుకోకపోవడం వల్ల దక్కాల్సిన సీట్లు కూడా దక్కలేదు అన్న భావనతో బీఆర్ ఎస్ పెద్దలు ఉన్నారుట. ఉద్యమ కాలం నుంచి కూడా తమకు అన్ని విధాలుగా కలిసి వచ్చి అచ్చి వచ్చిన ఉమ్మడి కరీంనగర్ లోనే ప్లీనరీ పెడితే అది మంచి ఊపు ఇస్తుందని ఆ మీదట రానున్న కాలమంతా బీఆర్ఎస్ కారు స్పీడ్ అందుకుంటుందని లెక్కలేస్తున్నారు

అంతే కాదు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో నిర్వహించే భారీ ప్లీనరీలోనే కాంగ్రెస్ కి రాజీనామా చేసి బయటకు వచ్చిన సీనియర్ నేత మాజీ మంత్రి టీ జీవన్ రెడ్డిని కండువా కప్పి చేర్చుకుంటారు అని అంటున్నారు. ఆ విధంగా తమ బలం పెరిగింది అన్న సందేశాన్ని ఈ సభ సాక్షిగా ఇస్తారు అని అంటున్నారు. రాజకీయ అనుభవంలోనూ సీనియారిటీలోనూ కేసీఆర్ కి సమకాలీనుడు సరి జోడు అయిన జీవన్ రెడ్డి చేరికను కూడా ఒక సంబరంగా నిర్వహించి క్యాడర్ కి సందేశం ఇవ్వాలని చూస్తున్నారుట.

ఇవన్నీ పక్కన పెడితే ఈ ప్లీనరీ తరువాత అయినా కేసీఆర్ జనంలోకి వస్తారా గట్టిగా మాట్లాడుతారా అన్న చర్చ సాగుతోంది. ఈ నెల 27న బీఆర్ఎస్ ప్లీనరీ ఉంది. ఆ సభలో కేసీఆర్ ఏమి మాట్లాడుతారు అన్నది కూడా అంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే గత ప్లీనరీలో కేసీఆర్ ప్రసంగంలో పస లేదని సొంత కుమార్తె నాటి బీఆర్ ఎస్ మహిళా నాయకురాలు అయిన కవిత సంధించిన లేఖాస్త్రాలు అప్పట్లో వైరల్ అయ్యాయి. బీజేపీని విమర్శించడంలో పెద్దగా ఫోకస్ పెట్టలేదని ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. మరి ఈసారి కేసీఆర్ ఏ అస్త్రాలను సిద్ధం చేసుకుని సభకు వస్తున్నారో చూడాల్సి ఉంది అని అంటున్నారు.

# గుమ్మడిదల రైతులకు న్యాయం చేయండి

**- భూములు అందించిన ప్రతి రైతుకు వంద గజాలు కేటాయించండి**

**- జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 8:

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబరు 109 లో పరిశ్రమల స్థాపన కోసం భూములు అందించిన ప్రతి రైతుకు 100 గజాల ఇళ్ల స్థలం కేటాయించాలని కోరుతూ పటాన్చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తో కలిసి కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబర్ 109లో గల సుమారు 160 ఎకరాల భూమిని పారిశ్రామిక మౌలిక సదుపాయాల కోసం సేకరించిన సమయంలో రైతులకు నష్టపరిహారంతో పాటు ప్రతి ఒక్కరికి వంద గజాల నివాస స్థలం ఇస్తామని అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి సమక్షంలో హామీ ఇచ్చినట్లు తెలిపారు. హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్న నేటి వరకు ప్లాట్ల కేటాయింపు జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాట్ల కోసం ఐదు ఎకరాల స్థలాన్ని గుర్తించిన విషయాన్ని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే ఆ స్థలాన్ని కూడా పరిశ్రమలకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాంటి చర్యలు తీసుకుంటే తీవ్రంగా పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్లాట్ల కేటాయింపును త్వరితగతిన చేయాలని కోరారు. ఈ సమస్యపై అధికారులతో చర్చించి ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, వెంకట్రంరెడ్డి, హుస్సేన్ బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.



# అక్రమ ఇసుక రవాణాపై ఉక్కుపాదం

## మార్చి నెలలో విస్తృత తనిఖీలు

### 120 ఎఫ్ఐఆర్‌లు
### 139 వాహనాల స్వాధీనం
### 161 మంది నిందితులపై కేసులు
### కరీంనగర్ సీపీ గౌష్ ఆలం

కరీంనగర్ ప్రతినిధి, ఏప్రిల్ 8 (భారతశక్తి):కరీంనగర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో అక్రమ ఇసుక రవాణా, నిల్వ, విక్రయాలపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని పోలీస్ అధికారులు తెలిపారు. మార్చి నెలలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి 120 కేసులు నమోదు చేసి, 139 వాహనాలను స్వాధీనం చేసుకుని, 161 మంది నిందితులపై చర్యలు తీసుకున్నట్లు వెల్లడించారు. అక్రమ ఇసుక రవాణా కారణంగా ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా, రోడ్డు భద్రత, పర్యావరణ సమతుల్యత, ప్రజా శాంతి భద్రతలపై ప్రతికూల ప్రభావం పడుతున్న నేపథ్యంలో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు.డివిజన్ వారీగా చర్యలుటౌన్ డివిజన్ పరిధిలో 15 కేసులు, 12 వాహనాల స్వాధీనం, 15 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.రూరల్ డివిజన్ పరిధిలో అత్యధికంగా 73 కేసులు, 79 వాహనాల స్వాధీనం, 98 మంది నిందితులపై కేసులు నమోదయ్యాయి.హుజురాబాద్ డివిజన్ పరిధిలో 32 కేసులు, 48 వాహనాల స్వాధీనం, 48 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.పోలీస్ స్టేషన్‌ల వారీగా గణాంకాలుమార్చి నెలలో కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 28 ఎఫ్ఐఆర్‌లు, 36 వాహనాల స్వాధీనం, 40 మంది నిందితులపై చర్యలు తీసుకున్నారు.జమ్మికుంట పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు, 24 వాహనాల స్వాధీనం, 24 మంది నిందితులు నమోదు అయ్యారు.ఎల్ఎండీ కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలో 15 కేసులు నమోదయ్యాయి.మానకొండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 10 కేసులు, 10 వాహనాలు, 15 మంది నిందితులు గుర్తించబడ్డారు.కరీంనగర్-×× టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 9 కేసులు, 6 వాహనాలు, 9 మంది నిందితులపై



చర్యలు తీసుకున్నారు.ఈ ఏడాది (మార్చి వరకు) సమగ్ర గణాంకాలు2026 సంవత్సరంలో మార్చి నెల వరకు కమిషనరేట్ పరిధిలో మొత్తం 245 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయగా, 357 వాహనాలను స్వాధీనం చేసుకుని, 422 మంది నిందితులపై కేసులు నమోదు చేసినట్లు సీపీ తెలిపారు.

డివిజన్ వారీగాటౌన్ డివిజన్: 24 కేసులు, 27 వాహనాలు, 32 నిందితులురూరల్ డివిజన్: 139 కేసులు, 203 వాహనాలు, 241 నిందితులుహుజురాబాద్ డివిజన్: 82 కేసులు, 127 వాహనాలు, 149 నిందితులు

పోలీసుల హెచ్చరికఅక్రమంగా ఇసుక తవ్వకం, రవాణా, నిల్వ, విక్రయాల్లో పాల్గొనే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇలాంటి అక్రమ కార్యకలాపాలపై ప్రజలు సమాచారం అందించాలని, సమాచారదాతల వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలిపారు. అక్రమ ఇసుక రవాణా వల్ల ప్రభుత్వ ఆదాయానికి నష్టం కలగడమే కాకుండా పర్యావరణానికి కూడా తీవ్ర నష్టం జరుగుతుంది. ఇలాంటి కార్యకలాపాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించము. సంబంధిత పోలీస్ స్టేషన్‌ల పరిధిలో తనిఖీలు, నిఘా మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చాం అని పోలీస్ కమిషనర్ తెలిపారు.

# సురక్షిత మాతృత్వం పై సూచనలు చేసిన డిఎంహెచ్వో

ములుగు జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 08 (భారత శక్తి) : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో" బుధవారం సురక్షిత మాతృత్వ, లింగ నిర్ధారణ నిరోధక చట్టం పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు వర్క్ షాప్ నిర్వహించి మాట్లాడారు.



ముందస్తుగానే ప్రమాద సూచికలు ఉన్న గర్భిణీ స్త్రీలను గుర్తించి, దానికి అనుగుణంగా ప్రత్యేకమైన వైద్య సేవలు అందిస్తే మాతృ, శిశు మరణాలను తగ్గించుకోవచ్చని, లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహించే ప్రైవేట్ హాస్పిటల్స్ రిజిస్ట్రేషన్ రద్దు చేస్తూ, చట్టరీత్య చర్యలు ఉంటాయని హెచ్చరించారు. గర్భిణీ స్త్రీలు మూడు వారాలలోపే నమోదు చేసుకొని, క్రమం తప్పకుండా పరీక్షలు నిర్వహించి, రక్తహీనతలు ఉన్నట్లయితే ఐరన్ మాత్రలతో పాటు పోషకాహారాన్ని అందించాలని, మధుమేహము, రక్తపోటు, థైరాయిడ్ ,మలేరియా, టీబి లక్షణాలు ఉంటే క్రమం తప్పకుండా స్త్రీల వైద్య నిపుణులచే పరీక్షలను నిర్వహించి ,వారి సూచన మేరకు క మందులను వాడిలని అన్నారు. తల్లి, శిశువు మరణాలు సంభవించకుండా సుఖప్రసవము అవుతుందని తెలిపారు. అత్యవసర సమయాలలో 108 వాహనాలను మరియు గర్భిణీ పరీక్షలకు 102 వాహనాలను కూడా ఉపయోగించుకోవాలని తెలిపారు. గర్భిణీ స్త్రీలకు గ్రామాలలో అంగన్వాడి ద్వారా అందించే పోషకాహార కార్యక్రమాలలో మరియు ఉప కేంద్రాలలో చేసే గర్భిణీ పరీక్షల సమయాలలో పోషకాహార

వ్యాధినిరోధక టీకాలపోషకాహార ప్రాముఖ్యతలను వివరించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. అటు తర్వాత గవర్నమెంట్ జనరల్ హాస్పిటల్ సూపరిండెంట్ డాక్టర్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, కుటుంబ నియంత్రణ కార్యక్రమము యొక్క ప్రాముఖ్యతను వివరిస్తూ, కుటుంబ నియంత్రణలో శాశ్వత మరియు తాత్కాలిక పద్ధతులు ఉంటాయని, శాశ్వత పద్ధతులలో ప్రాసెక్టమి పురుషులకు ఆపరేషన్ చేస్తారని, ట్యూబెక్టమి ఆపరేషన్ స్త్రీలకు చేస్తారని, బిడ్డ బిడ్డకు ఎడం కొరకు తాత్కాలిక పద్ధతులైన ఓరల్ పిల్స్ అంత్ర ఇంజక్షన్లు ఇస్తారని వీటి ద్వారా తల్లి బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వివరించారు. జి జి హెచ్ స్త్రీ వైద్య నిపుణురాలు డాక్టర్. ఉషారాణి మాట్లాడుతూ ప్రమాద సూచికలు ఉన్న గర్భిణీ స్త్రీలను తగు సమయాలలో ఉన్నతశ్రేణి ఆసుపత్రులకు తరలించాలని, ముందే తగు ప్రణాళికలను ఆరోగ్య కార్యకర్తలు తయారు చేసుకోవాలని, అదేవిధంగా గుండె సంబంధించిన జబ్బులతో బాధపడుతున్న గర్భిణీ స్త్రీలను ముందస్తుగానే హాస్పిటల్కు రావాలని అప్పుడే ప్రమాదం నుండి రక్షించవచ్చునని వివరించారు. ప్రసూతి అనంతరం చేసే వైద్య సపర్యల గురించి డాక్టర్ నిరంజని వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీకాంత్ డాక్టర్ నాగ అనేష్ డాక్టర్ రంజిత్ మాస్ మీడియా అధికారి సంపత్ సూపర్వైజర్ వెంకట్ రెడ్డి అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ ములుగు మెడికల్ కాలేజ్ విద్యార్థిని, విద్యార్థులు నర్సింగ్ విద్యార్థినీలు పాల్గొన్నారు.

# బిజెపి, బీఆర్ఎస్ లవి చెత్త రాజకీయాలు

## మానేర్ చుట్టున్న గంగులకు డంపుయార్డు కనబడలేదా

## ఏడేళ్లు ఎంపీగా, రెండేళ్లు కేంద్రమంత్రిగా బండి చేసిందేంది

## సుడా చైర్మన్ కోమటిరెడ్డి తీవ్ర విమర్శలు

కరీంనగర్ ప్రతినిధి, ఏప్రిల్ 8(భారతశక్తి):



కరీంనగర్ లోనీ దంపు యార్డుకు బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు చెత్తతో చెత్త రాజకీయాలు చేస్తున్నాయని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి మండిపడ్డారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో స్మార్ట్ సిటీ నిధులలో కోట్ల రూపాయలు కొల్లగొట్టి అవినీతి పాలన చేశారని ఆరోపించారు. కరీంనగర్ లో గుట్టలు గుట్టలుగా చెత్త పేరుకు పోవడానికి ప్రధాన కారణంగా బిఆర్ఎస్ పార్టీ అసమర్థ పాలనే అన్నారు. గత ఏడాది జనవరి 24 న కేంద్ర పురపాలక శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ తో తెగ హడావిడి చేసి దంపు యార్డ్ సమస్యకు పరిష్కారం చూపుతామన్న బండి సంజయ్ కుమార్ ఇప్పుడు దంపు యార్డు విషయంలో రెండు నాలుకల ధోరణి అవలంబిస్తున్నారని మండిపడ్డారు. చెత్తను తరలిస్తామని అడ్డగోలు హామీలు ఇచ్చి, మున్సిపల్ ఎన్నికల్లోనూ ఓట్లు దండుకున్నారని ఆరోపించారు. కరీంనగర్లో ఒకటి హుజురాబాద్ లోనీ డప్పింగ్ యార్డుకు డ్రామాలు ఆడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ లోని డంప్ యార్డ్ లో చెత్తను తొలగించే విషయంలో బండి సంజయ్ కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయినా తెచ్చారా అని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం వాటాను దాచి కరీంనగర్ ను కేంద్రమే అభివృద్ధి చేస్తుందని అబద్ధాలు చెప్పారని, ఇప్పటికైనా ప్రజలకు భ్రమలు కల్పించడం మానుకోవాలని అన్నారు. హుజురాబాద్ లో బీఆర్ఎస్ బిజెపి నేతలు దీక్షల పేరుతో ప్రజలను మభ్యపెడుతున్నారని, ఉరేసుకొని చస్తామంటూ పల్టీలు కొడుతున్నారని విమర్శించారు. బిఆర్ఎస్,బిజేపీ పార్టీల వారిని ప్రజలు ఉరికించి కొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు ఉరేసుకోవాల్సిన అవసరం లేదని, ప్రజలే ఉరివేస్తారని అన్నారు. కరీంనగర్ లోని డంప్ యార్డు లో చెత్తను పూర్తిగా తొలగించి వెస్ట్ ఎనర్జీ ప్లాంట్ ద్వారా ఎప్పటికప్పుడు చెత్తను తొలగించి ఎటువంటి నిల్వ లేకుండా చేయాలని ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, ఇచ్చిన హామీని సీఎం రేవంత్ రెడ్డి నెరవేరుస్తారని అన్నారు. చెత్త నిల్వ లేనప్పుడు అది సిర్సపల్లి లో ఏర్పాటు చేసిన ఎక్కడ ఏర్పాటు చేసినా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగవని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇప్పటికైనా డంప్ యార్డ్ విషయంలో బిజెపి బీఆర్ఎస్ చేస్తున్న కుట్రలను ప్రజలు తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు తాజొద్దీన్, పిట్టల రవీందర్, కార్పొరేటర్లు చాడగొండ బుచ్చిరెడ్డి, వరాల నర్సింగం, పర్వతం మల్లేశం,కాంతాల జగన్ రెడ్డి,నాయకులు గుండాటి శ్రీనివాస్ రెడ్డి,సరిల్ల ప్రసాద్,ఇక్రమ్ సిఖిందర్,కొట్టె ప్రభాకర్,ఖలీల్,దేవేందర్ పటేల్,హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళన ఆహ్వాన కరపత్రం ఆవిష్కరణ





జగిత్యాల, ఏప్రిల్ 8 ( భారత శక్తి ప్రతినిధి ): ధర్మపురి లో ఈనెల 12వ తేదీ ఆదివారం రోజున సాయంత్రం బాలికల ఉన్నత పాఠశాల వాటర్ ట్యాంక్ దగ్గర జరగబోయే హిందూ సమ్మేళన కరపత్రాన్ని స్థానిక నంది చౌరస్తా వద్ద స్థానిక నాయకులు మరియు హిందుత్వవాదులు కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయవలసిందిగా పిలుపునిచ్చారు. ఇట్టి కార్యక్రమంలో ధర్మపురి మున్సిపల్ చైర్ పర్సన్ వేముల నాగలక్ష్మి, హిందూ సమ్మేళన సమితి అధ్యక్షుడు ఇమ్మడి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కొంక సుధీర్, జనరల్ సెక్రెటరీ ఉప్పుల రాకేష్, కోశాధికారి పిన్న శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి పూదరి పవన్, సోమిశెట్టి శివ సాయి, హిందూ సమ్మేళన సమితి కార్యవర్గ సభ్యులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# వేద రెస్టారెంట్ ను ప్రారంభించిన టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి

సంగారెడ్డి, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 8 :

సంగారెడ్డి పట్టణంలో కలెక్టరేట్ కార్యాలయం ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన వేద మల్టీ క్యుసిన్ రెస్టారెంట్ ను బుధవారం టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ సంగారెడ్డి పట్టణం రోజురోజుకు విస్తరిస్తోందని, ఐఐటి హైదరబాద్ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలతో పాటు హైదరాబాద్ నగరానికి చేరువ లో ఉండటం తో ఎంతో మంది సంగారెడ్డి నుండి నిత్యం రాకపోకలు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రజల అవసరాల కు తగ్గట్టు గా అదే స్థాయిలో హోటళ్ళు, రెస్టారెంట్ లు, వ్యాపార సముదాయాలు ఏర్పడుతున్నాయని అన్నారు. వేద రెస్టారెంట్ ద్వారా ప్రజలకు నాణ్యమైన, ఆరోగ్యకరమైన భోజనం అందించాలని ఆకాక్షించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ కూన వనితా సంతోష్, నాయకులు కూన సంతోష్, శ్రీశైలం , కౌన్సిలర్లు శైలేష్ రెడ్డి, రమేష్, రవి నాయక్, వంశీ, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.



# పార్శిల్ ప్యాకింగ్ - బుకింగ్ ఒకే చోట

## -తపాల శాఖ నూతన సేవలు

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, ఏప్రిల్ 08:

పోస్టల్ శాఖ ప్రజల యొక్క పార్శిల్ ప్యాకింగ్ సమస్యను గుర్తించి ఇప్పుడు విజయవాజ పోస్టల్ డివిజన్ పరిధిలోని 19 ఆఫీసుల యందు పార్సిల్ ప్యాకింగ్ యూనిట్లను ఏర్పాటు చేసినది. ఇప్పటి వరకు ప్రజలు తమ పార్శిల్ ప్యాకింగ్ కోసం ప్రైవేటు వ్యక్తుల మీద ఆధారపడేవారు.పోస్టాఫీసులలోని పార్శిల్ ప్యాకింగ్ యూనిట్ల యందు కస్టమర్లు నిర్దేశించిన రుసుము చెల్లించినయెడల నాణ్యమైన సామగ్రితో పార్సిల్ ప్యాకింగ్ మరియు బుకింగ్ సదుపాయం ఒకే చోట కల్పించటం జరుగుతుంది. పార్సిల్ ప్యాకింగ్ చేసినందుకు కనీస రుసుమును (రూ.10o జి ఎస్ టి ) మాత్రమే సర్వీస్ చార్జెస్ గా వసూలు చేయటం జరుగుతుంది. కావున కస్టమర్లు విజయవాడ పోస్టల్ డివిజన్ పరిధిలోని 1) విజయవాడ జీపఓ , 2) బకింగ్‌హామ్‌పేట్ ఎచ్ ఓ , 3) విజయవాడ పాలిటెక్నిక్ ఎస్ ఓ , 4)వెంకటేశ్వరపురం ఎస్ ఓ , 5)అజిత్‌నగర్ ఎస్ .ఓ , 6)గాంధీనగరం ఎస్ .ఓ , 7) సత్యనారాయణపురం ఎస్ .ఓ , 8)ఆటోనగర్ ఎస్ .ఓ , 9)గొల్లపూడి బజార్ ఎస్ ఓ , 10)కంకిపాడు ఎస్ .ఓ , 11) జగ్గయ్యపేట ఎస్ .ఓ , 12)రామవరప్పాడు ఎస్ .ఓ , 13) నందిగామ ఎస్ .ఓ , 14) మైలవరం ఎస్ .ఓ , 15)పోరంకి ఎస్ .ఓ , 16)కామకోటినగర్ ఎస్ .ఓ , 17)వి టి పి ఎస్ ఎస్ .ఓ మరియు 18)బీపీసీ , విజయవాడ; 19)ఎఫ్ పి ఓ (ఫారిన్ పోస్ట్ ఆఫీస్ ), గొల్లపూడి పోస్టాఫీసుల యందు గల పార్సిల్ ప్యాకింగ్ సౌకర్యమును సద్వినియోగం చేసుకోవాలని ఎం . నరసింహస్వామి , సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టాఫీసెస్, విజయవాడ డివిజన్, విజయవాడ సూచించారు.

# వంద పడకల ఆస్పత్రిలో నెలకొన్న పరిస్థితులు అస్తవ్యస్తం



భూపాలపల్లి ప్రతినిధి, ఏప్రిల్ 8 (భారత శక్తి): జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలో నెలకొన్న అస్తవ్యస్త పరిస్థితులపై భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు ఆసుపత్రి సూపరింటెం డెంట్ పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.బుధవారం ఆయన జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి ఆసుపత్రిని సందర్శించి, అన్ని విభాగాలను సమగ్రంగా పరిశీలించారు.ఆసుపత్రిలోని క్యాజువలిటీ, ల్యాబ్ , ఏం.ఆర్.ఐ, ఔట్ పేషెంట్ గదులు పరిశీలించి వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు.క్యాజువాల్టీ లో 6 మంచాలు మాత్రమే ఉన్నాయని అత్యవసరంగా ఒకే సమయంలో ఎక్కువ మంది రోగులు వచ్చినప్పుడు ఇబ్బందులు ఎదురవుతున్నాయని వైద్యులు తెలుపగా నూతనంగా 15 మంచలతో ఒక క్యాజువాల్టీ నిర్మాణం చేపడతామని ప్లానింగ్,అంచనాలు తయారు చేసి ఇవ్వాలని టి.జి.ఎం.ఐ.డి.సి అధికారులను ఆదేశించారు.అనంతరం ఆసుపత్రి ల్యాబ్ ను పరిశీలించి అన్ని రకాలైన పరికరాలు అందుబాటులో ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో పారిశుద్యం సరిగా లేకపోవడం, వార్డులు మరియు పరిసరాలు పరిశుభ్రంగా ఉండటం గమనించిన ఎమ్మెల్యే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. రోగులకు అందాల్సిన ప్రాథమిక సౌకర్యాలు సరిగా లేకపోవడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు.అలాగే సిబ్బంది సమయపాలన పాటించకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించడం వంటి అంశాలపై కూడా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి నిర్వహణపై బాధ్యత వహిస్తున్న పర్యవేక్షకుడిని హెచ్చరించారు. ఆసుపత్రిలో పారిశుధ్యం, నిర్వహణ, సిబ్బంది సమయ పాలన మెరుగుపరచాలని ఆదేశించారు.రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అందుకు అవసరమైన అన్ని చర్యలు తక్షణమే తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఆసుపత్రిలో పారిశుద్యాన్ని కట్టుదిట్టంగా అమలు చేయాలని, సిబ్బంది హాజరు, పనితీరుపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఇకపై ఇలాంటి నిర్లక్ష్యం కొనసాగితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.అనంతరం ఆసుపత్రి ఆవరణలోని మహిళా క్యాంటీన్ ను పరిశీలించి రోగి బంధువులతో మాటాడారు. క్యాంటీన్ లో పరిశుభ్రత తో కూడిన నాణ్యమైన వంటకాలను అందించాలని తెలిపారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే క్యాంటీన్ లో టిఫిన్స్ రుచిచూశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమరయ్య, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్,అదనపు కలెక్టర్ విజయలక్ష్మి , జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మధుసూదన్,ఆసుపత్రి పర్యవేక్షకులు డా రాజేంద్రప్రసాద్, వైద్య సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## “చిన్నచూపు.. పెద్ద పాఠం!”

టాలీవుడ్ చార్మింగ్ స్టార్ శర్వానంద్ తన కెరీర్‌లో ఎదురైన అత్యంత కష్టమైన దశ గురించి ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. షూటింగ్ సమయంలో జరిగిన ప్రమాదం, ఆ తర్వాత ఎదుర్కొన్న ఒంటరితనం తనను ఎంతగానో కలిచివేసిందని ఆయన వెల్లడించారు. ‘జాను’ సినిమా షూటింగ్ సమయంలో థాయ్‌లాండ్‌లో స్కైడైవింగ్ శిక్షణ తీసుకుంటుండగా శర్వానంద్‌కు ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఆయన భుజం ఎముక విరిగిపోయింది. దీని కోసం అత్యంత క్లిష్టమైన సర్జరీ చేయించుకోవాల్సి వచ్చింది. దీని గురించి శర్వానంద్ మాట్లాడుతూ... సినిమా కోసం ప్రాణాలకు తెగించి సాహసం చేసినా, పరిశ్రమలో గానీ, బయట గానీ ఎవరూ పెద్దగా పట్టించుకోకపోవడం తనను బాధించిందని శర్వానంద్ అన్నారు. “పెద్ద హీరోలకు చిన్న దెబ్బ తగిలినా సోషల్ మీడియాలో రచ్చ జరుగుతుంది. కానీ నేను అంత పెద్ద సర్జరీ చేయించుకున్నా ఎవరూ స్పందించలేదు. నేను ఇండస్ట్రీలో అంత తక్కువ వాడినా అనిపించింది” అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సమయంలో ఎదురైన పరిస్థితి తనను మానసికంగా కుంగదీసిందని, తన కష్టానికి తగిన గుర్తింపు లభించలేదనే బాధ ఇప్పటికీ ఉండిపోయిందని పేర్కొన్నారు. శర్వానంద్ చేసిన ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆయన పడిన కష్టాన్ని గుర్తించిన నెటిజన్లు, అభిమానులు శర్వానంద్‌కు మద్దతుగా నిలుస్తున్నారు. “మీరు నిజమైన కష్టజీవి, ‘బైకర్’ విజయం మీ కష్టానికి దక్కిన ప్రతిఫలం” అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు.

# ట్రోలర్లకు దీపిక స్ట్రాంగ్ కౌంటర్




బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద ‘ధురంధర్ 2’ సినిమా సృష్టిస్తున్న ప్రభంజనం అంతా ఇంతా కాదు. ఈ చిత్రం ఏకంగా రూ. 1000 కోట్ల మార్క్‌ను దాటిన తొలి బాలీవుడ్ చిత్రంగా సరికొత్త చరిత్ర సృష్టించింది. అయితే, భర్త రణ్‌వీర్ సింగ్ సాధించిన ఈ భారీ విజయంపై దీపికా పదుకొణె ఎందుకు స్పందించడం లేదని గత కొన్ని రోజులుగా ట్రోల్స్ వస్తున్నాయి. తాజాగా ఈ విమర్శలపై దీపిక తనదైన శైలిలో కౌంటర్ ఇచ్చారు. దీపిక తన భర్త సినిమా ఎందుకు చూడటం లేదు? ఆ సినిమా గురించి ఎందుకు మాట్లాడటం లేదు? అనే పోస్ట్‌పై ఆమె స్పందించారు. "మీ అందరికంటే ముందే నేను ఆ సినిమాను చూశాను. ఈ విషయం మీకు తెలియదు. ఇప్పుడు చెప్పండి.. ఎవరు ఎవరిని విమర్శించాలి?" అంటూ వ్యంగ్యంగా రిప్లై ఇచ్చారు. సోషల్ మీడియాలో పోస్ట్‌ల ఆధారంగా ప్రేమనో, మద్దతునో కొలవలేమని ఆమె ఈ రిప్లై ద్వారా స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టనంత మాత్రాన తన భర్తకు మద్దతు ఇవ్వడంలేదు అనుకోవడం సరికాదని అన్నారు. మరోవైపు, ఆదిత్య ధర్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో రణ్‌వీర్ సింగ్‌తో పాటు ఆర్. మాధవన్, అక్షయ్ ఖన్నా వంటి స్టార్స్ కీలక పాత్రలు పోషించారు. విడుదలైన రోజు నుండి ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తూనే ఉంది.

## బర్త్‌డే స్పెషల్:
# ‘రాకా’గా అల్లు అర్జున్



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అదిరిపోయే కానుక లభించింది. ఆయన, ప్రముఖ దర్శకుడు అట్లీ కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రానికి ‘రాకా’ అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను ఖరారు చేశారు. ఈ మేరకు విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. ఇప్పటివరకు ఉన్న ఊహాగానాలకు తెరదించుతూ, చిత్ర యూనిట్ అధికారికంగా ఈ ప్రకటన చేసింది. ఈ పోస్టర్‌లో అల్లు అర్జున్ గతంలో ఎన్నడూ కనపడని అనూహ్యమైన రూపంలో దర్శనమిచ్చారు. గుండుతో, ఒంటిపై ప్రత్యేకమైన గుర్తులు, చెవిపోగులతో భిన్నంగా కనిపిస్తున్నారు. ఓ క్రూర మృగం లాంటి చేయి ఆయన ముఖాన్ని కప్పి ఉంచడం సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. ఇది ఒక వింత జంతువు లేదా హైబ్రిడ్ జీవిని పోలి ఉండటంతో కథపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ బ్యానర్‌పై కళానిధి మారన్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. దాదాపు రూ.800 కోట్ల భారీ బడ్జెట్‌తో పాన్ వరల్డ్ చిత్రంగా దీన్ని తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. హాలీవుడ్ స్థాయి సాంకేతిక నిపుణులు విజువల్ ఎఫెక్ట్స్ కోసం పనిచేయనున్నారని సమాచారం. ఈ సినిమాలో అల్లు అర్జున్ సరసన దీపికా పదుకొణె కథానాయికగా నటించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. వీరితో పాటు రష్మిక మందన్న, మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్, రమ్యకృష్ణ వంటి భారీ తారాగణం కూడా భాగం కానున్నారని వార్తలు వస్తున్నాయి.





# బన్నీకి తారక్ బర్త్‌డే విషెస్!

టాలీవుడ్ అగ్ర హీరోల మధ్య ఉండే అనుబంధం మరోసారి సోషల్ మీడియా వేదికగా వెల్లడయింది. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ పుట్టినరోజు సందర్భంగా యంగ్ టైగర్ ఎన్టీఆర్ చేసిన ట్వీట్ ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. ఎన్టీఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో అల్లు అర్జున్‌ను ‘బావా’ అని సంబోధిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. "బావ అల్లు అర్జున్‌కు హ్యాపీ బర్త్‌డే. ఈ రోజు అద్భుతమైన రోజుగా గడపాలని, ఈ ఏడాది నీకు గొప్ప విజయాలను అందించాలని కోరుకుంటున్నాను" అంటూ ఎన్టీఆర్ రాసుకొచ్చాడు. వెండితెరపై బాక్సాఫీస్ పోరు ఎలా ఉన్నా, వ్యక్తిగతంగా వీరిద్దరి మధ్య ఉన్న సాన్నిహిత్యం చూసి నందమూరి, అల్లు అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. తారక్ విషెస్ చెప్పిన కొన్ని నిమిషాల్లోనే ఈ పోస్ట్ వేల సంఖ్యలో లైక్స్, రీట్వీట్లతో ట్రెండింగ్‌లోకి వెళ్ళింది. అగ్ర హీరోలు ఇలా ఒకరినొకరు గౌరవించుకోవడం చిత్ర పరిశ్రమలోని ఐక్యతకు నిదర్శనమని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



సినిమా

## నా జీవితంలో
# ఒక బ్రేకప్ ఉంది



‘ఉప్పెన’ బ్యూటీ కృతి శెట్టి, ‘లవ్ టుడే’ ఫేమ్ ప్రదీప్ రంగనాథన్ జంటగా నటించిన ‘లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ’ (L.I.K) సినిమా విడుదలకు సిద్ధమైంది. విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో వస్తున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా జరిగిన ప్రమోషన్లలో ఈ ఇద్దరు సెలబ్రిటీలు తమ బ్రేకప్స్ గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారాయి. కృతి శెట్టి మాట్లాడుతూ... తనకు గతంలో ఒకసారి బ్రేకప్ జరిగిందని వెల్లడించింది. ఈ విషయం తన తల్లికి కూడా తెలుసని, ప్రస్తుతం మాత్రం తాను సింగిల్‌గా ఉన్నానని స్పష్టం చేసింది. అలాగే సోషల్ మీడియాలో తనపై నెగిటివిటీ ప్రచారం చేసే వారిని ఏమాత్రం ఆలోచించకుండా వెంటనే బ్లాక్ చేస్తానని ఆమె క్లారిటీ ఇచ్చింది.

# క్షేత్రస్థాయి మున్సిపల్ సిబ్బందికి 'ట్రాఫిక్' సెగ

* **చలానాల నుంచి మినహాయింపు ఇవ్వాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌కు బి.ఎం.ఎస్ యూనియన్ విన్నపం**

హైదరాబాద్, ఏప్రిల్ 8 (భారత శక్తి) : గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)లో విధులు నిర్వహిస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందికి ట్రాఫిక్ చలానాలు పెను భారంగా మారుతున్నాయి. ప్రజలకు సేవలు అందించే క్రమంలో అత్యవసర పరిస్థితుల్లో వెళ్తున్న తమకు ఈ జరిమానాల నుంచి మినహాయింపు కల్పించాలని భాగ్యనగర్ మున్సిపల్ జీహెచ్ఎంసీ ఎంప్లాయిస్ యూనియన్ (బీఎంఎస్) బుధవారం కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించింది.

**గుర్తింపు కార్డులు ఇవ్వాలి**

పారిశుధ్య కార్మికులు, ఎస్ఎఫ్ఏలు, ఈఎఫ్ఏఎస్‌లు, శానిటరీ జవాన్లు, పర్యవేక్షకులు, బిల్ కలెక్టర్లు నిరంతరం రోడ్లపైనే ఉంటూ విధులను నిర్వర్తిస్తుంటారు. విధి నిర్వహణలో భాగంగా కొన్నిసార్లు తక్కువ దూరంలో వెళ్లాల్సిన చోట పొరపాటున రాంగ్ రూట్‌లో వెళ్లాల్సి వస్తోందని, ఆ సమయంలో పోలీసులు లేదా




సీసీ కెమెరాల ద్వారా ఫొటోలు తీసి చలానాలు విధిస్తున్నారని యూనియన్ పేర్కొంది. ఈ సమస్యను పరిష్కరించడానికి క్షేత్రస్థాయి సిబ్బంది వాహనాలకు ప్రత్యేక ట్యాగ్‌లు ఏర్పాటు చేయాలని లేదా వారిని గుర్తించేలా ప్రత్యేక జాకెట్లు అందజేయాలని కోరింది. ఈ మేరకు ట్రాఫిక్ విభాగంతో మాట్లాడి సిబ్బందికి మినహాయింపునిచ్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించింది.

* **ఎంటమాలజీ సిబ్బందికి వేసవి పనివేళల మార్పు**
* **బయోమెట్రిక్ హాజరులో రాయితీ కోరుతూ వినతి**

*మధ్యాహ్నం 1:30కే విముక్తి కల్పించాలి*

పెరుగుతున్న ఎండల దృష్ట్యా ఎంటమాలజీ విభాగంలో పనిచేసే ఫీల్డ్ అసిస్టెంట్లకు బయోమెట్రిక్ పనివేళల్లో మార్పులు చేయాలని యూనియన్ మరో అభ్యర్థనను కమిషనర్ మరియు ప్రత్యేక అధికారికి అందజేసింది. వేసవి తీవ్రత ఎక్కువగా ఉండటంతో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని హాజరు సమయాలను మార్చాలని కోరింది.

* **కోరిన నూతన సమయాలు:**

లాగిన్ (ప్రవేశం): ఉదయం 7.00 గంటల నుండి 8.00 గంటల వరకు.

లాగౌట్ (నిష్క్రమణ):* మధ్యాహ్నం 1.30 గంటల నుండి 3.00 గంటల వరకు.

* **సాంకేతిక సమస్యలతో ఆలస్యం**

ముఖ గుర్తింపు (ఫేస్ రికగ్నిషన్) ద్వారా హాజరు వేసే సమయంలో సాంకేతిక కారణాల వల్ల జాప్యం జరుగుతోందని, అందుకే పారిశుధ్య మరియు ఎంటమాలజీ సిబ్బందికి కనీసం 10 నుంచి 15 నిమిషాల వరకు ఆలస్యంగా వచ్చినా హాజరు పరిగణనలోకి తీసుకునేలా అవకాశం కల్పించాలని కోరింది. గతేడాది ఇచ్చిన ఉత్తర్వులను (సర్క్యులర్ నెం. 371835/Health/UMS/GHMC/2025) ఈ సంవత్సరం కూడా వర్తింపజేయాలని విజ్ఞప్తి చేసింది.

# కనికరమే లేని కఠినమైన ప్రైవేట్ హై స్కూల్

* **రికవరీ గ్యాంగ్ వలే తయారైన ప్రైవేట్ పాఠశాల**
* **ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలకు భయమనదే లేదా...?**
* **ఫీజు వసూళ్ల పేరిట తల్లిదండ్రులను బెదిరిస్తున్న టీచర్లు**
* **తోటి పిల్లల ముందు ఫీజు కట్టని వారిని నిలబెట్టి వేధింపులు**
* **ఎంఈఓ, డిఈఓలకు చెప్తారా ఎవరికైనా చెప్పకోండి...**
* **మమ్ములను ఎవరూ ఏమి చేయలేరు... యాజమాన్యం ధీమా**
* **తల్లిదండ్రులు ఎంత బతిమిలాడినా వినిపించుకోని అడ్మిన్**
* **ఏదైనా ప్రమాదం జరిగితే బయటకు వెళ్లే దారి లేని పరిసరాలు**




ఎల్బీనగర్, ఏప్రిల్ 08 (భారత శక్తి): పాఠశాల నడిచేది స్లమ్, మిడిల్ స్లమ్ ఏరియాలో, పిల్లలు కూడా మధ్య, పేద తరగతి కుటుంబం నుండి చదువుకోవడానికి వచ్చేవారే ఎక్కువ. పాఠశాల ఉండేది అగ్గిపెట్టే లాంటి బిల్డింగ్ లో.. అందులోనే ఒకటవ తరగతి నుండి 10 వ తరగతి వరకు చదువులు, ఆట స్థలం ఉండదు, ఏదైనా ప్రమాదం జరిగితే బయటకు వెళ్లలేని పరిసరాలు. కానీ ఫీజులు మాత్రం సరైన సమయానికి కట్టాలని తల్లిదండ్రులకు బెదిరింపులు, క్లాస్ రూములో తోటి పిల్లల ముందు నిలబెట్టి వేధింపులు, ఎంఈఓ, డిఈఓలకు ఫిర్యాదు చేసినా మేము డోంట్ కేర్ అంటున్న పాఠశాల యాజమాన్యం. ఎవరికీ చెప్పుకోవాలో తెలియక తల్లిదండ్రులు పడే ఆవేదన అంతా ఇంత కాదు. ఎంత బతిమిలాడినా వినిపించుకోని అడ్మిన్ కవిత. డబ్బుల మీద యావ తప్ప, ఏదీ పట్టించుకోని పాఠశాల యజమాని జనార్దన్. సరూర్ నగర్ డివిజన్ వెంకటేశ్వర కాలనీ రోడ్ నెంబర్ 5 లోని శ్రీ నియో టెక్ హైస్కూల్ (ఎస్ఎన్టీ) యాజమాన్యం పిల్లలను వారి తల్లిదండ్రులను ఫీజుల కోసం రాచి రంపాన పెడుతున్నారు. బంగారం లాంటి వస్తువులు కుదువ బెట్టి కట్టినా, మిగిలి ఉన్న కట్టాల్సిన ఫీజు 2 వేలు 3 వేలు పెండింగ్ ఉన్నా, హల్ టికెట్ ఇవ్వకుండా, పరీక్షలు రాయనీయకుండా నానా రకాలుగా ఇబ్బంది పెడుతున్నారు. ఎలాగో పిల్లలు వచ్చే ఏడాది కూడా ఇక్కడే చదువుతారు కదా, కొద్దిగ టైం ఇస్తే కడతామని చెప్పినా కనికరం లేకుండా, ఖరాకండిగా బకాయి ఫీజు కట్టాల్సిందేనని బెదిరింపులకు దిగుతున్న పాఠశాల అడ్మిన్. ఎంఈఓకు ఫిర్యాదు చేస్తే, సర్ మేము పిల్లలను అలా ఎప్పుడు ఇబ్బంది పెట్టమని సమాధానం చెప్తున్న అడ్మిన్ కవిత. పరీక్షల సమయంలో పాఠశాల యాజమాన్యం అధికారులు అంటే భయం లేకుండా, లెక్క చేయకుండా ప్రవర్తిస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకొని పిల్లల భవిష్యత్ నిలబెట్టాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

# న్యూ బోయిగూడలో బుల్డోజర్ల గర్జన!

* **సామాన్యుల దారిని మూసేసి మేడ కడితే ఊరుకుంటామా?**

సికింద్రాబాద్, ఏప్రిల్ 8 (భారత శక్తి) : అధికారం అండ ఉందనో, అధికారుల అలుసు ఉందనో సామాన్యుల దారిని మూసేసి అక్రమంగా మేడలు కడతామంటే కుదరదని హైడ్రా నిరూపించింది. బన్సీలాల్‌పేట పరిధిలోని న్యూ బోయిగూడలో బుధవారం హైడ్రా బుల్డోజర్లు గర్జించాయి.

**అసలేం జరిగిందంటే:**

న్యూ బోయిగూడలో సుమారు 20 అడుగుల సిమెంట్ రోడ్డు ఉంది. అయితే, స్థానికంగా ఉండే ఓ వ్యక్తి కక్కుర్తితో ఆ రోడ్డులో సుమారు 50 గజాల మేర దారిని అడ్డుకుని పక్కా ప్లాన్‌తో షాపు, పైన ఇల్లు నిర్మించడం మొదలుపెట్టాడు. కాలనీవాసులు జీహెచ్ఎంసీకి ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా అధికారులు పట్టించుకోలేదు. విసిగిపోయిన బాధితులు 'హైడ్రా'ను ఆశ్రయించారు.

**గంటల్లోనే నేలమట్టం:**

రంగంలోకి దిగిన హైడ్రా టీమ్.. ఆ నిర్మాణానికి ఎలాంటి అనుమతులు లేవని, పైగా అది పక్కాగా ప్రజా రహదారిని ఆక్రమించిందని తేల్చింది. ఇంకేముంది.. బుధవారం ఉదయాన్నే బుల్డోజర్లతో వెళ్లిన సిబ్బంది, ఆ అక్రమ కట్టడాన్ని క్షణాల్లో నేలమట్టం చేశారు. తమ దారి తమకు దక్కడంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ హైడ్రాకు కృతజ్ఞతలు తెలిపారు.




# కబ్జాకోరుల గుండెల్లో 'హైడ్రా' వణుకు!

* **ఒకవైపు బుల్డోజర్ల గర్జన.. మరోవైపు క్షేత్రస్థాయిలో కమిషనర్ వార్నింగ్**
* **బంజారా లేక్ కాలుష్యంపై సీరియస్.. మామిడిపల్లి కుంటల ఆక్రమణపై ఆరా**
* **న్యూ బోయిగూడలో దారిని మూసేసిన అక్రమ కట్టడం నేలమట్టం.**

హైదరాబాద్, ఏప్రిల్ 8 (భారత శక్తి) : చెరువులను మింగేస్తున్న భూబకాసురులు, సామాన్యుల దారిని అడ్డం పెట్టుకుని ఇళ్లు కడుతున్న అక్రమార్కులపై 'హైడ్రా' పంజా విసిరింది. "ప్రభుత్వ భూమి అన్నా, చెరువు శిఖం అన్నా మీ అబ్బ సొత్తు అనుకుంటున్నారా?" అన్న రేంజ్‌లో హైడ్రా తన యాక్షన్‌ను ముమ్మరం చేసింది. బుధవారం అటు కూల్చివేతలతో, ఇటు క్షేత్రస్థాయి తనిఖీలతో కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆక్రమణదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించారు.

* **'బంజారా లేక్' మురుగు కూపం కావాల్సిందేనా?**

ఒకప్పుడు విదేశీ పక్షులకు నిలయంగా, స్వచ్ఛమైన నీటితో కళకళలాడిన బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని 'బంజారా లేక్' (బంజారా చెరువు) పరిస్థితి ఇప్పుడు ఘోరంగా తయారైంది. ఎమ్మెల్యే దానం నాగేందర్, స్థానికులతో కలిసి కమిషనర్ రంగనాథ్ చెరువును పరిశీలించారు. హోటల్ వ్యర్థాల అడ్డా: చెరువు ఎఫ్‌టీఎల్ (FTL) పరిధిలో అడ్డగోలుగా రోడ్డు వేయడం, హోటల్ వ్యర్థాలను ఇష్టారాజ్యంగా



పారబోయడంపై కమిషనర్ నిప్పులు చెరిగారు. గుడి దారిపై 'తాజ్' పెత్తనం?: ప్రసిద్ధ కట్టమైసమ్మ గుడికి వెళ్లే దారిని తాజ్ బంజారా యాజమాన్యం తమ ఆధీనంలోకి తీసుకుని భక్తులను ఇబ్బంది పెడుతోందని స్థానికులు మొరపెట్టుకున్నారు. దీనిపై తక్షణమే విచారణ జరపాలని అధికారులను ఆదేశించారు. పార్కుగా మారుస్తాం: చెరువు పైభాగంలో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడి, ప్రజలకు ఉపయోగపడేలా పార్కుగా మార్చేందుకు సమగ్ర నివేదిక ఇవ్వాలని హైడ్రా బాస్ స్పష్టం చేశారు.

* **మామిడిపల్లిలో నాలుగు కుంటలు మాయం!**

శంషాబాద్ మండలం మామిడిపల్లిలో భూబకాసురుల ఆగడాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. 'ప్రజావాణి'లో వచ్చిన ఫిర్యాదులపై స్పందించిన కమిషనర్ స్వయంగా రంగంలోకి దిగారు. ఒంగోని కుంట, కనకయ్యకుంట, మర్రివాణికుంట, ఎర్రకుంట వంటి జలవనరులు ఆక్రమణకు గురై ఉనికి కోల్పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

* **"వరద కాలువలను మూసేసి వెంచర్లు వేయడం వల్లే కాలనీలు మునుగుతున్నాయి.**

ఆక్రమణదారులు మర్యాదగా తప్పుకోకపోతే.. హైడ్రా డైరెక్ట్ యాక్షన్ (కూల్చివేతలు) మొదలు పెడుతుంది" అని రంగనాథ్ హెచ్చరించారు.




# చలివేంద్రాన్ని ప్రారంభించిన పృథ్వీరాజ్

పటాన్‌చెరు, ఏప్రిల్ 8 (భారత శక్తి) : గత ఎనిమిది సంవత్సరాలుగా వేసవిలో ఏర్పాటు చేస్తూ బాటసారులకు బాసటగా నిలుస్తున్న చలివేంద్రాన్ని ప్రారంభించిన మాద్రి పృథ్వీరాజ్ పటాన్‌చెరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఆవరణలో ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా MDR ఫౌండేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేయబడింది. ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులు మరియు ప్రజలు ఎండ తీవ్రతలో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ సేవా కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఓ హైమావతి ఆసుపత్రి సిబ్బంది, MDR ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# గర్భిణీలు జాగ్రత్తలు పాటించాలి: కలెక్టర్ నారాయణ రెడ్డి

* **ప్రభుత్వ ఆసుపత్రుల్లో 57 శాతం ప్రసవాలు**
* **ఎలిమినేడులో 'సురక్షిత మాతృత్వ దినోత్సవం' ప్రారంభం**
* **క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ కీలకం**

ఇబ్రహీంపట్నం (రంగారెడ్డి జిల్లా), ఏప్రిల్ 8: (భారత శక్తి) : గర్భిణీ స్త్రీలు తగిన జాగ్రత్తలు తీసుకుంటూ సరైన వైద్య సేవలు పొందాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సూచించారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా.. బుధవారం ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య, మహిళా శిశు సంక్షేమ శాఖల ఆధ్వర్యంలో 'సురక్షిత మాతృత్వ దినోత్సవం' నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన కలెక్టర్, ఈ సందర్భంగా పలు కీలక అంశాలను ప్రస్తావించారు.

**ఆరోగ్యమే మహాభాగ్యం**

మారుతున్న జీవనశైలి కారణంగా శారీరక వ్యాయామం తగ్గి, మానసిక ఒత్తిడి పెరుగుతోందని కలెక్టర్ ఆవేదన వ్యక్తం చేశారు. దీనివల్ల చిన్న



వయసులోనే రోగాల బారిన పడుతున్నారని, సంపద కన్నా ఆరోగ్యమే ముఖ్యమని పేర్కొన్నారు. గర్భిణీలు పోషకాహారం తీసుకుంటూ ఆశా కార్యకర్తల సహకారంతో నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉండాలన్నారు. రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల శాతం 57గా ఉందని, దీనిని మరింత పెంచాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా సాధారణ ప్రసవాలను ప్రోత్సహిస్తూ, శిశు మరణాల రేటును పూర్తిగా తగ్గించాలని స్పష్టం చేశారు.

**డ్రగ్స్ సంస్కృతిపై అవగాహన**

గ్రామీణ ప్రాంతాల్లో సైతం డ్రగ్స్ సంస్కృతి ప్రబలుతుండటంపై కలెక్టర్ ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలపై ఉందన్నారు. గర్భం దాల్చిన నాటి నుండి ప్రసవం అయ్యే వరకు ప్రభుత్వం అన్ని రకాల ఉచిత వైద్య పరీక్షలు, మెరుగైన వైద్యం అందిస్తోందని వెల్లడించారు.

**హెచ్‌పీవీ వ్యాక్సిన్‌తో క్యాన్సర్ కట్టడి**

అనంతరం ఎలిమినేడు ఆరోగ్య కేంద్రంలోని హెచ్‌పీవీ (HPV) వ్యాక్సిన్ కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, టీకా పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖ క్యాన్సర్‌ను నివారించడంలో ఈ వ్యాక్సిన్ కీలకమని ఆయన తెలిపారు.

* **అర్హులు: 9 నుండి 14 ఏళ్ల లోపు బాలికలు.**

లక్ష్యం: హ్యూమన్ పాపిలోమా వైరస్ వల్ల వచ్చే ఇతర క్యాన్సర్లను నివారించడం.

లభ్యత:* జిల్లాలోని 22 కేంద్రాల్లో ఈ వ్యాక్సిన్ ఉచితంగా అందుబాటులో ఉంది.

**జిల్లాలో తగ్గిన మాతృ మరణాలు**

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (DM&HO) డాక్టర్ లలితా దేవి మాట్లాడుతూ.. జిల్లాలో మాతృ మరణాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, ప్రసూతి సేవలు సమర్థవంతంగా అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ యాదమ్, డీఆర్డీఓ పీడీ శ్రీలత, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాధిక, డాక్టర్ పూనం, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ లక్ష్మీప్రసన్న, వైద్యులు మోహన్, రాజలక్ష్మి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ నిర్మాణంపై 'సీజింగ్' వేటు...అధికారుల అవినీతిపై ఏది 'పోటు'?

- సీజింగ్లు : ఓపెనింగ్లు,చీకటి భాగోతాలు: ఇదే అదునుగా గల్లీకో అక్రమ నిర్మాణం
- అక్రమ నిర్మాణాలు సీజింగ్లు కాదు కూల్చివేత లే కరెక్ట్..!
- అక్రమ పద్ధతిలో పర్మిషన్లు ఇచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారిపై చర్యలు ఎక్కడ..?
- బిల్డ్ నౌ వెబ్సైట్లో పారదర్శకత లోపం , అవినీతికి ఆజ్యం పోసినట్లే: మున్సిపల్ ఉన్నతాధికారులు, మున్సిపల్ శాఖ మంత్రి సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి..!







భారత శక్తి ఎఫెక్ట్

సరూర్ నగర్ (హైదరాబాద్), ఏప్రిల్ 8: (భారత శక్తి): చట్టాన్ని చుట్టేసి.. నిబంధనలను బూడిదలో పోసిన పన్నీరుగా మార్చి.. సామాన్యుల భద్రతను పణంగా పెట్టిన 'అక్రమ' సామ్రాజ్యంపై ఎట్టకేలకు మున్సిపల్ శాఖ కొరడా ఝుళిపించింది. కొత్తపేట హుడా కాలనీలో 'బిల్ నౌ' వ్యవస్థలోని లొసుగులను, పారదర్శకత లోపాన్ని ఆసరాగా చేసుకుని వెలసిన భారీ అక్రమ కట్టడాన్ని బుధవారం ఎల్బీనగర్ జోనల్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు సీజ్ చేశారు. 'భారత శక్తి' పత్రిక ప్రచురించిన కథనంతో యంత్రాంగం కదిలినప్పటికీ, కేవలం భవనాన్ని సీజ్ చేయడంతోనే సరిపెట్టడంపై స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తప్పుడు అనుమతులకు సహకరించి, ఖజానాకు గండికొట్టిన అధికారుల సంగతేంటన్న ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

*** ఒకే స్థలం.. రెండు పర్మిషన్లు: 'బిల్ నౌ'కు పట్టిన గ్రహణం!**

హుడా కాలనీ ప్లాట్ నం. 39లో ఫైల్ నంబర్లు: 1):010392/GHMC/03322/IABP/C5/2025 2): 010390/GHMC/03321/IABP/C5/2025) రెండు వేర్వేరు అనుమతులు పొంది, వాటిని అక్రమంగా విలీనం (Clubbing) చేసి భారీ వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నారు. సామాన్యులు నిర్మాణం నిర్మించాలంటే ప్రాథమికంగా అనుమతులు తీసుకోవాలంటే "బిల్డ్ నౌ "వెబ్సైట్ ద్వారా ఆన్లైన్లో అర్జీ పెట్టుకుంటే సంబంధిత టౌన్ ప్లానింగ్ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఉన్నత అధికారుల కు అప్లికేషన్ ను ఫార్వర్డ్ చేస్తారు. ఆన్లైన్ ద్వారా, తదుపరి ఉన్నత స్థాయి డిప్యూటీ కమిషనర్, ఏసిపి, సిపి, జోనల్ కమిషనర్ స్థాయి అధికారులు సైట్ విజిట్ చేసి అనుమతులు ఇవ్వాలి.. ఈ అనుమతులు ఇవ్వడం అక్రమమని తెలుసు, క్రింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి అధికారుల వరకు ఎన్ని ముడుపులు చేతులు మారాయి అనే విషయాన్ని ఎవరు బయట పెట్టాలి..? దీనికి సమాధానం చెప్పాలి.. సామాన్యులకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'సెల్ఫ్ సర్టిఫికేషన్' (బిల్ నౌ) విధానాన్ని అధికారులు కాసుల వర్షం కురిపించే కల్పవృక్షంగా మార్చుకున్నారు. ప్లాట్ నంబర్ 39లో నివాస గృహాల పేరుతో రెండు వేర్వేరు అనుమతులు పొంది, వాటిని అక్రమంగా కలిపేసి భారీ వాణిజ్య సముదాయాన్ని నిర్మిస్తున్నా కూడా అధికారులు కన్నెత్తి చూడకపోవడం వెనుక 'అదృశ్య హస్తం' ఉందనే విమర్శలు బలంగా వినిపిస్తున్నాయి. క్షేత్ర స్థాయిలో అడుగు పెట్టకుండానే ఏసీ గదుల్లో కూర్చుని అనుమతులు మంజూరు చేయడంపై జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు లోతైన విచారణ జరపాల్సిన అవసరం ఉంది.

*** ఖజానాకు గండి.. భద్రతకు తిలోదకాలు**

వాణిజ్య సముదాయం నిర్మిస్తే మున్సిపల్ ఖజానాకు లక్షల్లో పన్ను ఆదాయం వస్తుంది. కానీ, నివాస గృహాల పేరుతో అనుమతులు పొందడం వల్ల ప్రభుత్వానికి భారీగా గండి పడింది. దీనికి తోడు:

**ఫైర్ సేఫ్టీ మృగ్యం:**

కనీస సెట్ బ్యాక్ లు వదలకుండా, అగ్నిమాపక యంత్రం కూడా వెళ్ళలేని రీతిలో నిర్మాణం సాగించడం అత్యంత ప్రమాదకరం.

*** సెల్లార్ల దందా:**

నివాస అనుమతితో రహస్యంగా సెల్లార్ తవ్వేసి వాణిజ్య అవసరాలకు మళ్లించడం బిల్డర్ల తెగింపునకు పరాకాష్ట.

*** అవినీతి 'బైపాస్':**

టీపీఎస్ నుంచి జోనల్ కమిషనర్ వరకు రాతపూర్వక ఫిర్యాదులు చేసినా నెలల తరబడి మౌనం వహించడం వెనుక 'నోట్ల కట్టల' మత్తు ఉందనే ఆరోపణలు వస్తున్నాయి.

*** సీజింగ్‌లతో సరిపెడితే సరిపోదు!**

కేవలం వార్తా కథనాలు వచ్చినప్పుడు సీజ్ చేయడం, ఆ తర్వాత మళ్ళీ యధావిధిగా పనులు సాగనివ్వడం మున్సిపల్ శాఖలో 'మామూలే' అనే విమర్శ ఉంది. ఈ 'తూతూ మంత్రపు' చర్యల వల్ల ఉపయోగం లేదని బాధితులు పేర్కొంటున్నారు.

**1. క్రిమినల్ కేసులు:**

తప్పుడు పత్రాలు సమర్పించిన బిల్డర్‌పై, సహకరించిన ఆర్కిటెక్ట్‌పై ఐపీసీ 420 కింద కేసులు నమోదు చేయాలి.

**2. లైసెన్సుల రద్దు:**

అక్రమ ప్లాన్లకు సహకరించిన టెక్నికల్ పర్సన్ల లైసెన్సులను బ్లాక్ లిస్టులో పెట్టాలి.

**3. ఏసీబీ విచారణ:**

అనుమతులు ఇచ్చిన టౌన్ ప్లానింగ్ అధికారులపై ఏసీబీ విచారణ జరిపి, వారి అక్రమ ఆస్తులను వెలికితీయాలి.

*** ప్రభుత్వంపై పెరిగిన బాధ్యత**

బిల్డ్ నౌ అధికారులు , దేవేందర్ రెడ్డి గారు, మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ జయేశ్ రంజన్ గారు, బిల్డ్ నౌ ట్రాన్స్పరెన్సీ లేకపోవడం.. టౌన్ ప్లానింగ్ అధికారులు విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతూ నిజాయితీగా ఉండే ప్రభుత్వ అధికారులకు మచ్చ తెస్తున్నారు.. అవినీతికి పాల్పడిన టౌన్ ప్లానింగ్ అధికారి అవినీతి రుజువైతే కఠినమైన చర్యలు ఎక్కడ అని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు...బిల్డ్ నౌ పబ్లిక్ పోర్టల్ని, వెబ్సైట్ ని, పారదర్శకతకు తాళం వేయడం ప్రజాస్వామ్య వ్యవస్థను ఖూనీ చేస్తున్నట్లే అవుతుందని గుర్తించాలి ..!

*** అక్రమ నిర్మాణాలు సీజింగ్లు కాదు కూల్చివేత లే కరెక్ట్..!**

నగరంలో వెలుస్తున్న అక్రమ నిర్మాణాల పట్ల అధికార యంత్రాంగం ఇకపై మరింత కఠినంగా వ్యవహరించాలి. కేవలం నోటీసులు ఇచ్చి, భవనాలను సీజ్ చేసి వదిలేయడం వల్ల ఆక్రమణదారులు కోర్టుల నుండి స్టే తెచ్చుకుని పనులు కొనసాగిస్తున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. ఈ నేపథ్యంలో, అక్రమ కట్టడాలను కేవలం సీజ్ చేయడమే కాకుండా, వాటిని తక్షణమే కూల్చివేయాలని (Demolition) ఉన్నతాధికారులు దిశానిర్దేశం చేశారు. కానీ ఎల్బీనగర్ మున్సిపాలిటీలో ఆచరణ కరువైంది.. భవిష్యత్తులో సీజింగ్ ఓపెన్ అయి ..ఇదే అక్రమ నిర్మాణం సక్రమ నిర్మాణంగా కొనసాగి హాస్పిటల్ ఇతరత్రా వాణిజ్య సముదాయం నిర్వహించి అగ్ని ప్రమాదాలు జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారు.. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ పాటిల్ దృష్టి సారించాలి..!

*** హైడ్రాదృష్టి సాధించాలి..!**

హైడ్రా చొరవతో నగరంలో చెరువుల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వం, ఇలాంటి నిబంధనల ఉల్లంఘనలపై కూడా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. కేవలం భవనం సీజింగ్‌తో చేతులు దులుపుకోకుండా, ఈ అవినీతి వ్యవస్థకు కారకులైన అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటేనే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కలుగుతుంది. మరి మున్సిపల్ కమిషనర్, సీసీపీలు ఈ అక్రమ 'బైపాస్' రోడ్డుకు శాశ్వత చెక్ పెడతారో లేదో వేచి చూడాలి.







# ఢిల్లీ సభలో 'పాలమూరు' గర్జన

- : జాతీయ యువ పార్లమెంటుకు శివంత్ రెడ్డి ఎంపిక!
- * సౌత్ ఇండియా నుంచి ఎంపికైన ఏకైక ప్రతినిధిగా గుర్తింపు
- * జాతీయ యువ పార్లిమెంట్ లో రాజ్యసభ వేదికగా 'వేమ్ నరేంద్ర రెడ్డి' పాత్రలో సమాఖ్య స్ఫూర్తిపై పోరు*
- * ఏప్రిల్ 9, 10 తేదీల్లో దేశ రాజధానిలో 'సంసద్ 2026' మేధోమథనం*

హైదరాబాద్/మహబూబ్‌నగర్, ఏప్రిల్ 7 (భారత శక్తి): తెలంగాణ యువ కిశోరం జాతీయ వేదికపై తన వాగ్ధాటిని ప్రదర్శించేందుకు సిద్ధమైంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రతిష్ఠాత్మక నిర్వహించనున్న 'సంసద్ 2026' జాతీయ యువ పార్లమెంటుకు పాలమూరు బిడ్డ, రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి *శివంత్ రెడ్డి* ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా కఠినమైన వడపోత అనంతరం, దక్షిణ భారతదేశం నుంచి ఎంపికైన ఏకైక యువ ప్రతినిధిగా శివంత్ రెడ్డి నిలవడం విశేషం. ఏప్రిల్ 9, 10 తేదీల్లో ఢిల్లీ కన్నాట్ ప్లేస్‌లోని ఎన్‌డీఎంసీ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే ఈ సదస్సులో ఆయన తన గళాన్ని వినిపించనున్నారు. రాజ్యసభలో 'నవ' దిశ: వేమ్ నరేంద్ర రెడ్డి పాత్రలో.. ఈ యువ పార్లమెంటులో శివంత్ రెడ్డి ఒక కీలక బాధ్యతను భుజాని కెత్తుకున్నారు. సీనియర్ నాయకులు వేమ్ నరేంద్ర రెడ్డి పాత్రను పోషిస్తూ, రాజ్యసభ వేదికగా కేంద్రరాష్ట్ర సంబంధాలపై విశ్లేషణాత్మక ప్రసంగం చేయనున్నారు. ముఖ్యంగా 'సమాఖ్య స్ఫూర్తి రాష్ట్రాల హక్కులు' అనే అజెండాతో కేంద్రం వైఖరిని ఎండగట్టడమే కాకుండా, భవిష్యత్తు తరాలకు అవసరమైన పరిష్కార మార్గాలను ఆయన ప్రతిపాదించనున్నారు.



**ఎంపిక వెనుక 'వాగ్ధాటి':**

కేవలం రాజకీయ నేపథ్యం మాత్రమే కాకుండా, సామాజిక అంశాలపై పట్టు, అద్భుతమైన ప్రసంగ కళ శివంత్ రెడ్డిని ఈ స్థానంలో నిలబెట్టాయి. తెలంగాణలోని నిరుద్యోగ సమస్యలు, రైతాంగ ఇబ్బందులపై ఆయన నిరంతరం సాగిస్తున్న పోరాటమే ఆయన్ను సౌత్ ఇండియా నుంచి ఏకైక ప్రతినిధిగా నిలిపింది. ఈ ఏప్రిల్ 9, 10 తేదీలో ఢిల్లీ వేదికగా శివంత్ రెడ్డి చేసే ప్రసంగం దేశ యువతకు, ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలకు దిశానిర్దేశం చేయనుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

# బడంగ్‌పేటలో 'జెస్ట్ సెలూన్' ప్రారంభం

బడంగ్‌పేట: ఏప్రిల్ 8 (భారత శక్తి) : మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని బడంగ్‌పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన 'జెస్ట్ సెలూన్'ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. స్థానికులకు మెరుగైన సేవలు అందుబాటులోకి రావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సోమ భూపాల్ రెడ్డి, నిరుడు శ్రీరాములు, బొక్క శ్రీనివాస్ రెడ్డి, గిరి ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



# జేఎన్‌టీయూహెచ్ తనిఖీల్లో పారదర్శకత ఏది?

- * అర్హత లేని ప్రిన్సిపాల్ ఉన్న కాలేజీల జాబితాను బహిర్గతం చేయాలి
- * ఫామ్-16, 26AS ఆధారంగానే వేతనాల చెల్లింపులను ధ్రువీకరించాలి
- * ఫ్యాకల్టీ క్యాడర్ రేషియో, గ్రాట్యుటీ అమలుపై నిలదీత

హైదరాబాద్ ఏప్రిల్ 08 (భారత శక్తి) : జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం (జేఎన్‌టీయూహెచ్) అనుబంధ కళాశాలల్లో నిర్వహించే వార్షిక తనిఖీలు పూర్తి పారదర్శకంగా జరగాలని, నిబంధనల ఉల్లంఘనపై కఠినంగా వ్యవహరించాలని అధ్యాపక సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. రాష్ట్రంలోని పలు ఇంజినీరింగ్ కళాశాలల్లో అర్హత లేని ప్రిన్సిపాల్‌లు ఉన్నారని విశ్వవిద్యాలయమే అంగీకరిస్తున్నప్పుడు, అటువంటి కళాశాలలకు గుర్తింపు ఎలా ఇస్తారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ మేరకు యూనివర్సిటీ రిజిస్ట్రార్‌కు పలు విజ్ఞప్తులు అందాయి.

*** వాస్తవాలు బయటపడాలంటే బ్యాంక్ స్టేట్‌మెంట్ చూడాల్సిందే***

పలు కళాశాలలు టీఏఎఫ్ఆర్‌సీ (TAFRC), జేఎన్‌టీయూహెచ్‌లకు సమర్పించే అఫిడవిట్లలో ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం 7వ వేతన సంఘం జీతాలు ఇస్తున్నట్లు తప్పుడు సమాచారం ఇస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.




- * పరిశీలన అవసరం:అధ్యాపకుల ఫామ్16, ఫామ్26AS తో పాటు ఏడాది కాలానికి సంబంధించిన బ్యాంక్ స్టేట్‌మెంట్లను తనిఖీ చేస్తేనే వాస్తవ వేతనాల విషయం బయటపడుతుంది.
- * పేస్లిప్పుల తనిఖీ:* కేవలం కాగితాల మీద కాకుండా, క్షేత్రస్థాయిలో అధ్యాపకులకు అందుతున్న వేతనాలపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి.

*** అమలు కాని గ్రాట్యుటీ, భీమా సౌకర్యం**

గ్రాట్యుటీ చట్టం1972 ప్రకారం అధ్యాపకులకు అందాల్సిన ప్రయోజనాలను ఏ ఒక్క కళాశాల అమలు చేయడం లేదని విమర్శలు ఉన్నాయి. ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం ఉండాల్సిన 'గ్రూప్ యాక్సిడెంట్ పాలసీ' 90 శాతం కళాశాలల్లో అమలు కావడం లేదు. దీనివల్ల అధ్యాపకులకు కనీస భద్రత కరువవుతోంది. అలాగే తెలంగాణ ఎడ్యుకేషన్ యాక్ట్ 1982, సెక్షన్79 ప్రకారం ఉద్యోగ భద్రత కల్పించడంలో ప్రభుత్వం, విశ్వవిద్యాలయాలు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు.

*** అదనపు భారంగా 'తంబు' ఫ్యాకల్టీ**

కళాశాలల్లో రికార్డుల కోసం మాత్రమే ఉండే 'తంబు' ఫ్యాకల్టీ (వచ్చి వేలిముద్ర వేసి వెళ్లేవారు) సంఖ్య పెరుగుతోందని, దీనివల్ల రెగ్యులర్ అధ్యాపకులపై పని భారం విపరీతంగా పెరుగుతోందని విన్నవించారు. ఏఐసీటీఈ నిబంధనల ప్రకారం ఉండాల్సిన 1:2:6 ఫ్యాకల్టీ క్యాడర్ రేషియోను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

*** బహిర్గతం చేయాలి**

అర్హత లేని ప్రిన్సిపాల్‌లు ఉన్న కళాశాలల జాబితాను తక్షణమే యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచి, విద్యార్థులను, తల్లిదండ్రులను అప్రమత్తం చేయాలని కోరారు. తనిఖీల ప్రక్రియలో పారదర్శకత పాటిస్తేనే విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయని, అధ్యాపకులకు న్యాయం జరుగుతుందని ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

JAWAHARLAL NEHRU TECHNOLOGICAL UNIVERSITY HYDERABAD



# ఇరాన్‌లో పాలన మారింది... ఇక కలిసి పనిచేస్తాం: ట్రంప్

- ట్రూత్ సోషల్‌లో ట్రంప్ తాజా పోస్ట్.. ఇరాన్‌పై కీలక ప్రకటన
- ఇరాన్ ఇకపై యురేనియం శుద్ధి చేయదని వెల్లడి
- అణు ధూళిని తవ్వి తొలగించేందుకు ఇరాన్ కు సాయం చేచేస్తామని ప్రకటన
- తమ స్పేస్ ఫోర్స్ ఉపగ్రహాలు ఇరాన్ పై ఓ కన్నేసి ఉంచాయని వ్యాఖ్యలు

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌లో అత్యంత ఫలవంతమైన రీతిలో పాలన మార్పు జరిగిందని, ఆ దేశంతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ అయిన 'ట్రూత్ సోషల్' వేదికగా ఆయన ఈ మేరకు ఒక పోస్ట్ చేశారు. ఇరాన్ ఇకపై యురేనియం శుద్ధి చేయదని ట్రంప్ తన పోస్టులో స్పష్టం చేశారు. భూమిలో లోతుగా పాతిపెట్టిన అణు ధూళిని తవ్వి తొలగించేందుకు ఇరాన్‌కు అమెరికా సహాయం చేస్తుందని తెలిపారు. ఇరాన్ ప్రస్తుతం అత్యంత కచ్చితమైన శాటిలైట్ నిఘాలో ఉందని, దాడి జరిగిన నాటి నుంచి అక్కడ ఏదీ మార్పు



చెందలేదని పేర్కొన్నారు. తమ స్పేస్ ఫోర్స్ ఉపగ్రహాలు ఇరాన్ పై ఓ కన్నేసి ఉంచాయని వివరించారు. ఇరాన్‌తో టారిఫ్‌లు, ఆంక్షల ఉపశమనంపై తాము చర్చలు జరుపుతామని కూడా ట్రంప్ వెల్లడించారు. ఇరు దేశాల మధ్య ఉన్న 15 డిమాండ్లలో చాలా వాటికి ఇప్పటికే అంగీకారం కుదిరిందని ఆయన తన పోస్టులో వివరించారు.

### నాదర్గూల్ భూములపై

## హరీశ్ కు పొంగులేటి కౌంటర్

హైదరాబాద్, ఏప్రిల్ 08 (భారత శక్తి) :నాదర్‌గుల్‌లో భూములను 2014లోనే నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం మూడు సంస్థలకు అప్పగించిందని, వారి హయాంలోనే ఆ సంస్థల పేరిట రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ కూడా జరిగిందని తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. నాడు జరిగిన రిజిస్ట్రేషన్‌తో తమ ప్రభుత్వానికేం సంబంధమని మండిపడ్డారు. నాదర్‌గుల్ భూములను తమ ప్రభుత్వం హయాంలో కట్టబెట్టినట్లు ఆరోపణలు చేయడాన్ని ఆయన ఖండించారు. హరీశ్ రావు చెబుతోన్న భూముల్లో 2022లోనే నిర్మాణాలు ప్రారంభమయ్యాయని అన్నారు. ఆ సమయంలో బీఆర్ఎస్ అధికారంలో ఉందని గుర్తు చేశారు. తమకు నాలా కన్వర్షన్ ఇవ్వలేదని భూములు పొందినవారు 2022లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తే, నాటి కేసీఆర్ ప్రభుత్వం కనీసం కౌంటర్ దాఖలు చేయలేదని ఆరోపించారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆ భూములు ప్రభుత్వానివేనని కౌంటర్ దాఖలు చేశామని వెల్లడించారు. నాడు వాటాల కోసం భూములు కట్టబెట్టిన వారు ఇప్పుడు తమపై నిందలు మోపుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావు చెబుతున్న కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరూ లేరని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. నాదర్‌గుల్ భూముల వ్యవహారానికి సంబంధించిన కంపెనీల్లో తన కుటుంబ సభ్యులు ఎవరైనా ఉంటే నిరూపించాలని సవాల్ చేశారు. కాగా, నాదర్‌గూల్ భూముల వ్యవహారంపై ఇటీవల రాజకీయ దుమారం చెలరేగుతోంది. రూ.7 వేల కోట్ల విలువైన 373 ఎకరాల ప్రభుత్వ భూమిని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రైవేటు కంపెనీలకు కట్టబెట్టిందని హరీశ్ రావు ఆరోపిస్తున్నారు. అయితే ఈ భూమి యజమాని ఏక్యూ రియాల్టర్ అని చెబుతున్నారు. ఇది ప్రైవేటు భూమి అని హైకోర్టు, సుప్రీంకోర్టు గుర్తించాయని ఏక్యూ రియాల్టర్ అడ్వకేట్ ఇటీవల తెలిపారు.

## సీఎస్ఆర్: ఖర్చు కాదు.. అభివృద్ధిలో భాగస్వామ్యం!

హైదరాబాద్, ఏప్రిల్ 08 (భారత శక్తి) :కార్పొరేట్ సామాజిక బాధ్యత (CSR) నిధుల వినియోగంపై తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. సమాజాభివృద్ధికి చేసే వ్యయాన్ని కేవలం ఒక 'ఖర్చు'గా కాకుండా, ప్రభుత్వంతో కలిపి చేసే 'భాగస్వామ్యం'గా చూడాలని కార్పొరేట్ సంస్థలకు ఆయన పిలుపునిచ్చారు. బుధవారం హైదరాబాద్‌లో వివిధ కార్పొరేట్ కంపెనీల ప్రతినిధులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సీఎస్ఆర్ నిధుల వినియోగంపై ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, కార్పొరేట్ సంస్థల పాత్రను ఆయన వివరించారు.

**ప్రాధాన్యత రంగాలను మీరే ఎంచుకోండి**

కంపెనీలు సీఎస్ఆర్ కింద చేస్తున్న వ్యయం వందకు వంద శాతం సత్ఫలితాలు ఇచ్చేలా ఉండాలని సీఎం ఆకాంక్షించారు. తమ ప్రభుత్వం ప్రధానంగా విద్య, వైద్యం, జల వనరుల సంరక్షణకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సీఎం స్పష్టం చేశారు. కంపెనీలు వీటితో పాటు తమకు ఆసక్తి ఉన్న ఏ రంగాన్నైనా (నైపుణ్య శిక్షణ, వారసత్వ కట్టడాల పరిరక్షణ, అడవుల సంరక్షణ తదితరాలు) ఎంచుకుని సీఎస్ఆర్ నిధులను వినియోగించవచ్చని సూచించారు. ఏ రంగాన్ని ఎంచుకున్నా ప్రభుత్వం తరఫున అవసరమైన పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కంపెనీలు స్థానికంగా ఉన్న మౌలిక వసతులను వినియోగించుకుంటున్నందున, తమ సీఎస్ఆర్ నిధుల్లో ఎక్కువ భాగాన్ని అదే ప్రాంత అభివృద్ధికి కేటాయించాలని కోరారు.

**భవిష్యత్ తరాలపై పెట్టుబడి.. విద్యే**

విద్యపై పెట్టే వ్యయాన్ని తాము భవిష్యత్ తరాలపై పెట్టే పెట్టుబడిగా భావిస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. "రాష్ట్రంలోని మొత్తం విద్యార్థుల్లో 44 శాతం మంది హైదరాబాద్ నగరంలోనే ఉన్నారు. వారికి నాణ్యమైన విద్య అందించాల్సిన బాధ్యత మన అందరిపైనా ఉంది. ప్రభుత్వంతో పాటు కంపెనీలు భాగస్వామ్యమై చేసే వ్యయంతో.. తెలంగాణ విద్యార్థులను ప్రపంచస్థాయి నైపుణ్యం ఉన్నవారిగా తీర్చిదిద్దగలం. తద్వారా వారు భవిష్యత్ అవకాశాలను అందిపుచ్చుకునేలా తయారు చేయవచ్చు" అని ముఖ్యమంత్రి వివరించారు.

**సీఎస్ఆర్ పర్యవేక్షణకు ప్రత్యేక అధికారి**

సీఎస్ఆర్ నిధుల వినియోగంలో ఇప్పటి వరకు సరైన విధానం, పర్యవేక్షణ లేనందున.. తమ ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టిందని సీఎం తెలిపారు. ఈ నిధుల సమన్వయం కోసం ప్రత్యేకంగా ఒక ప్రధాన కార్యదర్శి (Principal Secretary) స్థాయి అధికారిని నియమించినట్లు వెల్లడించారు. కంపెనీల ప్రతినిధులు ఈ అధికారితో సమన్వయం చేసుకుని పనులు చేపట్టవచ్చని సూచించారు.

- **ముందుకొచ్చిన దిగ్గజ సంస్థలు.. సీఎం అభినందనలు**

విద్యాభివృద్ధికి తమ వంతు సాయంగా సీఎస్ఆర్ నిధులను కేటాయించేందుకు పలు దిగ్గజ సంస్థలు ముందుకొచ్చాయి. ఈ సందర్భంగా ఆయా సంస్థల ప్రతినిధులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు.

### హైదరాబాద్‌లో ఘోర ప్రమాదం

## ముగ్గురు మృతి

హైదరాబాద్, ఏప్రిల్ 08 (భారత శక్తి) :హైదరాబాద్‌లోని సాగర్ రోడ్డు హస్తినాపురం వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి చెందారు. మద్యం మత్తులో హోండా కారును వేగంగా నడిపిన ఒక డ్రైవర్, రోడ్డు మీద నడిచి వెళుతున్న యువకుడిని, బైక్ మీద వెళుతున్న మరో ఇద్దరు యువకులను ఢీకొట్టి 100 మీటర్ల దూరం వరకు ఈడ్చుకుని వెళ్లాడు. ఆ తర్వాత కారు పల్టీ కొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న మహావీర్ ఇంజినీరింగ్ కాలేజీ విద్యార్థులు శివ, సందీప్ మృతి చెందారు. రోడ్డుపై నడిచి వెళుతున్న యువకుడు కూడా ఈ ఘటనలో మృతి చెందాడు. కాలేజీ విద్యార్థులు కారు డ్రైవర్‌పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ఆందోళనకు దిగారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. డ్రైవర్‌ను తమకు అప్పగించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు.

### రేపే ముక్కోణపు పోరు

## కేరళ, అసోం, పుదుచ్చేరిలో పోలింగ్

ఢిల్లీ, ఏప్రిల్ 08 (భారత శక్తి) : దేశవ్యాప్తంగా రాజకీయ ఆసక్తిని రేకెత్తిస్తున్న అసెంబ్లీ ఎన్నికల పర్వంలో మరో కీలక ఘట్టానికి రంగం సిద్ధమైంది. రేపు (ఏప్రిల్ 9) గురువారం నాడు రెండు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతంలో ఒకే విడతలో పోలింగ్ జరగనుంది. అసోం, కేరళ రాష్ట్రాలతో పాటు పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంత ప్రజలు తమ తీర్పును ఇవ్వనున్నారు. మూడు ప్రాంతాల్లో కలిపి 6.1 కోట్లకు పైగా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ ఎన్నికలు ప్రాంతీయ, జాతీయ పార్టీలకు ఒక అగ్నిపరీక్షగా మారనున్నాయి. తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌తో పాటు ఈ ఎన్నికల ఫలితాలను కూడా మే 4వ తేదీన ప్రకటించనున్నారు.

**అసోం**

అసోంలోని మొత్తం 126 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే కూటమిలో భాగంగా బీజేపీ వరుసగా మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని పట్టుదలగా ఉంది. ప్రస్తుత ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఈ ఎన్నికల్లో పార్టీ ప్రచారానికి సారథ్యం వహిస్తున్నారు. 20162021 మధ్యకాలంలో శర్బానంద సోనోవాల్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. మరోవైపు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గౌరవ్ గొగోయ్ నేతృత్వంలో పునరుజ్జీవం కోసం ప్రయత్నిస్తోంది. ఆరు పార్టీలతో కూటమి ఏర్పాటు చేసి బరిలోకి దిగుతోంది. అఖిల్ గొగోయ్‌కు చెందిన రైజోర్ దళ్, లురిన్‌జ్యోతి గొగోయ్ నేతృత్వంలోని అసోం జాతీయ పరిషత్ ఈ కూటమిలో కీలక పార్టీలుగా ఉన్నాయి. రాష్ట్రంలో మొత్తం 2.5 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో దాదాపు సమానంగా 1.25 కోట్ల మంది పురుషులు, మహిళలు ఉన్నారు. అలాగే 318 మంది ట్రాన్స్‌జెండర్లు, 1819 ఏళ్ల మధ్య వయసున్న 6.42 లక్షల మంది తొలిసారి ఓటు వేయనున్నారు.

**కేరళ**

దేశంలో కమ్యూనిస్టులకు చివరి కంచుకోటగా ఉన్న కేరళలో అధికారాన్ని నిలబెట్టుకునేందుకు సీపీఎం నేత, ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రంగా శ్రమిస్తున్నారు. రాష్ట్రంలోని 140 అసెంబ్లీ స్థానాల్లో పోలింగ్ జరగనుంది. గత నాలుగు దశాబ్దాలుగా కేరళలో ఎల్‌డీఎఫ్, యూడీఎఫ్ కూటములు ప్రత్యామ్నాయంగా అధికారంలోకి వస్తున్నాయి. అయితే, 2021లో సీపీఎం నేతృత్వంలోని లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) వరుసగా రెండోసారి గెలిచి ఈ సంప్రదాయానికి తెరదించింది. ఇంతకుముందు ఎల్‌డీఎఫ్ 1980, 1987, 1996, 2006, 2016లో అధికారంలోకి వచ్చింది. మరోవైపు, కాంగ్రెస్ నేతృత్వంలోని యునైటెడ్ డెమోక్రటిక్ ఫ్రంట్ (యూడీఎఫ్) ఈసారి ఎలాగైనా తిరిగి అధికార పగ్గాలు చేపట్టాలని భావిస్తోంది. ఈ కూటమి 1982, 1991, 2001, 2011లలో ప్రభుత్వాలను ఏర్పాటు చేసింది. కేరళలో మొత్తం 2.71 కోట్ల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 1.39 కోట్ల మంది మహిళలు, 1.32 కోట్ల మంది పురుషులు, 273 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారు. 4.66 లక్షల మంది యువత తొలిసారి ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు.

**పుదుచ్చేరి**

కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలోని 30 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్డీయే ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆల్ ఇండియా ఎన్.ఆర్. కాంగ్రెస్ (ఏఐఎన్ఆర్‌సీ) అధినేత, ముఖ్యమంత్రి ఎన్. రంగస్వామి ఐదోసారి ముఖ్యమంత్రి పీఠంపై కన్నేశారు. కాంగ్రెస్ పార్టీలో తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించిన 76 ఏళ్ల రంగస్వామి, 1990లలో మంత్రిగా పనిచేశారు. 2001లో తొలిసారి, 2006లో రెండోసారి ముఖ్యమంత్రి అయ్యారు. కాంగ్రెస్‌తో విభేదాల కారణంగా 2008లో వైదొలిగి, సొంతంగా ఏఐఎన్ఆర్‌సీ పార్టీని స్థాపించారు. 2011లో మళ్లీ గెలిచి మూడోసారి సీఎంగా బాధ్యతలు చేపట్టారు. 20162021 మధ్య ప్రతిపక్ష నేతగా వ్యవహరించి, 2021లో ఎన్డీయే కూటమిలో భాగంగా నాలుగోసారి ముఖ్యమంత్రి అయ్యారు. ఇక్కడ మొత్తం 9.44 లక్షల మంది ఓటర్లు ఉండగా, వీరిలో 5 లక్షల మంది మహిళలు, 4.43 లక్షల మంది పురుషులు, 139 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. 23,033 మంది యువత తొలిసారి ఓటు వేయనున్నారు.

### శాంతి ఒప్పందం వేళ..

## ఇరాన్ ఆయిల్ రిఫైనరీపై దాడి

టెహ్రాన్/కువైట్ సిటీ: కాల్పుల విరమణకు అంగీకారం కుదిరినట్లు వార్తలు వెలువడిన కొన్నిగంటలకే, లావన్ ద్వీపంలోని ఆయిల్ రిఫైనరీపై దాడి జరిగినట్లు ఇరాన్ తెలిపింది. ఇక్కడి చమురు శుద్ధి కేంద్రాన్ని శత్రువులు లక్ష్యంగా చేసుకున్నట్లు పేర్కొంది. టెహ్రాన్ కూడా ప్రతీకార దాడులు నిర్వహించింది. యూఏఇ, కువైట్‌లపై క్షిపణి, డ్రోన్ దాడులకు పాల్పడింది. నేషనల్ ఇరానియన్ ఆయిల్ రిఫైనింగ్ అండ్ డిస్ట్రిబ్యూషన్ (ఎన్ఐఓఆర్డీసీ) కంపెనీ లావన్‌పై దాడిని ధృవీకరించింది. ఈ దాడిని పిరికిపంద చర్యగా అభివర్ణించింది. చెలరేగిన మంటలను అదుపు చేయడానికి వెంటనే భద్రతా మరియు అగ్నిమాపక సిబ్బంది బృందాలు రంగంలోకి దిగాయి. క్షేత్రస్థాయిలోని సిబ్బందిని సకాలంలో తరలించడం వల్ల ఎలాంటి ప్రాణనష్టం సంభవించలేదని ఎన్ఐఓఆర్డీసీ తెలిపింది. ఇరాన్ జాతీయ ఇంధన సరఫరా మరియు పంపిణీలో ఎలాంటి ఇబ్బంది లేదని ఎన్ఐఓఆర్డీసీ స్పష్టం చేసింది. అయితే పౌరులు ఇంధన వినియోగాన్ని నియంత్రించుకోవాలని, అనవసర ప్రయాణాలను నివారించాలని, వీలైనంత వరకు ప్రజా రవాణాను ఉపయోగించుకోవాలని కోరింది. కువైట్‌లోని పలు చమురు, విద్యుత్ క్షేత్రాలపై దాడులు జరిగాయి. దాదాపు 28 ఇరాన్ డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థ అడ్డుకుందని కువైట్ రక్షణ మంత్రిత్వ శాఖ అధికారులు వెల్లడించారు. చమురు శుద్ధి కేంద్రాలు, విద్యుత్ ప్లాంట్లపై డ్రోన్ దాడులు జరగడంతో భారీ నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. యూఏఈలోని కొన్ని ప్రాంతాలపై కూడా క్షిపణి దాడులు జరిగాయి.

## రెవెన్యూ శాఖపై బాబు సమీక్ష.. లక్షల కుటుంబాలకు లబ్ధి!

అమరావతి, ఏప్రిల్ 08 (భారత శక్తి) : రాష్ట్రంలోని లక్షలాది కుటుంబాలకు భూ సమస్యల నుంచి విముక్తి కల్పిస్తూ, వారి ఆస్తులకు పూర్తి భద్రత కల్పించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంచలన నిర్ణయాలు తీసుకున్నారు. దశాబ్దాలుగా నలుగుతున్న అనేక రెవెన్యూ వివాదాలకు చరమగీతం పాడుతూ, ముఖ్యంగా పేద, మధ్యతరగతి వర్గాలకు లబ్ధి చేకూర్చేలా ప్రజా ప్రభుత్వం చారిత్రాత్మక అడుగులు వేసింది. బుధవారం సచివాలయంలో రెవెన్యూ శాఖపై నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో, లక్షలాది కుటుంబాలకు వరంగా మారే కీలక ఆదేశాలు జారీ చేశారు.

**రీసర్వే 2.0కు పక్కా ప్రణాళిక**

గత ప్రభుత్వ హయాంలోని రీసర్వే అస్తవ్యస్తంగా మారిందని, దానిని సరిదిద్దేందుకు 'రీసర్వే 2.0'ను పక్కా ప్రణాళికతో పూర్తి చేయాలని సీఎం స్పష్టం చేశారు. 2027 మార్చి నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేసి, రాష్ట్రంలోని 1.12 కోట్ల మంది రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు అందించాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటివరకు సర్వే పూర్తయిన 6,976 గ్రామాల్లో 5,717 గ్రామాలకు సంబంధించి 22.79 లక్షల పాసు పుస్తకాల పంపిణీ జరుగుతోందని అధికారులు వివరించారు. మిగిలిన 1,259 గ్రామాల్లోని 9 లక్షల పాసు పుస్తకాలను ఈ ఏడాది జూలై నాటికి అందించాలని సీఎం ఆదేశించారు. ఆ తర్వాత వచ్చే ఏడాది మార్చి నాటికి మిగిలిన 80 లక్షల పాసు పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలని, ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలని గట్టిగా సూచించారు.

**ఇనాం భూములకు విముక్తి**

రాష్ట్రంలో ఏళ్ల తరబడి సంక్లిష్టంగా మారిన ఇనాం భూముల సమస్యకు చంద్రబాబు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. 1.37 లక్షల ఎకరాల విలేజ్ సర్వీస్ ఇనాం భూములను నిషేధిత ఆస్తుల జాబితా (22ఏ) నుంచి తొలగిస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారు. దీంతో పాటు ఇతర సర్వీస్ ఇనాంల పరిధిలోని మరో లక్ష ఎకరాల భూములకు కూడా విముక్తి కల్పించేందుకు వీలుగా కొత్త చట్టం తీసుకురావాలని అధికారులను ఆదేశించారు.

### హైడ్రా పనితీరుకు జాతీయ ఖ్యాతి..

## చెన్నైలోనూ అమలుకు సీఎండీఏ ఆసక్తి!

హైదరాబాద్, ఏప్రిల్ 08 (భారత శక్తి) : హైదరాబాద్‌లో ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణ, నాలాల పునరుద్ధరణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా' (హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) పనితీరు జాతీయ స్థాయిలో ప్రశంసలు అందుకుంటోంది. హైదరాబాద్ నగరంలో హైడ్రా చేపడుతున్న చర్యలను ఆదర్శంగా తీసుకుని, తమ నగరంలో వరదల నివారణకు వినియోగించుకోవాలని చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సీఎండీఏ) ఆసక్తి చూపుతోంది. ఈ మేరకు సీఎండీఏ ఉన్నతాధికారుల బృందం ఒకటి హైదరాబాద్‌లో పర్యటించి, హైడ్రా కార్యకలాపాలను అధ్యయనం చేసింది. ఈ ప్రశంసలకు తగ్గట్టుగానే హైడ్రా తన దూకుడును కొనసాగిస్తూ నగరంలో మరో భారీ ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసింది. శేరిలింగంపల్లి మండలం ఖానామెట్‌లో రూ.1,200 కోట్ల విలువైన 8 ఎకరాల ప్రభుత్వ భూమిని మంగళవారం కబ్జాదారుల చెర నుంచి విడిపించింది. ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో తన నిబద్ధతను మరోసారి చాటుకుంది. ఖానామెట్‌లోని సర్వే నంబర్ 55లో ఉన్న ఈ అత్యంత విలువైన భూమిని కొన్ని ప్రైవేటు నిర్మాణ సంస్థలు ఆక్రమించుకుని, తాత్కాలిక నిర్మాణాలు చేపట్టాయి. దీనిపై అందిన ఫిర్యాదుల మేరకు రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు, రెవెన్యూ రికార్డులను పరిశీలించి అది ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్నారు. వెంటనే అక్కడి తాత్కాలిక నిర్మాణాలను కూల్చివేసి, స్థలాన్ని తమ అధీనంలోకి తీసుకున్నారు. ఆ భూమి చుట్టూ కంచె వేసి, ప్రభుత్వ ఆస్తి అని సూచించే బోర్డులను ఏర్పాటు చేశారు.

**నాలాల పునరుద్ధరణపై ప్రత్యేక దృష్టి**

ఇటీవల చెన్నై నుంచి వచ్చిన సీఎండీఏ అధికారుల బృందం హైడ్రా పనితీరును క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు తెలిసింది. ముఖ్యంగా నాలాలు, చెరువుల పునరుద్ధరణలో హైడ్రా అనుసరిస్తున్న వ్యూహాలపై వారు ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వారికి అమీర్‌పేట, ప్యాట్నీ నాలాల విస్తరణ పనుల పురోగతిని, వాటి ద్వారా వరద ముప్పును తగ్గించే ప్రణాళికలను వివరించినట్లు సమాచారం. హైడ్రా పనితీరు అద్భుతంగా ఉందని, ఈ మోడల్‌ను చెన్నైలో అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని సీఎండీఏ బృందం కొనియాడినట్లు తెలిసింది. 2024లో తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రా అనతికాలంలోనే తన పనితీరుతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. చెరువులు, పార్కులు, నాలాలతో పాటు విలువైన ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తూ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు కవచంలా నిలుస్తోంది.


# విస్తరణ 'భారం'.. పాలన 'తీరం'!









భాగ్యనగర్ మున్సిపల్ జి.హెచ్.యమ్.సి ఎంప్లాయిస్ యూనియన్
BHAGYANAGAR MUNICIPAL GHMC EMPLOYEES UNION
Regd No : B-1157 Affiliated to Bharatiya Mazdoor sangh
Recognised Union
Union Off : GHMC Head Office, Tankbund, Hyd. | State Off: TRT-141, Tilak Bhavan, St.No.9, RTC 'X' Roads, Hyd-20.

Date:06.03.2026

To
The Hon'ble Chief Minister
Government of Telangana
Hyderabad.

Respected Sir,

Sub: Recruitment of staff, providing minimum office infrastructure and transport facility – Request – Regarding.

### ###

With due respect I submit the following for kind consideration and to pass suitable orders in the matter.

Now the GHMC area expanded by merging 27 Municipalities and created CMC, MMC. Earlier the area of GHMC limit to 650 Sq.kms., but now it expanded about 2400 Sq.kms. By merging the huge area formed 60 Circles, there is shortage of staff for the expended Urban City limit of about 1.40 Crores population. Whereas about 30,000+ employees services are needed to look after the daily activities, but the existing staff are over burdened. There is need for recruitment of staff is imminent. While recruiting First priority may be given to qualified Outsourcing personals who have sufficient experience.

Similarly minimum office infrastructure, transport facility by procuring vehicles for officers and staff and to utilise the transport workshop services.

I, therefore request sir, your kind authority to look into the matter and pass suitable orders in the matter at an early date.

Yours faithfully,

General Secretary

Copy to: The Special Officer, GHMC, CMC & MMC
The Commissioner, GHMC

హైదరాబాద్, ఏప్రిల్ 8 (భారత శక్తి) : నగరం నలుదిశలా విస్తరిస్తోంది. ఐటీ కారిడార్లు, నివాస సముదాయాలతో భాగ్యనగరం విశ్వనగరంగా రూపాంతరం చెందుతోంది. అయితే, భౌగోళికంగా జి.హెచ్.యమ్.సి (GHMC) పరిధి పెరిగినప్పటికీ, దానికి అనుగుణంగా యంత్రాంగం బలోపేతం కాకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొత్తగా ఏర్పడిన సి.ఎమ్.సి (CMC), ఎమ్.ఎమ్.సి (MMC)లతో పని పరిధి భారీగా పెరిగినా, పాత సిబ్బందితోనే నెట్టుకురావడం 'పాలనా విఘాతానికి' దారితీస్తోంది.

*** 650 నుంచి 2400.. విస్తరణ అమోఘం!**

ఒకప్పుడు కేవలం 650 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్న హైదరాబాద్ మహానగరం, సమీపంలోని 27 మున్సిపాలిటీల విలీనంతో ఇప్పుడు ఏకంగా 2400 చదరపు కిలోమీటర్లకు చేరింది. సుమారు 1.40 కోట్ల జనాభాకు తాగునీరు, పారిశుధ్యం, రోడ్లు, వీధి దీపాల వంటి మౌలిక వసతులు కల్పించడంలో క్షేత్రస్థాయి సిబ్బంది పాత్ర కీలకం. కానీ, పెరిగిన విస్తీర్ణానికి తగ్గట్టుగా పోస్టుల భర్తీ జరగకపోవడంతో ఉన్నవారిపై పనిభారం రెట్టింపైంది.

*** సిబ్బంది కొరత: గణాంకాలు చెబుతున్న వాస్తవం**

నిపుణుల అంచనా ప్రకారం, ఇంతటి భారీ విస్తీర్ణం మరియు జనాభా కలిగిన నగరానికి కనీసం 30,000 మందికి పైగా ఉద్యోగుల సేవలు అవసరం. ప్రస్తుతం ఉన్న సిబ్బంది అదనపు సర్కిళ్ల బాధ్యతలను మోయలేక సతమతమవుతున్నారు. ఒక్కో ఉద్యోగి ఇద్దరు, ముగ్గురు చేయాల్సిన పనిని ఒంటరిగా చేయాల్సి వస్తోంది. ఇది కేవలం ఉద్యోగుల ఆరోగ్యంపైనే కాక, ప్రజా సమస్యల పరిష్కార వేగంపై కూడా ప్రతికూల ప్రభావం చూపుతోంది.

*** అవుట్‌సోర్సింగ్ 'అండ' అవసరం**

మున్సిపల్ శాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఈ నియామకాల్లో పెద్దపీట వేయాలని ఉద్యోగ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో నగర భౌగోళిక పరిస్థితులపై పూర్తి అవగాహన ఉన్న వీరిని క్రమబద్ధీకరించడం లేదా కొత్త నియామకాల్లో ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పాలనను త్వరితగతిన గాడిలో పెట్టవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.

*** మౌలిక వసతులు మృగ్యం**

కేవలం సిబ్బంది కొరతే కాకుండా, కొత్త కార్యాలయాల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడం మరో లోపం.

*** రవాణా కష్టాలు: క్షేత్రస్థాయి తనిఖీలకు వెళ్లడానికి అధికారులకు సరిపడా వాహనాలు లేవు.**

*** కార్యాలయ వసతి: ఫర్నిచర్, కంప్యూటర్లు మరియు ఇతర సాంకేతిక పరికరాల కొరత వేధిస్తోంది.**

వర్క్‌షాప్ సేవలు: అందుబాటులో ఉన్న రవాణా వర్క్‌షాప్ సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోవడం వల్ల ఉన్న వాహనాలు కూడా మరమ్మతులకు గురవుతున్నాయి.

*** ప్రభుత్వ నిర్ణయం కోసమే నిరీక్షణ**

నగరం 'గ్రేటర్' నుంచి 'మెగా'గా మారుతున్న తరుణంలో, మౌలిక వసతుల కల్పనలో మానవ వనరుల పాత్రను విస్మరించలేం. కొత్తగా ఏర్పడిన మున్సిపల్ కార్పొరేషన్లకు తక్షణమే బడ్జెట్ కేటాయించి, యుద్ధప్రతిపాదికన నియామకాలు చేపడితేనే హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ నిలబడుతుంది. లేని పక్షంలో, పెరిగిన పనిభారం ఉద్యోగులను కుంగదీయడమే కాకుండా, నగర అభివృద్ధికి ఆటంకంగా మారే ప్రమాదం ఉంది.




## ప్రపంచంలో శాంతి నెలకొనాలి..


### : ప్రొఫెసర్ కోదండరాం

ఎల్బీనగర్, ఏప్రిల్ 08 (భారత శక్తి): యుద్ధం వల్ల విధ్వంసం, వినాశనమే తప్ప ప్రజలకు ఒరిగేదేమీ లేదని తెలంగాణ జేఏసీ చైర్మన్ ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. జరుగుతున్న యుద్ధాన్ని వెంటనే ఆపితే ప్రపంచంలో శాంతి నెలకొంటుందని తెలిపారు. బుధవారం ఉదయం సరూర్ నగర్ కొత్తపేటలోని విక్టోరియా మెమోరియల్ హోమ్ నుండి కొత్తపేట చౌరస్తా వరకు తెలంగాణ స్టడీ ఫోరం, వాకర్స్ అసోసియేషన్ సంయుక్తంగా వేలాది మంది వాకర్స్ తో నిర్వహించిన శాంతి ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. యుద్ధం చేసి శాంతి నెలకొల్పాలనుకోవడం మూర్ఖత్వమన్నారు. ట్రంప్ దమనకాండ నశించాలన్నారు. యుద్ధం ఆపి ఆయిల్ సంక్షోభాన్ని నివారించి పర్యావరణాన్ని పరిరక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ స్టడీ ఫోరం అధ్యక్షులు శ్రీనివాసచారి, కేవిఎల్, ఎల్బీనగర్ జేఏసీ మాజీ అధ్యక్షులు కెవి రంగారెడ్డి, తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కాచం సత్యనారాయణ గుప్తా, రిటైర్డ్ తహసీల్దార్ లక్ష్మయ్య, బేర బాలకిషన్, జక్కుల శ్రీశైలం యాదవ్, మాజీ కార్పొరేటర్లు ఆకుల శ్రీవాణి, ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి, పగడాల రమణ, పల్లె వినయ్ కుమార్, ఉద్యమకారులు పాల్గొన్నారు.

### అవుట్ డోర్ ప్రకటన విధానంపై

## రాష్ట్ర హైకోర్టు స్టేటస్ కో ఆదేశం జారీ

హైదరాబాద్, ఏప్రిల్ 07 (భారత శక్తి): అవుట్ డోర్ ప్రకటన విధానం - క్యూర్ 2026కు సంబంధించిన 04 మార్చి 2026 తేదీన జారీ చేసిన జి.ఓ. ఎంఎస్ నెం. 84ను సవాల్ చేస్తూ దాఖలైన రిట్ పిటిషన్ల సమూహంలో (డబ్ల్యూ.పీ. నెం. 8313, 8346, 8350 మరియు 8357 ఆఫ్ 2026) స్టేటస్ కో కొనసాగించాలని తెలంగాణ రాష్ట్ర హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారాలను న్యాయమూర్తి జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ విచారించారు. ఈ పిటిషన్లలో ముఖ్యమైనదైన డబ్ల్యూ.పీ. నెం. 8350 ఆఫ్ 2026ను తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ (టోమో) తరపున, దాని కార్యదర్శి కొంకల రమేష్ మరియు ఇతర పిటిషనర్లు దాఖలు చేసి, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వు మరియు విధానం చట్టబద్ధత, అమలుపై ప్రశ్నలు లేవనెత్తారు. వాదనలు వినిన అనంతరం, ఈ అంశం విస్తృత ప్రజా ప్రాధాన్యత కలిగినదిగా గౌరవనీయ కోర్టు అభిప్రాయపడింది మరియు దీన్ని సమగ్రంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొంది. తదనుగుణంగా ప్రతివాదులు తమ కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశిస్తూ, కోర్టు పేర్కొంది. "ఇంతలో, పిటిషనర్లకు సంబంధించి ప్రస్తుత పరిస్థితిని యథాతథంగా కొనసాగించాలి." జి.ఓ. ఎంఎస్ నెం. 84 మరియు అవుట్ డోర్ ప్రకటన విధానం - క్యూర్ 2026పై పిటిషనర్లు అనేక ఆందోళనలు వ్యక్తం చేశారు. ముఖ్యంగా, భాగస్వాముల ప్రతిపాదనలను




సరైన రీతిలో పరిగణలోకి తీసుకోకపోవడం, కోర్టు ముందు ఇచ్చిన పూర్వ ఆదేశాలున్నప్పటికీ వినిపించే అవకాశం ఇవ్వకపోవడం వంటి అంశాలను వారు ప్రస్తావించారు. అలాగే డబ్ల్యూ.పీ. నెం. 5442 ఆఫ్ 2026లో జరిగిన పరిణామాలు మరియు పక్షాల వాదనలు కూడా విచారణలో ప్రస్తావించబడ్డాయి. కాగా ఈ మధ్యంతర ఉపశమనం (ఇంటిరిమ్ రిలీఫ్)ను స్వాగతిస్తూ, తెలంగాణ అవుట్ డోర్ మీడియా ఓనర్స్ అసోసియేషన్ తెలిపింది .ఈ ఆదేశం భాగస్వాములకు తక్షణ రక్షణను అందించడంతో పాటు, ఈ అంశానికి ఉన్న విస్తృత ప్రజా మరియు పరిశ్రమ ప్రాధాన్యతను గుర్తించిందని పేర్కొంది. తెలంగాణలో అవుట్ డోర్ ప్రకటన రంగం ఆరు దశాబ్దాల చరిత్ర కలిగి ఉండి, ప్రత్యక్ష మరియు పరోక్ష ఉపాధిని విస్తృతంగా కల్పిస్తున్నదని సంఘం వెల్లడించింది. అన్ని భాగస్వాములకు సముచితమైన వాదనావకాశం కల్పించిన తరువాత ఈ అంశంపై న్యాయపరంగా తుది తీర్పు వెలువడుతుందనే నమ్మకాన్ని సంఘం వ్యక్తం చేసింది. చట్టబద్ధంగా హోర్డింగ్ ప్రకటనలు నిర్వహిస్తున్న వారి హక్కులను రక్షించేందుకు అవసరమైన న్యాయపరమైన చర్యలను కొనసాగిస్తామని సంఘం పునరుద్ఘాటించింది.

### డీసీఎం డ్రైవర్ అదృశ్యం...

## కుటుంబ సభ్యుల ఆందోళన



ఎల్బీనగర్, ఏప్రిల్ 08 (భారత శక్తి): డీసీఎం వాహనంతో పుచ్చకాయలు అమ్మేందుకు వచ్చి డ్రైవర్ అదృశ్యమైన ఘటన స్థానికంగా కలకలం రేపింది. నాగోల్ పోలీస్ స్టేషన్ సీఐ మహమ్మద్ మక్బూల్ జాన్ అందించిన వివరాల ప్రకారం... కామారెడ్డి జిల్లా లింగపేట్ మండలం మంగరం గ్రామానికి చెందిన కొమ్ముల రవి యాదవ్ (37), తండ్రి మల్లయ్య, వృత్తి డ్రైవర్. జీవనోపాధి కోసం డీసీఎం వాహనంలో పుచ్చకాయలు తీసుకుని తన గ్రామస్తులతో కలిసి ఈ నెల 3వ తేదీన నాగోల్ ప్రాంతానికి వచ్చాడు. అల్కాపురి ఎక్స్ రోడ్ వద్ద ఉన్న ఖాళీ స్థలంలో డీసీఎంను నిలిపి పుచ్చకాయల వ్యాపారం నిర్వహిస్తున్నాడు. అయితే ఈ నెల 6వ తేదీన అక్కడి నుండి వెళ్లిన రవి యాదవ్ తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. అతను ఎక్కడికి వెళ్లాడో ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లభించలేదు. ఈ మేరకు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నాగోల్ పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. డ్రైవర్ ఆచూకీ కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. అదృశ్యమైన రవి యాదవ్ గురించి ఎవరికి అయినా సమాచారం తెలిసిన పక్షంలో సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు.

## గుమ్మడిదల రైతులకు న్యాయం చేయండి..

*** భూములు అందించిన ప్రతి రైతుకు వంద గజాలు కేటాయించండి..**

*** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరిన ఎమ్మెల్యే జిఎంఆర్..**



గుమ్మడిదల, ఏప్రిల్ 8 (భారత శక్తి) : గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబరు 109 లో పరిశ్రమల స్థాపన కోసం భూములు అందించిన ప్రతి రైతుకు 100 గజాల ఇళ్ల స్థలం కేటాయించాలని కోరుతూ పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి నేతృత్వంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్యను కోరారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో గుమ్మడిదల మున్సిపల్ చైర్మన్ కుమార్ గౌడ్ తో కలిసి కలెక్టర్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. గుమ్మడిదల మున్సిపల్ కేంద్రంలోని సర్వే నెంబర్ 109లో గల సుమారు 160 ఎకరాల భూమిని పారిశ్రామిక మౌలిక సదుపాయాల కోసం సేకరించిన సమయంలో రైతులకు నష్టపరిహారంతో పాటు ప్రతి ఒక్కరికి వంద గజాల నివాస స్థలం ఇస్తామని అప్పటి కలెక్టర్ వల్లూరు క్రాంతి సమక్షంలో హామీ ఇచ్చినట్లు తెలిపారు. హామీ ఇచ్చి సంవత్సరం గడుస్తున్న నేటి వరకు ప్లాట్ల కేటాయింపు జరగలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్లాట్ల కోసం ఐదు ఎకరాల స్థలాన్ని గుర్తించిన విషయాన్ని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. అయితే ఆ స్థలాన్ని కూడా పరిశ్రమలకు కేటాయించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, అలాంటి చర్యలు తీసుకుంటే తీవ్రంగా పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి ప్లాట్ల కేటాయింపును త్వరితగతిన చేయాలని కోరారు. ఈ సమస్యపై అధికారులతో చర్చించి ప్రతి బాధితుడికి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు యాదగిరి, వెంకట్రాంరెడ్డి, హుస్సేన్ బాధిత రైతులు తదితరులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.